
ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

ఫిబ్రవరి, మార్చి 2021
సంచిక : 439
వెల : 40/-



జనసాహితి ప్రచురణ

కవిత

# ఈ దేశాన్ని చూసి జాలిపడండి!

ఆంగ్లం : లారెన్స్ మాన్‌సాంటో ఫెర్లింగెట్టి

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

గొర్రెలైపోయిన ప్రజలున్న దేశాన్ని చూచి,
వారిని తప్పుదారి పట్టించే కాపరులున్న
దేశాన్ని చూసి జాలిపడండి!
అబద్ధాలాడుతూ,
వివేకుల నోరు నొక్కేసే నాయకులున్న
దేశాన్ని చూసి జాలిపడండి!
మతమూఢులు నిండి వున్న
దేశాన్ని చూసి జాలిపడండి!
విజేతలను స్తుతించడానికి తప్ప
తన గొంతును పెగల్చలేని
దేశాన్ని చూసి జాలిపడండి!
బలప్రయోగంతో, చిత్రహింసలతో
ప్రపంచాన్ని అదిరించి బెదిరించేవారే
హీరోలుగా చలామణీ అయ్యే
దేశాన్ని చూసి జాలిపడండి!
తన భాష, తన సంస్కృతి తప్ప,
మరేదీ తెలియని
దేశాన్ని చూసి జాలిపడండి!
డబ్బే ఊపిరిగా వుండే దేశాన్నీ,
తెగ తిని మత్తులో నిద్రించే
దేశాన్ని చూసి జాలిపడండి!
తమ హక్కులు హరించడాన్ని,
తమ స్వేచ్ఛలను కాలరాయడాన్ని
అనుమతించే ప్రజలు వున్న
దేశాన్ని చూసి జాలిపడండి!
ఓ నా దేశమా!
స్వేచ్ఛా స్వర్గమా!
నీకా కన్నీరు?

'పిటీ ది నేషన్' అనే శీర్షికతో ఖలీల్ జిబ్రాన్ 1933లో రాసిన కవితను అనుకరిస్తూ 2007లో అమెరికన్ కవి లారెన్స్ ఫెర్లింగెట్టి అదే శీర్షికతో రాసిన కవితకు ఇది అనువాదం. పాకిస్తాన్‌ను ఉద్దేశించి దీనిని రాశాడు కాని - ఇది ప్రస్తుతం మన దేశానికి కూడా అన్వయిస్తుంది.

అమెరికన్ కవి, చిత్రకారుడు, సామాజిక కార్యకర్త, పుస్తక విక్రేత, ప్రచురణకర్త అయిన లారెన్స్ మాన్‌సాంటో ఫెర్లింగెట్టి తన 101వ ఏట 2021 ఫిబ్రవరి 22న శాన్‌ఫ్రాన్సిస్కోలో మరణించారు. ఆయన 1919 మార్చి 24న న్యూయార్క్‌లో జన్మించారు.

ఆయన 1947లో ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ. చదివి, జాన్ రస్కిన్ పైనా, బ్రిటీషు చిత్రకారుడు జె.ఎమ్.డబ్ల్యు టర్నర్ పైనా పరిశోధన చేశారు. 1953లో శాన్‌ఫ్రాన్సిస్కోలో 'సిటీలైట్స్' అనే పుస్తకాల దుకాణం స్థాపించి 60 ఏళ్ళపాటు దానిని సాహితీవేత్తల సమావేశ స్థలంగా కూడా ఉపయోగించారు. ప్రచురణకర్తగా బీట్ కవుల కవిత్వం ప్రచురించారు. ఎలెన్ గిన్స్‌బర్గ్ రాసిన 'హౌల్' (HOWL) కవితను ప్రచురించినందుకు, అది అశ్లీలంగా వుందని చెప్పి 1956లో అరెస్టుచేశారు. కాని కోర్టులో విజయం సాధించారు.

తన కవిత 'పాప్యులిస్ట్ మానిఫెస్టో'లో, "కవులారా! మీమీ గూళ్ళ నుండి బయటకు రండి. మీ కిటికీలు, తలుపులు బార్లా తెరవండి. మీరు చాలాకాలంపాటు మీమీ గుహల ప్రపంచంలో వున్నారు. సాహిత్యం, కళ ప్రజలకు అందుబాటులో వుండాలి. అవి కేవలం ఉన్నత విద్యావంతులైన మేధావులకు మాత్రమే చెందినదిగా వుండగూడదు. కవులు, రచయితలు దేశ రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రముఖపాత్ర నిర్వహించాలి" అని ఉద్బోధించారు.

కవితా పఠన కార్యక్రమంలో భాగంగా ఆయన సాల్వడార్ అల్లెండీపైనా, వియత్నాం యుద్ధంపైనా, మే 28 పారిస్ సంఘటనలపైనా, నికరాగ్వాలో సాండనిస్ట్‌పైనా, మెక్సికోలో జాతీయ విముక్తి సైన్యం జపాటిస్టాపైనా ప్రజల్లో కవితలు వినిపించారు. 1968లో వియత్నాం యుద్ధాన్ని నిరసిస్తూ, యుద్ధ పన్నుకు వ్యతిరేకంగా రచయితల, సంపాదకుల నిరసనలో పాల్గొన్నారు.

'P.E.N' (Poets, Play wrights, Editors, Essayists, Novelists) అనే అంతర్జాతీయ సంస్థ యొక్క హంగరీ దేశ శాఖవారు ఆయనకు ప్రకటించిన 64 వేల డాలర్ల బహుమతిని తిరస్కరించారు. కారణం ఆ బహుమతి మొత్తంలో కొంత హంగరీ ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము కూడా వుంది. హంగరీ ప్రభుత్వం భావస్వాతంత్ర్యం ప్రకటనకీ, పౌరహక్కులకు వ్యతిరేకంగా, నిరంకుశంగా ప్రవర్తిస్తున్నందున దానికి నిరసనగా ఆయన ఈ బహుమతిని నిరాకరించారు.

జనసాహితి ప్రచురణ

44 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 44

సంచిక : 07, 08

ఫిబ్రవరి, మార్చి 2021

439

www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : | సింగమనేని నారాయణ అమర్ రహే | | .....01 |
| ❑ రెండవ అట్ట | : | ఈ దేశాన్ని చూసి జాలిపడండి (కవిత) – లారెన్స్ మాన్‌సాంటో ఫెర్లింగెట్టి | | .....02 |
| ❑ మూడవ అట్ట | : | ఆడబిడ్డల ఘోష వినరండి (పాట) – దేవి | | .....51 |
| ❑ నాల్గవ అట్ట | : | అమ్మకానికి దేశం – ఎం. రాంబాబు చిత్రం | | .....52 |
| ❑ సంపాదకీయం | : | విస్తరిస్తున్న అంధవిశ్వాస సంస్కృతిని తిప్పికొడదాం! | | .....05 |
| ❑ సంస్మరణ | : | సింగమనేని నారాయణకు జోహార్లు | | .....07 |
| | : | జనసాహితి 10వ రాష్ట్ర మహాసభల్లో సింగమనేని ప్రారంభోపన్యాసం | | .....26 |
| ❑ కథలు | : | జూదం | – సింగమనేని నారాయణ | .....09 |
| | | బెత్తం ప్రేమను దూరం చేస్తుంది | – మంచికంటి | .....36 |
| ❑ పుస్తక పరిచయం | : | చరిత్రాత్మక రైతు రక్షణ యాత్ర | – రవి | .....15 |
| ❑ గల్పిక | : | అమ్మకానికి దేశం | – శంకరం | .....18 |
| ❑ సమీక్ష | : | దరిశి అన్నపూర్ణమ్మ కథలు | – షేక్ మహబూబ్‌బాషా | .....20 |
| ❑ బాలసాహితి | : | బండి తరుణిశ్రీ, జ్యోత్స్న | | .....25 |
| ❑ కవితలు | : | స్వప్నం గణేష్‌బాబు (06), చిత్తలూరి (08), తన్నీరు నాయబ్ రసూల్, షేక్ కరీముల్లా (14), జనజ్వాల (24), ప్రసన్న (29), అనువాదం : కొత్తపల్లి రవిబాబు (30), శ్రీ వశిష్ఠ సోమేపల్లి (34), డా॥ నెమిలేటి, టి. ఉదయ్ (35), ఓవీవీయస్ లక్ష్మీకుమారి (39), పి. అనంతరావు (45) | | |
| ❑ పాట | : | అమ్మబాబోయ్ ఆ మూడు చట్టాలు | – రౌతు వాసుదేవరావు | .....30 |
| ❑ వ్యంగ్య కథ | : | పెరుగుట – విరుగుట | – పాపినేని శివశంకర్ | .....27 |
| ❑ కరపత్రం | : | విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా | – పిడిఎస్‌ఓ | .....33 |
| ❑ స్పందన | : | టూల్‌కిట్ | – శ్రీశైలం నూకాచారి | .....46 |
| ❑ సినిమా సమీక్ష | : | 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్' | – బాలాజీ కోల్‌కతా | .....31 |
| ❑ ఈ నెల పుస్తకం | : | 'దేశంలో సాగుతున్న రైతుల పోరాటం ఎందుకు?' | | .....48 |
| ❑ వివిధ | : | ప్రజాసాహితి యాజమాన్య వివరాలు (06) ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి (48); చైతన్యవాహిని (49); ఈ పుస్తకాలు అందాయి (50) | | |
| ❑ శాశ్వతనిధి | : | కొత్తపల్లి వెంకటకృష్ణ వర్మ, కొల్లి లక్ష్మీ ప్రసూన (04), వై.వి.రెడ్డి, గొట్టిముక్కల సీతారామరాజు (39) | | |
| ❑ సంతాపాలు | : | (8), (13), (17), (24), (34), (41), (42), (43), (44) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LCCN 94903393
LIBRARY OF CONGRESS

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# కొత్తపల్లి వెంకటకృష్ణవర్మ
## 37వ వర్ధంతి



**కొత్తపల్లి** వెంకటకృష్ణవర్మ స్వాతంత్ర్య సమరయోధులు. వారు దక్షిణ భారత హిందీ ప్రచారసభలోనూ, గాంధీ స్మారక నిధిలోనూ పనిచేశారు. వారు తన 77వ ఏట 26-03-1984న మరణించారు. వారి జ్ఞాపకార్థం వారి పిల్లలు 30 వేల రూపాయలు "ప్రజాసాహితి" శాశ్వతనిధికిచ్చారు. వారికి మా కృతజ్ఞతలు. వర్మగారి 37వ వర్ధంతి సందర్భంగా వారిని గుర్తుచేసుకుంటున్నాం.

ప్రజాసాహితి

# శ్రీమతి కొల్లి లక్ష్మీప్రసూన
## 4వ వర్ధంతి



**శ్రీమతి** కొల్లి (తుమ్మల) లక్ష్మీప్రసూన 26-11-1954లో తెనాలి తాలూకా కూచిపూడిలో జన్మించారు. నగరంలోని వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో బి.కాం. చదివారు. గుండెపోటుతో 12-03-2017లో తెనాలిలో తన 63వ ఏట మరణించారు. వారి రెండవ వర్ధంతి సందర్భంగా భర్త కొల్లి రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ ఎ.సి.టి.వో. 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 25,000 రూపాయలు విరాళంగా ఇచ్చారు. లక్ష్మీప్రసూనగారిని వారి నాల్గవ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం.

ప్రజాసాహితి

## సంపాదకీయం

# విస్తరిస్తున్న అంధ విశ్వాస సంస్కృతిని తిప్పికొడదాం!

"పాత ప్రపంచం" నిజంగా ప్రాణాంతక రుజాగ్రస్తంగా వుంది.
దాని విషపూరిత వాయువులు సోకకుండా తప్పించుకోవడానికి
మనం దాన్ని పరిత్యజించే వేగిరపాటు పడాలి! – గోర్కీ

ఇటీవల మదనపల్లిలో జరిగిన దుర్ఘటన మానవ సమాజానికే సిగ్గుచేటు. కన్న తల్లిదండ్రులే తమ పిల్లల్ని మూఢత్వంతో పొట్టన బెట్టుకున్న సంఘటన మనందర్నీ కలచి వేస్తూంది. రాకెట్ యుగంలో వున్న మన శాస్త్ర జ్ఞానాన్ని అపహాస్యం చేసింది. మనిషి ఆలోచనలను విషపూరితం చేయడానికి, విషాదభరితం చేయడానికి, అచేతనం చేయటానికి సాగుతున్న విచ్ఛిన్న విషసంస్కృతి మూలాలను వెదికి పట్టుకోవాలి. వాటిని పెంచి పోషిస్తున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలపై తక్షణమే యుద్ధం ప్రకటించాలి.

విద్యారంగంలో ఉన్నత స్థాయిలలో వున్న తల్లితండ్రులు – పద్మజ, పురుషోత్తంనాయుడుల చేత క్షుద్ర విలువల మౌఢ్య శక్తులు చేయించిన అకృత్యం ఇది. దీన్ని సావధానంగా చర్చించుకొని, విశ్లేషించుకొని, సామాజిక అవగాహనతో, సాంస్కృతిక వికాసంతో తేరుకొని, తేటపడే పరిస్థితులు మృగ్యమైపోతున్న రాజకీయ, ఆర్థిక పతన విలువలు విషవాయువులై ప్రసరిస్తున్న కూడలిలో మనం వున్నాం.

అలేఖ్య, సాయిదివ్య అనే తమ ఎదిగిన పిల్లల పట్ల క్షుద్ర ఆలోచనలతో దారుణంగా ప్రవర్తించిన సంఘటనలో కన్న తండ్రి పురుషోత్తంనాయుడు మదనపల్లి ప్రభుత్వ మహిళా కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్. పేగు పంచి జన్మనిచ్చిన తల్లి పద్మజ – పట్టణంలోనే పేరుపొందిన మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థ కరస్పాండెంట్. రేపటి తరాన్ని, యువ ప్రపంచాన్ని విద్యావంతుల్ని చేసే కళాశాలల్లో ఈ విద్యాధికులు ఏ విలువల్ని పాదుకొల్పుతారు? చదువంటే ఏమిటి? జ్ఞానానికి నిర్వచనం ఏమిటి? జీవితానికీ – జీవించడానికీ ఉన్న అనుబంధం ఏమిటి? గురజాడ వందేళ్ళ క్రితమే చెప్పినట్లు –

"చదువువారికి వెఱ్ఱిభ్రాంతులు
మెదడుకెక్కిన పాయవందురు
అదునులేదే దేనికైనను
అందరెరుగనిదే?"

పుస్తకాల్లోని మాటల్ని విస్తరించి, అనుభవాల తత్వాన్ని మాటల గారడీ వెనుక తొక్కిపెట్టి, చిలకపలుకు చదువుల పెద్ద మనుషులు చదువుకోనివారికంటే ఎక్కువేమీ కాదు. రంగురాళ్ళు, రాగి యంత్రాలు, జాతక చక్రాలూ, పూజలూ – వ్రతాలూ – మంత్రాలూ – మహిమలూ అంటూ గానుగెద్దులా అక్కడికక్కడే తిరుగుతూ – ఈ జన్మలో కష్ట నష్టాలకు క్రిందటి జన్మల పాపకర్మలే కారణమని – పరలోకప్రాప్తి, స్వర్గలోక విహారం కోసం దేవులాడేలా ప్రజల్ని భ్రమల్లో ఉంచినంత కాలం పాలకవర్గాల వర్తక వాణిజ్య లాభాల దోపిడీ సంస్కృతికి ఢోకా వుండదు. ప్రశ్నించే ప్రజలు తయారవకుండా ఉండడానికి మెదళ్ళను అదుపుచేసే టీవీ, సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలు – సినిమాలు పనిగట్టుకొని మూఢనమ్మకాల్ని, అమానవీయ పతన విలువల్నీ గుమ్మరిస్తూనే వుంటాయి.

**"మతములన్నియు మాసిపోవును**
**జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును!"** అన్నాడు గురజాడ.

కానీ ఈరోజు జ్ఞానం మార్కెట్ సరుకైపోయిన తరువాత వ్యక్తిత్వానికీ, సామాజిక వికాసానికీ – జ్ఞానానికీ ఉన్న చలనశీలమైన కార్యకారణ సంబంధం తెగిపోయింది. అందుకే అంతటి ఉన్నత పదవులలో వున్న మదనపల్లిలో తల్లితండ్రులు, పెద్ద చదువులు చదువుతున్న వాళ్ళ పిల్లలూ (అలేఖ్య (27), సాయిదివ్య (22)) ప్రాణాల్నే తీసుకునేంత జడ మూర్ఖత్వానికి బలయ్యారు. రాత్రి చనిపోయి, ఉదయం తిరిగి బతకడం చాలా సాధారణం అన్నంతగా మౌఢ్యం నిలువెల్లా సాంస్కృతిక విషవాయువుగా కమ్మేసింది.

సాంస్కృతిక సంక్షోభం పెరుగుతున్న క్రమంలో 80వ దశకంలో 'తులసిదళం' పేరుమీద గంజాయి మత్తు ఆనాటి యువతరాన్ని క్షుద్రశక్తులకూ – సూడో సైన్సుకీ మధ్య సుడి తిప్పింది. అందుకే శ్రీశ్రీ – ప్రపంచమంతా నిజం, భగవంతుడొక్కడే మిథ్య అని అంటాడు. 'ఈ మిథ్యను ఆరాధిస్తూ, నిజమైన ప్రపంచాన్ని మరచి పోవడంవల్లనే – ఏ సమస్యకూ పరిష్కారం దొరకక, ఇటువంటి మూఢవిశ్వాసాలకు మానవజాతి గురవుతున్నది!' ఇలాంటి మానసిక రుగ్మతతోనే మదనపల్లి తల్లిదండ్రులు చేజేతులా సొంత బిడ్డల్ని బలితీసుకున్నారు. సామాజిక అభద్రత సమస్య ప్రమాద ఘంటికల్ని మోగిస్తోంది. ఆ సమస్యలకు కారణాల్ని భౌతిక ప్రపంచంలో కాకుండా పరలోకంలో వెతుక్కోవాలని చెప్పే మతం గుప్పెట్లో బితుకు బితుకుమని బతుకుతున్నారు. వునికిలో వున్న సామాజిక వ్యవస్థ జీవన భద్రతని కనీసంగానైనా ఇవ్వడంలేదు. కాబట్టే సంతానం కోసం బాబాల చుట్టూ, సన్నాసుల చుట్టూ తిరిగేవాళ్ళు. ఆడపిల్ల పుట్టిందనీ, ఆ బిడ్డ తనకు కీడు అనే మూఢనమ్మకంతోనే ఆ పసిపిల్లలను చంపి కాలయముళ్ళు అవుతున్నారు కన్నవాళ్ళు. ముసలి తల్లితండ్రులను బలవంతంగా చంపే పిల్లలున్న సమాజమూ మనదే. వైద్యం ఇంతగా అభివృద్ధి చెందినాసరే – ఇంకా నాటువైద్యుల చుట్టూ, సోదె, ప్రశ్నల చుట్టూ – బాబాలూ – ఫకీరులూ, అఘోరాల చుట్టూ ఉన్నత పదవులలో వున్నవాళ్ళే తిరుగుతున్నారు. ప్రజలు సమస్యల కాడెమోస్తూ గుడ్డిగా, దీనంగా వాళ్ళని అనుసరిస్తున్నారు. మరోపక్క – తమ ఆర్థిక పరిస్థితుల మెరుగుదల కోసం టీవీల్లో చెప్పిన, బాబాలూ

అమ్మలు చెప్పిన తాయెత్తులూ, రంగురాళ్ళూ, రాగి యంత్రాలు, రుద్రాక్ష దండలూ – ఇలా ఎన్నెన్నో మూఢత్వాలకు బలియైపోతున్నారు. ఆఖరికి శాస్త్ర విజ్ఞానాన్ని మూఢనమ్మకాలకి జోడించుకుంటూ జ్యోతిష్యులు చెప్పే లగ్నానికి సిజేరియన్ ఆపరేషన్లు చేయించుకుని పిల్లల్ని కంటున్నారు.

మనకి రాజకీయ స్వేచ్ఛ వచ్చిందంటున్నారు. కానీ, ఆర్థిక పరాధీనత మాత్రం పోలేదు. సామాజిక నాగరికత పురోగతి సాధిస్తే సాధించవచ్చునేమో కానీ – ఆపాటి 75 ఏళ్ళ పురోగతినీ 'కరోనా' వెక్కిరించి, చప్పరించేసింది. ఇక సాంస్కృతిక వికాసం అన్నమాటకి వస్తే అది ఆదిమ గుహాంతర చీకటి గుయ్యారాలలో దేవుళ్ళాడుతోంది.

మన విద్యా విధానం – వికాసాన్నివ్వదు. మతాల విధానాలు – బతుకుతెరువునివ్వవు. సాహిత్యం అనేది పేదలకీ – పేదలని పీడించేవారికీ మధ్య జరిగే సంఘర్షణను చిత్రించాలి. సాహిత్య సాంస్కృతికరంగాలు – ప్రభుత్వాలిచ్చే ఉచితాల జాతరల్లో విలువలను దిగజార్చుకొంటున్నాయి. దళారీ పాలకవర్గాల ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టబడిన ప్రజాకర్షక పథకాల పేరుతో గ్రామీణ భారతాన్ని మోసం చేస్తున్నారు. మరోపక్క సాగు సాంస్కృతిక పోరు ఢిల్లీ నడిబొడ్డున ఎర్రకోటలో సింహాసనాన్ని బొడ్డు పట్టుకు కుదిపేస్తోంది. కానీ మధ్యతరగతి ఉభయచరాలకు చలనం రావడంలేదు. జన జీవన స్రవంతి మందహాసంతో తన దారిని తాను ఎడారుల్లోకి ప్రవహించుకుపోతోంది – మౌనంగానే ఎదిగిపోవాలనే పగటి కలల నుండి బయటపడలేకపోతోంది. అందుకే "రైతుపోరు" గురించి మాట్లాడలేకపోతున్నారు.

ప్రజల భాషలో చదువుల గురించి, పాలన గురించి – మాట్లాడటం వ్యవస్థ భక్తుల దృష్టిలో ప్రభుత్వ వ్యతిరేక చర్య అయిపోయింది. మరోపక్క ఎన్నికల సంస్కృతి పదవీ వ్యాపార సంతలుగా నామమాత్రపు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. ఇంటింటికీ తిరిగి – రామాలయ నిర్మాణానికి విరాళాలను సేకరిస్తూ – ప్రజలను వారి జీవన సమస్యల నుండి వారి సంఘర్షణల నుండి, ఉద్యమాల నుండి పక్కదోవ పట్టిస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న "బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంవారు భూతవైద్యానికి సంబంధించి డాక్టరేట్ కోర్సునీ, 16 నెలల సర్టిఫికెట్ కోర్సునీ కూడా జనవరి 2021 నుండి ప్రారంభించారు. ఈ వార్త బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌వాళ్ళు ప్రకటించారు.

ప్రగతిశీల శక్తుల ఆందోళనలను పట్టించుకోకుండా నందమూరి తారక రామారావు ఆం.ప్ర. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు తెలుగు విశ్వవిద్యాలయంలోనూ జ్యోతిష్యాన్ని ఒక బోధనాంశంగా చేర్చారు. చేతబడిని సాకుగా చూపించి అమాయక ప్రజలపై దాడిచేసి చంపే సందర్భాల్లో కూడా పాలకవర్గాలు ఉదాశీనతతో ప్రవర్తించడమేకాదు, ఆ మూఢాచారానికీ మతతత్త్వ ప్రయోజనాలను కూడా జోడిస్తున్నారు. తాత్కాలిక వెనుకడుగులుండినా అంతిమంగా కాలం ముందుకు నడుస్తుంది. గడియారాన్ని వెనక్కి తిప్పితే ప్రయోజనం ఏంటి? ఇది ఎల్లకాలం సాగదు. సమాజం అట్టుడికిపోతోంది! పోరాట చైతన్యం పెల్లుబుకుతుంది.

స్పానిష్ కవి ఒతో–రెనీ–కస్తియో చెప్పినట్లు –

"బువ్వపెట్టే – మట్టి మనుషులు
పాలవాళ్ళూ – కూరలోళ్ళూ
గొడారివాళ్ళూ – భవనకూలీలు
బళ్ళులాగి – బస్తాలు మోసే
దేశ ప్రజలే – మామూలు మనుషులె
నిలబెట్టి అడిగే రోజు ఒక్కటి
వచ్చి తీరును తప్పదు!"

**21-02-2021**

## ప్రజాసాహితి యాజమాన్య వివరాలు
### (ఫారం 4, రూల్–8 ప్రకారం)

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | విజయవాడ–520002 |
| 2. | ప్రచురణ కాలం | : | నెలకొకసారి(మాసపత్రిక) |
| 3. | ముద్రాపకుని పేరు | : | **కొత్తపల్లి రవిబాబు** |
| | జాతీయత, చిరునామా | : | భారతీయుడు<br>30–7–6 అనపర్తివారివీధి<br>అన్నదానం సమాజం రోడ్డు<br>దుర్గాఅగ్రహారం<br>విజయవాడ–520002 |
| 4. | ప్రచురణ కర్త పేరు,<br>జాతీయత, చిరునామా | : | పైవిధంగానే |
| 5. | సంపాదకుని పేరు | : | కొత్తపల్లి రవిబాబు |
| 6. | భాగస్వాములు | | జనసాహితి, ఆంధ్రప్రదేశ్ |

పైన పేర్కొన్న విషయములన్నియు యధార్థములు.

1.3.2021

సం॥ **కొత్తపల్లి రవిబాబు**
ప్రచురణకర్త

## కవిత ఒక మనిషి చాల ఒంటరితనాలు

**స ప్రం గ ణే ష్ బా బు**

తరాలు మారుతున్నాయి
కాలం ఎన్నో పాఠాలు చెప్తుంది
పుస్తకాల్లో జ్ఞాపకాల చరిత్రగా మారిందంతా
ప్రస్తుతాన్ని వెన్నుతట్టి
రేపటి గమనానికి దారి వెతకాలి కదా?
మరి దశాబ్దాల శతాబ్దాల ముందడుగంతా
మనుషుల్ని మనసుల్ని దూరంగా నెట్టేసే
ఒంటరితనమే మిగిల్చింది
ఇప్పుడు వాట్సాప్ పలకరింపులు, ఫేస్‌బుక్ సందేశాలు
చెట్లులేని వాకిట్లో ప్లాస్టిక్ పూల తోరణాలు
మనిషికి మనిషికి మనసుకి మనసుకి
ఎంత దూరమో వెతకాలంటే
అంతర్జాలంలో ఒక జీవితకాలం పడుతుందేమో
ఇక మనుషులు
ఏం పెంచుకోవాలో ఏం ఉంచుకోవాలో
ఏం పంచుకోవాలో మర్చిపోయేంత హడావిడిలో
తమని తామే మర్చిపోతున్నారు
తమను తామే పారేసుకుంటున్నారు
తమకి తామే ఒంటరిగా మిగిలిపోతున్నారు

నివాళి

# ప్రజాసాహిత్యోద్యమ దిగ్గజం
# సింగమనేని నారాయణకు జోహార్లు

**సింగమనేని** నారాయణ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ తదితర శారీరక సమస్యల మూలంగా 2021 ఫిబ్రవరి 25, గురువారం కన్నుమూశారు.

ఆయన వయస్సు 78 సంవత్సరములు. 1943 జూన్ 26న అనంతపురం జిల్లా రాప్తాడు మండలం మరూరు బండమీదిపల్లె గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. అనంతపురంలో హైస్కూలు, ఇంటర్మీడియట్ చదివిన తరువాత తిరుపతి ఓరియెంటల్ కళాశాలలో 'విద్వాన్' కోర్సు చదివారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో తెలుగు పండిట్‌గా చేసి 2001లో ఉద్యోగ విరమణ చేశారు. 'విద్వాన్' కోర్సు చదువుతున్న కాలంలోనే ఆయన మార్క్సిజం ప్రభావంలోకి వచ్చారు. అది ఆయన జీవితానికి, సాహిత్యానికి దిక్సూచిగా తోడ్పడింది. ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని, ప్రపంచ అభ్యుదయ అనువాద సాహిత్యాన్ని విస్తారంగా అధ్యయనం చేశారు. ఆయన ధారణ శక్తి గొప్పది. తెలుగులో ఏ కావ్య భాగాన్నయినా సులువుగా ఉటంకించ గలిగేవారు. శ్రీశ్రీ 'మహాప్రస్థానం', గోర్కీ 'అమ్మ' నవల, మార్క్స్, ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళిక ప్రత్యేకించి ఆయనను ప్రభావితం చేశాయి.



తెలుగు సాహిత్యానికి, ప్రత్యేకించి రాయలసీమ సాహిత్యానికి ఆయన అందించిన సేవలు అపురూపమైనవి. రాయలసీమ నైసర్గిక, సామాజిక జీవితంపై సమగ్ర అవగాహన గలవారు సింగమనేని. నిత్య కరువు పీడిత అనంతపురం జిల్లా పరిస్థితులను, రైతాంగ వేదనలను తన కథలు, వ్యాసాల ద్వారా ఎంతో ఆర్తితో అక్షరబద్ధం చేశారు. ఆయన తొలి కథ "జూదం" ప్రజాసాహితి పత్రిక 1978 నవంబర్ సంచికలో ప్రచురితమైంది. అనంత రైతాంగ విషాదకర పరిస్థితిని ఆ కథ ప్రస్ఫుటించి సంచలనం కలిగించింది. ఆయన డెబ్బయికి పైగా కథలు రాశారు. జూదం, అనంతం, సింగమనేని నారాయణ కథలు, పరిమితం తదితర విశిష్ట కథాసంపుటులు ప్రచురితమైనాయి. ఆయన ప్రజాస్వామిక అభ్యుదయ జీవన దృక్పథాన్ని అవి వెల్లడించాయి. ఆయన సాహిత్య విమర్శా రచనలు కూడా విలక్షణమైనవి. 'సమయమూ – సందర్భమూ', సాహిత్య విమర్శనా వ్యాసాలు, 'సంభాషణ', 'కథావరణము', శ్రీశ్రీ సాహిత్యనిధి వారి ప్రచురణ 'కష్టజీవికి ఇరువైపులా నిలిచిన మహాకవి శ్రీశ్రీ' తదితర విలువైన విమర్శనా గ్రంథాలు వెలువడినాయి. ఎంతోమంది రచయితల కథా, నవలా సంపుటులకు విలువైన ముందుమాటలు రాశారు. అవి "మున్నుడి" పేరున సంపుటిగా వచ్చినాయి.

ఎందరో యువ రచయితలు ప్రజారచయితలుగా ఎదగడానికి నిరంతరం తోడ్పాటును, ప్రోత్సాహాన్ని ఆయన అందించారు. వారికోసం సాహిత్య పాఠశాలలు నిర్వహించడంలో భాగస్వాములయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన సాహిత్య సభలు, సదస్సులలో విరివిగా పాల్గొని ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమానికి ఎనలేని అండదండలు అందించారు. 1992లో సింగమనేని సంపాదకత్వంలో వెలువడిన "సీమ కథలు" కథా సంకలనం నిర్దిష్ట ప్రాంతీయ కథా సాహిత్యానికి ఒరవడి పెట్టింది. అదేవిధంగా మధురాంతకం రాజారామ్‌తో కలిసి ఉమ్మడిగా సంపాదకత్వం వహించి ప్రచురించిన "తెలుగు కథకులు – కథనరీతులు" (నాలుగు సంపుటాలు), కథారచయితలకు, సాహిత్యవిమర్శకులకు రెఫరెన్స్‌గ్రంథాలుగా తోడ్పడుతున్నాయి. 'ఇనుప గజ్జెల తల్లి' 'కరువు' కథల సంకలనానికి, 'విశాలాంధ్ర' వారి 'తెలుగు కథ' సంకలనానికి సింగమనేని సహసంపాదకత్వం వహించారు.

ఆరుమాసాల క్రితం ఆయన ఆఖరుపుస్తకం "పరిమితం" వెలువడింది. అందులో కొన్ని విశిష్టమైన కథలు, ఆయన బాల్యపు ఆత్మకథ వున్నాయి. ఆ పుస్తకాన్ని ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుగారు 'ప్రజాసాహితి' 2021 జనవరి సంచికలో సమీక్షించారు. ఆరుమాసాల క్రితం "ఆంధ్రజ్యోతి" దినపత్రికలో ప్రచురితమైన సింగమనేని రచించిన ఆఖరు కథ "గురజాడ అపార్ట్‌మెంట్స్" విస్తృత ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. స్త్రీల వంటింటి బందిఖానా జీవితాన్నుండి విముక్తికై వందేళ్ళకు ముందే గురజాడ మహాకవి ప్రతిపాదించిన వీధివీధినా సామూహిక వంటశాల ఏర్పాటు అను భావన స్ఫూర్తితో సింగమనేని ఆ కథ రాశారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య అన్నట్లు "సింగమనేని శిల్పం అనితర సాధ్యం కథాశిల్ప మర్మగ్నుడాయన. "దిద్దుబాటు" కథతో గురజాడ తెలుగు కథకు ప్రాణం పోస్తే "జూదం" కథతో అనంత కథను స్వీకరించిన ఘనత సింగమనేని నారాయణకే చెందుతుంది. అందుకేనేమో తన అడుగుజాడల్లో నడచి వచ్చి కలం పట్టి కథలు రాసిన రచయితల వస్తు శిల్పాలను ప్రభావితం చేసిన గొప్ప కథకుడు సింగమనేని."

మాతృభాషలో విద్యాబోధనకై సాగుతున్న ప్రజాఉద్యమంలో సింగమనేని సమరశీలంగా ఉద్యమించారు. జనసాహితి ప్రచురించిన ఆయన రచన "మాతృభాషా మాధ్యమమే ఎందుకు?" అను విలువైన చిరుపుస్తకం అయిదారు ముద్రణలు పొందింది. 1978లో ఏర్పడిన ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమ సంస్థ "జనసాహితి"లో ఆయన వ్యవస్థాపక సభ్యుడిగా, కార్యవర్గ సభ్యుడిగా వున్నారు.

సింగమనేని సాహిత్యజీవి. సాహిత్య అధ్యయనము, రచన, విమర్శ, ఉద్యమము ఆయన జీవిత సర్వస్వం. ఆయన సామాజిక ఉద్యమకారుడు కూడా. కరువుపీడిత అనంతపురం జిల్లాకు సాగునీటి వనరుల సాధనకై సాగిన ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. జిల్లాలో ఆత్మహత్యల సంక్షోభంలో వున్న రైతాంగంలో ఆత్మవిశ్వాసము, చైతన్యము, ధైర్యము నింపడానికై సాగిన ఉద్యమంలో ఆయన ముందు పీఠిన వుండి నడిచారు. ఒక ఉపాధ్యాయుడిగా సింగరాజు రామకృష్ణయ్యగారి అనుచరునిగా ఏపిటిఎఫ్ ఉపాధ్యాయ ఉద్యమంలో కూడా చురుకైన పాత్ర పోషించారు. సకల ప్రజా ఉద్యమాల్లోను ఉత్సాహంగా పాల్గొన్నారు.

"కరువు సీమ ఆంధ్రజాతికి తరిమెల నాగిరెడ్డి అనే మచ్చలేని మహానాయకుడిని అందించింది." అంటుండేవారు సింగమనేని.

సాహిత్య, సామాజికరంగాల్లో ఆయన సాటిలేని అద్భుత ఉపన్యాసకుడు. ఆయన ఉపన్యాసాలు ఉన్నత సాహిత్య, సామాజిక సాంస్కృతిక విలువలకు చిరునామా. అనంతపురంలో గత నాలుగు దశాబ్దాలుగా దాదాపు ప్రతి సాహిత్యసభలోనూ ఆయన ప్రధాన వక్తగా వున్నారు. అనంతపురం సాహిత్యాకాశంలో ఆయన సూర్యచంద్రులుగా ప్రకాశించాడు.

ఆయన మరణం అభ్యుదయ విప్లవ సాహిత్యోద్యమానికి, సామాజిక ఉద్యమాలకు తీరని లోటు. ఆయన ప్రాతినిధ్యం వహించిన విలువలను, ఆశయాలను, కృషిని ముందుకు తీసుకుపోవడమే మనం ఆయనకు అర్పించగల నిజమైన నివాళి. సింగమనేని మరణానికి జనసాహితి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తుంది. వారి కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటిస్తోంది.

**- జనసాహితి**

## రైతుకూలీ ఉద్యమ కార్యకర్త, కళాకారిణి కా॥ పెద్దక్కకు జోహార్లు



**కా॥ పెద్దక్క** అనంతపురం టౌన్‌లోని జనశక్తినగర్‌లో వుంటూ 30-9-2020న అమరులయ్యారు. రైతుకూలీ ఉద్యమంలోను, పట్టణ పేదల ఉద్యమంలోను క్రమశిక్షణ గలిగిన శ్రామిక మహిళా కార్యకర్తగా పెద్దక్క గత 30 సం॥లుగా పనిచేస్తూ వుంది. పాటలు పాడే కళాకారిణిగా ప్రజలందరికీ తెలిసిన పెద్దక్క ప్రజాఉద్యమాలలో నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త. అనంతపూర్ జిల్లాలో తరిమెలలో జరిగిన జనసాహితి రాష్ట్ర మహాసభల సందర్భంగానేకాక ఎలాంటి మీటింగులలోనైనా తన దృఢమైన గొంతుతో పాటలు పాడేది. పెద్దక్క మన మధ్య తిరుగుతూ నాయకుల్ని కార్యకర్తల్ని పలకరిస్తుంటే రష్యా నవలల్లోని శ్రామిక మహిళల పాత్రలు గుర్తుకొస్తూంటాయి. ప్రజాఉద్యమాలపట్ల ఎంతో నమ్మకంతో నిబద్ధతతో తన జీవితం చివరివరకు నిలిచిన కా॥ పెద్దక్కకు జనసాహితి జోహార్లు చెపుతున్నది.

కవిత

## పోరాట యోధుడు!

*- చిత్తలూరి*

దేశానికి అన్నం పెట్టే
మట్టిని చెదరగొట్టాలని చూడకు
నిన్నా మట్టిలోనే కప్పెట్టేయగలడు
మట్టిని బువ్వగ మార్చి
మనిషి పొట్ట నింపెటోడు
కుటిల చట్టాల కోరలతో
ఆ మట్టి వస్త్రానికి
చిరుగులు కొట్టాలని చూడొద్దు
కోరల్ని కత్తిరించే బోనులా తెరుచుకోగలడు

ప్రకృతి వైపరీత్యాలతో నిత్యం యుద్ధం చేసెటోడు
పంట పొలాల్ని ఛిద్రం చేసే
కుట్రలతోనూ తలపడగలడు

ఆకలి చీకట్లావరించిన దేశానికి
మెతుకు దీపం ముట్టిచ్చెటోడు
పచ్చదనాన్ని పైకప్పుగావేసి
దేశానికింత నీడ చెట్టయి నిలిచెటోడు
అన్నం పెట్టేవాడి కంట్లో
సున్నం కొట్టాలని చూడకు

పంటకు పట్టిన చీడపీడల్ని
తొలగించినంత సహజంగానే
ఈ దేశానికి పట్టిన తెగులును
తుదముట్టించగలిగిన
నేర్పరి కూడా అతడు

పంట పొలంలోని కలుపు మొక్కల్ని
పెకలించేయటంలో
ధాన్యానికి పట్టిన పురుగుల్ని ఏరేయటంలో
సిద్ధహస్తుడతడు

తన బతుకు పంటను నాశనం చేసే కలుపుమొక్కల్ని
చూస్తూ ఊరుకుంటాడా
తన అస్తిత్వాన్ని కొరుక్కు తినే
కొత్త పురుగులను ఊరికే వదులుతాడా
పదునైన పనిముట్లతో
పంట చేలో వ్యవసాయం చేయటమే కాదు
రోడ్ల మీద యుద్ధం చేయటం కూడా తెలుసతనికి

అతడు సేద్యగాడే కాదు
పాలన అదుపుతప్పినపుడు
తన ఆకుపచ్చని అస్తిత్వం
మంటగలుస్తున్నపుడు
పోరాట యోధుడు కూడా!

కథ

# "జూదం"

– సింగమనేని నారాయణ

**మూడుగంటలప్పుడు** రెండో విడత యింత ముద్ద తిని తోట దగ్గరకు బయలుదేరాడు నారప్ప. దారిలో రామశేషయ్య ఎదురై "ఏం నారప్పా! బట్టలప్పు యియ్యనే యియ్యక పోతివి. సంవత్సరం దాటిపాయె" అని హెచ్చరించాడు.

"బొత్తిగా ఎసులుబాటు గాలేదు శేషయ్యా! నాకు మాత్రం నీ బాకీ నిలపాలని వుందా"

"రాగులూ, జొన్నలూ మంచి పంటే అయ్యిందంటనే – అమ్మినావా"

"ఏందమ్మడమప్పా. అడిగే నాథుడే లేకపోతే! మనమై మనం కొంటావా అంటే, మూట అరవైలోపుగానే బేరమాడితే ఎట్లా చచ్చేది. నిరుడు నూటికి పై నుండే ధర, వుట్టుపాటుగా అరవైకే తెగనమ్మాలంటే మనసెట్టా వప్పుతాది. ఓవైపు కరెంటుబిల్లు కట్టాల్ల – తనకా బేంకోల్లు జీపులమీద జీపుల్లో వస్తూనే వున్నారా! వుండేకేమో పది మూట్లు జొన్నలూ, పదిమూట్లు రాగులూ వుండాయనుకో. ఏంజెయ్యల్లో దిక్కే తెల్లేదు."

"మీ కత జూస్తే యిట్లావుంది. నా కత జూస్తే దబ్బాడితేగాని పొట్ట గడవదాయే. మీలాంటోల్లందరికీ అప్పులిచ్చి అంగడి ఎండక పొయ్యిందనుకో. ధర్మారం నుండి అప్పులోల్లు మనిషి మింద మనిషిని పంపుతుండారు. మీ లాంటోల్లు ఎప్పుడిదప్పుడు యిస్తే గదా నాకూ జరుగుబాటయ్యేది. కటినిట్టుగా అడుగుతున్నా ననుకోవద్దు నారప్పా! ఓ వారం దినాల్లో బాకీ మాత్రం పైసలు చెయ్యాల్సిందే. అంగట్లో బొత్తిగా సీపు ముక్కలు కూడా లేవు. దసరా వస్తోంది. దసరా కన్నా రొవన్ని బట్టలు అంగట్లో ఏసుకోకపోతే ఎట్లా – వస్తా మరి" అంటూ సమాధానం కూడా ఆశించకుండా ముందుకు సాగిపోయాడు రామశేషయ్య.

నారప్ప సన్నగా నవ్వుకున్నాడు. రామశేషయ్య వ్యవహారం నారప్పకు తెలీందేమీ గాదు – ఇరవై ఏళ్ళ కిందట గుగ్గుళ్ళ గంపతో వ్యాపారం మొదలుబెట్టిన రామశేషయ్య యీనాడు తనలాంటి రైతుల్ని చుట్టూ తిప్పుకొనేవాడయ్యాడు. అప్పట్లో రైతులందరి దగ్గరా నయంగా మెలిగి పాతికో పరకో వాళ్ళ దగ్గరే చేబదుళ్ళు తీసుకొని చిన్న అంగడి పెట్టుకున్నాడు. రైతుల కల్లాల దగ్గరకు తినుబండారాలు తెచ్చి అమ్మి గింజలు పోగుచేసుకొని అమ్మేవాడు. పాపం తండ్రి చచ్చినోడని రైతులంతో యింతో దయదలచేవారు. క్రమంగా అంగడి పెంచుకున్నాడు. మెల్లగా




బట్టల వ్యాపారం కూడా తోడు చేసుకున్నాడు. చూస్తూ చూస్తూండగానే మూడంకణాల యిల్లు కట్టుకున్నాడు. మెల్లమెల్లగా రైతులకు అవసరాలకు వడ్డి కిచ్చుకుంటూ, యీనాటి కింతవాడయ్యాడు. ఎంత లేదన్నా యిరవై వేలకుపైగానే వడ్డికి తిప్పుకుంటున్నాడని వూర్లో అందరూ అనే మాటే. ఇంట్లో పెండ్లాం పిల్లల దర్జా, బట్టా బాతా, తిండీ తీర్థం చూస్తే ఎట్టాంటి రామశేషయ్య ఎట్టా మారాడబ్బా అనుకోక తప్పదు. ఒక కొడుకును అనంతపురంలో కాలేజీ చదివిస్తున్నాడు. ఒక కొడుకు అతనితోపాటు వ్యాపారంలో నిగ్గుదేలాడు. మంచి సంబంధం చూసి యీ మధ్యనే బిడ్డకు పెళ్ళిచేశాడు. ఇదంతా ఆశ్చర్యంగా మాయలా కనిపిస్తుంది నారప్పకు.

ఇరవై ఏళ్ళ కిందట నారప్ప తండ్రి యింకా బతికున్నప్పుడు, అన్నదమ్ములింకా భాగాలు విడిపోనప్పుడు, పదెకరాల తరీ ముప్పయ్ ఎకరాల మెట్టతో వూర్లో పెద్ద రైతు కుటుంబం కిందే వారిది లెక్క. తండ్రి చచ్చినాక ముగ్గురన్న దమ్ములూ విడిపోయారు. విడిపోయినప్పుడు ఆస్తితోపాటు మూడువేలు అప్పు కూడా నారప్ప మీద పడింది. ఆ అప్పయితే తీర్చాడుగాని, రకరకాలుగా యీనాటికి కొత్త అప్పులు పేరుకొని ఐదువేల పై చిలుకే అప్పుల్లో పడ్డాడు నారప్ప. బుద్ధి వచ్చినప్పట్నుంచీ కష్టపడుతూనే వున్నాడు. పంటలు పండిస్తూనే వున్నాడు. అయినా యిదేం విచిత్రమో ఓమైన అప్పు పెరుగుతూనే వుంది. ఇదంతా తల్చుకొని "ఏం సేద్యమో! ఏం పాడో! గడియ తీరికలేదు, దమ్మిడీ ఆదాయం లేదు" అని నిట్టూర్చాడు నారప్ప.

పొద్దు ఏటవాలుతున్నా ఎండ యింకా తగ్గలేదు. భుజంమీదున్న టవ్వాలు తీసి నెత్తికి చుట్టుకున్నాడు నారప్ప. బనీను జేబులోంచి బీడీ తీసి వెలిగించుకున్నాడు. పొగ బీలుస్తూ తోట దగ్గరగా వచ్చేసరికి పక్కతోటలోంచి గడ్డిమోపుతో వెంకటన్న ఎదురై "బీడీ వుంటే ఈ మామా" అని అడిగాడు నారప్పను. నారప్ప బనీను జేబులోంచి బీడీ తీసి యిస్తూ "ఇయ్యాలకాడ గడ్డిమోపేటికోయ్" అనడిగాడు.

"ఆ రామశేషయ్య యింతకు ముందొచ్చిండె – వాళ్ళావుకు గడ్డిగావల్లంట – కాసింత గడ్డిమోపు తెచ్చెయ్యరా వెంకా అంటేను...." అని బీడీ వెలిగించుకొని, "వత్తా మామా" అంటూ ముందుకు కదిలాడు వెంకటన్న.

"రామశేషయ్య పనే బాగుంది" అనుకున్నాడు నారప్ప. చారడు భూమి లేదు గాని రామశేషయ్య యింటి ఆవూ, ఎనుమూ వున్నంత నున్నగా ఎవురివున్నాయ్. ఆడింత యీడింత గడ్డి అడుక్కొనే తన పసుల్ని మేపుకుంటున్నాడు. ఇంత గడ్డి పండించీ తన పసులు ఆ మాత్రం యాడున్నాయి. "దమ్మిడీ కర్చు లేకుండా పాలూ నెయ్యీ తినే రాత

వానికుంది. మజ్జిగ నీళ్ళగతి మనకు పట్టింది." అనుకుంటూ తోటలోకి అడుగుబెట్టాడు నారప్ప.

చింతచెట్టు కింద పుల్ల లేరుకుంటూ కనిపించింది ఎల్లమ్మ.

"ఏం ఎల్లమ్మా! ఎప్పుడూ మా తోట పుల్లలేనా నీకు దొరికేది" అన్నాడు నారప్ప దగ్గరగా వస్తూ.

వంకున్నదల్లా నడుంపైకెత్తి చూసింది ఎల్లమ్మ. నవ్వు మొగం పెట్టింది. "ఎప్పుడూ యాడదన్నా! మీ తోట మొగం చూడకే వారమైతే – అందరూ నీ యట్టాటొల్లే వుంటారా! ఆ నారపరెడ్డి తోట్లోకి అడుగు పెడితే చాలు మక్కెలిరగదంతానంటాడు ఆయప్ప కొడుకు – ఏదో మీలాంటోళ్లు ఏమీ అనరనే గదా యీటికొచ్చేది. నేనొచ్చే కాటికి ఎవురిదో ఎనుంగొడ్డుంటే బయటికి తోలి యీ పుల్ల లేరుకుంటున్నా" అన్నది.

నారప్ప కాస్తంత వుబ్బిపోయాడు. "అద్సరేగాని, మర్నాడు మడికలుపుకు నువ్వూ నీ కోళ్ళీ రాండి. కలుపు మొక్కలు బాగా పెరిగినాయి" అన్నాడు.

"అట్టాగేన్నా! నువ్వు పిలిత్తే ఎప్పుడు కాదన్నాము. రొవన్ని మెరపకాయలు పీకియ్యన్నా! రాత్రి ముద్దలేకి ఏందీ లేదు" అంది ఎల్లమ్మ.

"ఓసీ" అనుకున్నాడు నారప్ప. "నువ్వే ఎల్లి ఓ పది కాయలు పీక్కో. సందు చిక్కిందని దులిపేశేవ్."

"అయ్యయ్యో పిడికిడైతే అయితాయి" అంటూ, మిరప పాదుల్లోకి నడిచింది ఎల్లమ్మ. చింపిరిజుత్తు, చిరుగులు పడ్డ పాతచీర. ఏభై ఏళ్ళు దాటుతున్నా కష్టం చెయ్యక తప్పని ఎల్లమ్మ వేపే చూస్తూ వరిమడివేపు నడిచాడు నారప్ప. మడి చుట్టూ తిరిగి వచ్చేసరికి ఎల్లమ్మ పుల్లల మోపెత్తుకొని బయలుదేరుతోంది. మిరపకాయల మూట సన్నగా చీర మడతల్లో మోకాళ్ళ మధ్య వేలాడుతోంది.

"నీ కొడుకును సంజప్ప యింట్లో జీతానికి పెట్టినావే – ఏమాత్రం వప్పందం".

"ఆ సంజప్ప దగ్గరే వాడి పెండ్లికి మూన్నూర్రూపాయలు తీసుకుండాం గదా – ఈ సంవత్సరం జీతం పెట్టమన్నాడు. బువ్వపెట్టి బట్టలిత్తానన్నాడు".

"మున్నూటికేనా! వూరంతా ఐదు నూర్లిస్తుండారే"

"అయ్యో! ఆ సంజప్ప మెడకేస్తే కాలికి, కాలికేస్తే మెడకూ ఏసే రకం. ఐదునూర్లడిగితే, రెండేళ్ళ వడ్డీ మీ యబ్బ యిత్తాడేమే అంటాడు. బతుకు జరగడం శానా కట్టమైందన్నా – నేనూ కోళ్ళీ ముప్పూటలా కట్టపడుతున్నా తిండికే సాలటంలా – వాని కట్టమేమో ఆ సంజప్పకే సరిపాయె – పూటకు పూట సంపాయిచ్చుకోవల్ల – తినల్ల – ఇప్పుడు కోళ్ళి వుత్తమనిషి కూడా కాదు."

నారప్ప ఏం మాటాడలేదు.

ఎల్లమ్మ యింకా తనలో ఏదో గొణుక్కుంటూనే మెల్లగా నడిచి పోయింది.

కూరపాదులకు నీళ్ళు పెడదామనే వుద్దేశంతో తలుపు తెరచి 'మిషన్ రూమ్'లోకి వెళ్ళాడు నారప్ప. స్విచ్ ఆన్ చేశాడు. కరెంటు లేదు. "ధూ".... అని తిట్టుకున్నాడు. "ఏం కరెంటో – ఏం పాడో. రోజూ యిదే అవస్తే.... కరెంటు బిల్లులు మాత్తరం టంచన్‌గా కట్టాల్సిందే! కట్టకపోతే డిస్కనెక్టులూ సర్ శార్జీలూ టౌన్‌లో సూస్తే యాడ సూసినా ఎప్పుడు సూసినా కరెంటుంటుంది.... పల్లెకొంపల కిడసల్లంటే ఏం రోగమో" గొణుక్కుంటూ రూమ్‌లో నుండి బయటకొచ్చాడు నారప్ప.

కాళ్ళీడ్చుకుంటూ కూరపాదుల్లోకి వెళ్లి కూచున్నాడు. అక్కడక్కడా పెరిగిన గడ్డి పీకేసుకుంటూ ఆలోచనల్లో పడిపోయాడు.

" 'తనకా బేంకొల్లు' ఈ పొద్దో రేపో రానే వస్తారు. వాళ్ళప్పు నిలపటానికి యీల్లేదు. రెన్నెల్లబట్టీ తిరుగుతుండారు. వాళ్ళొచ్చినప్పుడల్లా, టిపిన్లు కాపీలూ, ఆలెస్సమయితే బోజనాలు కూడా పెట్టల్ల. ఆ బేంకు జవాను రాజయ్య మరీ జిడ్డు. వచ్చినప్పుడల్లా రెండో మూడో గుంజుకోందీ కదల్డు. ఆలెస్సం చేసే కొద్దీ కర్చులన్నీ బాకీదార్ల మిందే యేస్తారు."

ఎంత వారించుకున్నా అతని ఆలోచనల్లో డబ్బు అవసరాలు తప్ప మరోటి చోటు చేసుకోలేకపోయాయి.

నారప్ప మనసులోనే, వెంటనే జమలు ఇవ్వాల్సిన డబ్బును లెక్కబెట్టుకోసాగాడు. బేంకు అప్పు మున్నూరు... రామశేషయ్యకు ఎంత లేదన్నా యిన్నూరు.... గానుగ చెక్క బాకీ నూరు.... కిరాణా సరుకులు తెచ్చిన ఎంగటేసులు శెట్టి అంగిట్లో మున్నూరు.... మూడునెల్లు కరెంటు బిల్లుకు శివయ్యతో తెచ్చింది నూట యాభై.... యీ నెల కట్టేబిల్లు యాభై.... ఇలా లెక్కించుకుంటూ మొత్తం ఒక్క వెయ్యీ నూరు అని తేల్చుకున్నాడు. ఇవి తక్షణ అవసరాలు. తీర్చకపోతే మర్యాద దక్కదు. దీంతోపాటు పుట్టింటికొచ్చిన పెద్దబిడ్డకు పండగ నాటికి బట్టలు పెట్టి పంపల్ల – ఆ కర్చూ ఎంత లేదన్నా నూటికి తగ్గదు – మడికి యూరియా మూటొకటి తెచ్చుకోవల్ల – అదొగ నూరు.

చలమలో నీరులా అవసరాలు వూరుతున్నాయి నారప్పకు. ఎక్కువ ఆలోచన చేసేందుకు భయమేసింది.

ఇంట్లో వుండే రాగులూ జొన్నలూ అమ్మితే యిప్పుడుంటే రేటులో ఆ వచ్చేది యామూలకయితుంది? పండిన పంటకు చేతికొచ్చేది, పంటకు పెట్టిన పెట్టుబడీ, లెక్కలు గడితే కూలే గిట్టదే! యా దేవున్తో చెప్పుకొనేట్టు – ఓ వైపు కొనాల్సిన సరుకుల ధరలన్నీ వున్న చోట వుండకుండా పెరుగుతూనే వుండాయా! ఎరువుల ధరలు తగ్గలే! కరెంటు రేటు తగ్గలే – బూమిపన్ను తగ్గలే – బట్టల ధరలు సరేసరి – ఏందబ్బా తగ్గించేది?

నారప్ప ఆలోచనల్లో మునిగి గడ్డి మొక్కకు బదులుగా మెరప మొక్క పీకి, వెంటనే నాలుక కరచుకున్నాడు.

"నాయనోయ్.... నాయనో" అన్న కేకలు విని వెనక్కు తిరిగి చూస్తే తొమ్మిదేళ్ళ కొడుకు కిష్టిగాడు పరుగు పరుగున వస్తున్నాడు. నారప్ప కొడుకు వేపే చూస్తూ ఏదో శంకించాడు.

"ఏందిరా కిష్టా" అన్నాడు కొడుకు దగ్గరకు రాగానే.

"జీపులో ఆ పొద్దు వచ్చినోళ్ళు వచ్చినారు నాయనా – నువ్వు బిరీన రావాల్లంట – ఇంటికాడే కూకుండారు" అన్నాడు వాడు పరుగెత్తుకొచ్చిన ఆయాసంతో వగరుస్తూ.

నారప్పకు బాగా అర్థమయింది.

ఆ వచ్చినోళ్ళు తనకా బేంకోల్లు – వాళ్ళు రావటం యిది మూడోసారి.... 'ఎట్ల జేస్తే బాగుంటుందబ్బా' అనుకుంటూనే కొడుకు వెంట కదిలాడు.

దారిపొడుగునా వకటే ఆలోచనలు – ఇప్పుడున్న పళంగా ఎవర్నడగాలి అడిగితే

శివయ్య యివ్వకపోదు పొద్దున్నే వచ్చి గింజలు కొలవమంటాడు.... రేటు దగ్గిర శానా మొండి మనిషి... చూసి చూసి యింత తక్కువ రేటుకు అమ్మటానికీ మనసొప్పలే – అమ్మకపోతే అనువులు తీరేటట్టు లేవు – ఈటికే నెలనుండి అందరి దగ్గరా 'యిదిగో యిదిగో' అంటూ గడుపుకొస్తుంటాడు – సరే – ఎట్లయితే అట్లగానీ.

సూర్యకిరణాలు బాగా ఏటవాలుగా – పడుతున్నాయి. గాలి ఆగి ఆగి మందంగా వీస్తోంది. పొలాల్లోంచి అప్పుడప్పుడు కూతలు వినిపిస్తున్నాయి.

కిష్టిగాడు ముందుగా గంతులేస్తూ నడుస్తున్నాడు. వాడిప్పుడు నాలుగో తరగతి. బలే తెలివైనవాడని అయ్యవార్లంతా తనతో అంటూంటే తనకెంత ఆనందం – వాణ్ణయినా బాగా చదివిచ్చుకోవల్ల – పెద్దోనికెట్లా చదువబ్బలే – ఇంకో ఏడు గడిస్తే వీన్ని అయిస్కూలుకు పంపల్ల – వాడు తన మాదిరి బూమి మింద ఆదారపడకుండా ఓ రకమైన వుద్యోగం చేసి బతుక్కుంటే చాలు – అందుకే వాన్నిప్పట్నుండే సేద్యం పనుల్లోకి బలవంత పెట్టకుండా శ్రెద్దగా సదువుకొనేట్ల సూడల్ల – తెల్లారు జామున వాడు లేసి సదువుతూంటే సందులో ఆడోళ్ళంతా పనీ పాట్లకు లేస్తూ వుంటారు – నారప్ప పెదవుల మీద ఒక క్షణం అందమైన మందహాసం మెరిసింది.

దూరం నుండే తన యింటి దగ్గర జీపు నిలబడి వుండటం చూశాడు నారప్ప. జీపు చుట్టూ కొందరు పిల్లలూ, ఒకరిద్దరు పెద్దవాళ్ళూ మూగి వున్నారు.

కుడి భుజం మీదున్న తువ్వాలు తీసి విదిలించి ఎడమ భుజం మీద వేసుకొని యింటి ముంగిట్లోకి వచ్చాడు నారప్ప –

వరండాలో అరుగుపై కంబడి మీద సుఖాసీనులై వున్నారు బ్యాంక్ అధికారులు. నడవలో బ్యాంక్ జవాన్ రాజయ్య నిలబడి వున్నాడు. వాళ్ళు తాగి పెట్టిన కాఫీ గ్లాసుల మీద ఈగలు ముసురుతున్నాయి. తలుపు వెనకాల నారప్ప భార్యా, పెద్దబిడ్డా నిలబడి తొంగి చూస్తున్నారు.

నారప్పను చూడగానే "రావయ్యా – రా పెద్దమనిషీ! నీకోసం అర్ధగంటనుండీ కాసుకోనుండాం." అని చిర్నగవుతో ఆహ్వానించాడు వారిలో ఒకాయన – ఆయన నారప్పకు బాగా పరిచయం. ఆమాటకొస్తే నారప్పకేగాదు ఆ వూళ్లో చాలామందితో బాగా పరిచయాలున్నాయి ఆయనకు.

నారప్ప వచ్చి ఎదురు అరుగు మీద కూలబడ్డాడు మాటా పలుకూ లేకుండా –

"మరి లెక్క సరిచేసినావా! మేం యిక్కన్నుండీ వెంటనే వెంకటంపల్లి పోవల్ల – మళ్ళీ టైమైపోతుంది" అంటూ ఆయన తొందర చేశాడు.

"నన్నేం ఎగిరి దుంకమంటావా సార్! ఇంట్లో వున్న గింజలమ్మిడుపోందీ నాపిండాక్కూడు ఎక్కన్నుంటీ తెస్తాను."

"ఇది మరీ బాగుందప్పా! నా యింటికా ఏమన్నానా! నీ చుట్టూ తిరగబట్టి యిప్పటికి రెన్నెల్లయింది. వచ్చినప్పుడల్లా యిదే మాటేనా?"

"మీరేం జీపుల్లో తిరుగుతారు జీపుల్లో పోతారు – బాదల్లా నాకే గదా! నా పాట్లు నేను పడుతూనే వున్నాను.

"ఏం బాదపడి ఏం ప్రయోజనం – లేచి ఏదో ఒకటి చూడు – మీలాంటి మర్యాదస్తుల యిండ్లకాడ జప్తు గిప్తు అంటే ఏమన్నా బాగుంటుందా" చివరి అస్త్రం ప్రయోగించాడాయన.

"ఏమప్పా నారప్పా! అప్పు తీసుకొనీ యిట్లా దబాయిస్తే ఎట్లాగా! మా వుద్యోగ ధర్మం మేం చెయ్యల్లా వద్దా! ఒక్కొక్క రైతూ యిట్లా మొండికేస్తే మేం వసూళ్ళు చేసినట్టే –" ఇంకో వుద్యోగి సంభాషణలోకి దిగాడు.

"నా మాటిను నారప్పా! నువ్వడిగితే యింతవూర్లో ఎవరీరు? ఆ చలపతి దగ్గరకో, శివయ్య దగ్గరకో పోయి రారాదా! నువ్వు పంట మామూలుగా వాళ్ళకే గదా యిచ్చేది." మొదటాయన సలహా యిచ్చాడు.

నారప్ప రెండు నిముషాలసేపు మాటాడకుండా కూచున్నాడు. ఏమనుకున్నాడో ఏమో, ఏదో నిశ్చయానికి వచ్చినట్టు లేచి "ఒరే కిష్టా! రొవన్ని మంచినీళ్ళు తేరా" అని కేకేశాడు. కిష్ట మంచినీళ్ళు తెచ్చి యివ్వగానే తాగి, "సరే వూర్లోకి పొయ్యొస్తాను – మీకు అప్పు తీర్చకూడదని నాకేమన్నా కోరికా? నా బాదల్లా గింజలకు రేటు గిట్టలేదనే – ఏం జేస్తాం–" అనేసి వూర్లోకి దారితీశాడు నారప్ప.

నేరుగా శివయ్య యింటి దగ్గరకెళ్ళి బయట నుండి గట్టిగా "శివయ్యా" అంటూ కేకేశాడు. లోపల్నుండీ 'ఎవరూ' అంటూ ఓ గొంతుకతో పాటు, ఓ తల నిక్కి చూసింది.

"నువ్వా! నారప్పా! రా–రా! ఏమిటి సంగతి – అసలు సందకాడొచ్చినావ్" అంటూ పిలిచాడు శివయ్య.

"ఆ తనకా బేంకోళ్ళు కుతికల మీదికొచ్చి కూకుండారు. ఓ మున్నూరు కావల్ల–" అంటూ లోపలికొచ్చి తలుపు వారగా వున్న బెంచీ మీద కూలబడ్డాడు నారప్ప.

శివయ్య ఏం మాటాడకుండా కుర్చీని దగ్గరగా ఈడ్చుకొని కూర్చున్నాడు.

"ఇంట్లో పదిమూట్లు రాగులు పదిమూట్లు జొన్నలూ వుండాయి. రేపు వచ్చి కొలుచుకో – ఇంతకూ ఏమాత్రముంది యిప్పుడు రేటు"

"రాగులేమో అర్వై ఐదు – జొన్నలు అర్వై – అయినా బొత్తిగా గిరాకీ లేదు నారప్పా!"

"ఏం జేస్తాం – అయినకాడికి అమ్మకపోతే అనువుతీరేట్టు లేదు – ఒక రకంగా చూసి ధర తెంచుకో శివయ్యా"

"నా చేతుల్లో ఏముంది నారప్పా! నే నేమన్నా ధర పెంచేవాణ్ణా – తగ్గించేవాణ్ణా – టౌన్‌లో రేటును బట్టి కొంటుంటాను. అన్నవస్తలూపడి వ్యాపారం చేస్తే మూటకు అబ్బా అంటే అర్ధరూపాయి మిగల్దు. ఐనా రాగులూ జొన్నలూ అడిగేవాడే లేడు – రైతుల్ని పోగొట్టుకోలేక తీసుకోవల్సిందేగాని నాకు శానా బరువు నారప్పా! ఒక లారీడు సరుకన్నా అయితే ఎక్స్‌పోర్టు కర్చులు తగ్గుతాయి. ఇరవయ్యో ముప్పయ్యో మూటలకయితే దిక్కులేని కర్చులు – బండిలో టౌన్‌కు తోలల్లంటే మూటకు రెండున్నరకు తక్కువ యెవ్వడూ బండి బాడుగ కట్టరు –"

శివయ్య మాటల ధోరణి చూస్తే నారప్పకు దిగులేసింది. "ముందు ఓ మూడు నూర్లీ శివయ్యా మళ్ళా వచ్చి మాట్లాడుతా"

"శానా అర్జెంటా"

"నీ కత ఇంకా బాగుంది. అవతలవాళ్ళు యింటికాడ కూకుండారయ్యా అంటే"

"రేపు గింజలు కొలవాలమరి – మర్నాడెట్లా సంతగదా! సంత బండ్లలోనన్నా మూటలు

సాగించక పోతాను – రేటు కూడా యిప్పుడు చెప్పినట్లే! నువ్వు మళ్ళా గుయ్ గియ్ అంటే బాగుండదు – మూటకు రెండున్నర బండి బాడుగా, రూపాయి వాణిజ్యం పన్నూ తీసివేసి ధర కడతా – ఆపైన నీ యిష్టం–"

"బండి బాడుగ కూడా నా నెత్తిమీద వేస్తే ఎట్లా శివయ్యా" నారప్ప గొంతులో జీర పలికింది.

"మరి నన్ను జోడిచ్చుకోమంటావా! నువ్వు బలవంత పెడితే నేను కొంటున్నాగాని, నాకేం దీంట్లో లాభమా, పాడా? పాత రైతువి సరుకు తీసుకోనంటే బాధపడతావనే కొంటున్నా గాని–"

నారప్ప వేడిగా నిట్టూర్చాడు. "సరే గాని లెక్క తీసకరా మరి" అన్నాడు మింగలేక, కక్కలేకా –

శివయ్య లోపలికెళ్ళి ఐదునిమిషాల్లో తిరిగి వచ్చాడు. చాలా జాగ్రత్తగా ఒక్కొక్క నోటే ఎంచి నారప్ప చేతికిచ్చాడు. "మున్నూరు" అంటూ.

"లెక్కాచారం చేసి మిగిలింది రేపిస్తాను. పొద్దున్నే జీతగాన్ని పంపిస్తా" అన్నాడు.

నారప్ప సమాధానమివ్వకుండా డబ్బును బనీను జేబులో పెట్టుకొని యింటివేపు నడిచాడు.

★ ★ ★ ★ ★

మరురోజు పొద్దున్నే ఎనిమిది కూడా దాటకుండానే, శివయ్య సంచులతో జీతగాన్ని వెంటబెట్టుకుని నారప్ప యింటికి వచ్చాడు. ఇంటిముందున్న పసుల కొట్టంలో, అట్టన మీద నుండి గడ్డిని తీసి, పశువుల ముందు వెదజల్లుతున్నాడు నారప్ప. శివయ్య గొంతు వినిపించి "అప్పుడే వచ్చినాడే మాన్నుబావుడు" అనుకుంటూ కొట్టంలోంచి బయటకొచ్చాడు.

శివయ్య అరుగుమీద కూచొని సంచీలోంచి 'శేరు' బయటకు తీశాడు ఆ శేరును చూస్తే నారప్పకెప్పుడూ భయమే!

"నీ పెద్దకొడుకు నరసింహులు కనిపించలేదే నారప్పా" కుశల ప్రశ్నలు వేశాడు శివయ్య.

"వానికింటి దగ్గిరుండే తీరికేడిది? పొద్దున్నే శేనికి పొయ్యినాడు"

"శేన్లో శెనక్కాయ ఏమాత్రం వేసినావీసారి"

"రెండు మూట్లు వేసినా – ఏం లాబం – వాన అతీగతీ లేకుండా పాయె! పావలా పంటకూడా యీ సారి కట్టమే! నిరుదు పండిన మాత్రమన్నా చేతికొస్తే కొంత గట్టెక్కచ్చు అనుకుంటే, నెల రోజులుగా వానలేక పైరు ఎండక పోతోంది. మీకేం యీ బాదరబందీ లేదు. వానొచ్చినా రాకపోయినా మీరేం ఎండక పోరు."

"అదెట్లా నారప్పా! రైతులు సల్లగుంటేనే గదా మాకూ యింత తిండి" చిరునవ్వు వలకబోశాడు శివయ్యా.

"రైతులు సల్లగుంటేనా – రైతుల్ని పీలిస్తేనా!" అని మనసులో అనుకుంటూ ఇంట్లోకి తొంగిచూసి "ఇదిగో.... ఏమీ––! ఓ గలాసు పాలు పంపీ – శివయ్య వచ్చినాడు" అంటూ కేకేశాడు నారప్ప.

పదిగంటలకల్లా బస్తాలు నింపే పని పూర్తయింది – గింజలు కొలుస్తున్నంతసేపూ, ఏదో పోగొట్టుకుంటున్నట్టే బాధపడ్డాడు నారప్ప. ఎవరో దొంగలొచ్చి తన యింటి సంపదను దోస్తున్నట్టు యాతన అనుభవించాడు.

కొసరి, కొసరి బస్తాకు రెండు శేర్ల గింజలు అదనంగా కొల్చుకున్నాడు శివయ్య.

నారప్ప బండిమీదనే మూటలు వేయించి తన యింటికి తోలించుకుపోయాడు శివయ్య.

నారప్ప యింత ముద్ద గతికి ఓ గంట తర్వాత, లెక్కాచారం చూసుకొనేందుకు శివయ్య యింటికి వెళ్ళాడు.

నారప్ప శివయ్య ఇంట్లోకి అడుగుబెట్టే సరికి, శివయ్య స్నానం చేస్తున్నాడని చెప్పే బెంచీమీద కూచొని బీడీ వెలిగించాడు. ఎదురుగా గోడమీద వేలాడున్న నిలువెత్తు వెంకటేశ్వరస్వామి ఫోటోనూ, ఫోటో చుట్టూ వున్న చిన్న చిన్న కరెంటు బల్బులనూ చూస్తూండిపోయాడు నారప్ప. 'సంవచ్చర సంవచ్చరానికీ యెంగటేసుల బొమ్మ పెద్దదయితోందే' అనుకున్నాడు.

స్నానమూ, పూజా పూర్తి చేసుకొని నుదుటిమీద కుంకుమ బొట్టుతో హాల్లోకి వచ్చి "అప్పుడే వచ్చినావా, నారప్ప. సరుకేసినంక మీకతంతా యింతేనప్పా – లెక్క యిచ్చేదంకా కొంప కాపలా కాస్తారు" అన్నాడు నవ్వుతూనే – ఆ రకమైన నవ్వు నారప్పకు ఒంట్లో కంపరం పుట్టిస్తుంది.

"మాల్లా మల్లా యాడ తిరుగుతాను – ఇచ్చే వాళ్ళకేదో యిచ్చేస్తే పానం రవ్వంత కుదుట బడుతుంది. నీకిది కనబడదు"

"సరేలేవయ్యా" అంటూ కొల్చుకున్న పంటకు ధరకట్టాడు శివయ్య. మొత్తం 1250 రూపాయిలు బండి బాడుగ యాభై రూపాయిలు, వాణిజ్యం పన్ను ఇరవై రూపాయిలు, మొత్తం డెబ్భై రూపాయిలు, సాయంత్రం తీసుకున్న మున్నూరు, ఇంతకు మునుపు కరెంటు బిల్లులకు తీసుకున్న నూట యాభై, మినహాయించుకొని మిగతా 730 రూపాయల్లో ఐదు నూర్లిచ్చి, తక్కింది రెండు మూడు రోజుల్లో సర్దుతానన్నాడు శివయ్య.

నారప్ప "ఆ కొదవా వుంటే యీ కూడదా – నాకుండే నూరు బొక్కల్లో మల్లా యిదొకటా" అన్నాడు.

"ఇదే మీతో వచ్చిందేది. నేను గాంగ సరుకు తీసుకుంటానే లెక్క యిస్తున్నా. ఇంగొగరికేస్తే నెలలు తిప్పుతారయ్యా – సంతకు పొయొచ్చినంక నేనే పంపిస్తాలే" అన్నాడు మొగం మాడ్చుకుంటూ.

నారప్ప యింకేం మాట్లాడలేదు.

డబ్బును బనీను జేబులో జాగ్రత్తగా పెట్టుకొని, లేవబోతుంటే "వుండయ్యా అంత తొందరేమి" అని నిలబెట్టి ఇంట్లోకి వెళ్ళి ఒక డబ్బా తెచ్చి నారప్ప ముందు బెట్టాడు. ఆ డబ్బా మీద "శివాలయ నిధి" అని రాయబడి వుంది.

"లింగ ప్రతిష్ట ఈసారి శివరాత్రికి చెయ్యాలని అందరూ అనుకొనిందేగదా – ఏదో దైవకార్యం – నీకు తోచింది దీంట్లో వెయ్యవయ్యా" అన్నాడు.

నారప్ప గుటకలు మింగాడు. ఒక నిమిషం తటపటాయించాడు. "లింగ ప్రతిష్ట చేయిచ్చేది నువ్వు – లెక్క మమ్మల్నిడిగేది ఏం బాగుంటుంది శివయ్యా" అన్నాడు.

"ఏంది నారప్పా – ఇదేం నా ఇంటిపనా – దేవుడు నాయబ్బ సొత్తా! వూరందరి పని – కలిగిందాంట్లో అంతో ఇంతో దేవునికిస్తే ఆ పుణ్యమేమీ వూరికే పోదులే – ఆ దేవుని దయే వుండల్ల గాని యిట్టాంటివి మనమెంత సంపాదించకూడదు"

నారప్ప చేసేదిలేక రెండు రూపాయల నోటొకటి తీసి వెయ్యబోతే "మరీ ఇంత

అధ్వాన్నమైతే ఎట్లా నారప్పా! ఓ పదన్నా వెయ్యి" అని బలవంతం చేస్తే గొణుక్కుంటూనే ఆ నోటుకు బదులుగా ఒక ఐదు రూపాయల నోటు తీసి ఆ డబ్బాలో వేసి "వస్తా శివయ్యా! సంతనుండీ రాగానే లెక్క పంపీ – యిబ్బందులు శానా వున్నాయి" అని హెచ్చరించి బయటకు నడిచాడు.

మిట్ట మధ్యాన్నం – పొద్దు కరకర మంటూంది. వీధిలో నడుస్తూన్న నారప్పకు అదేమంత తీవ్రమైన ఎండలా కన్పించలేదు – ఏదో ఏట్లోకి పారవేసి వచ్చినంత బాధగా వుందతనికి. నిరుటిలాగే ధర వుంటే రెండువేలన్నా కళ్ళచూడాల్సింది. ఒక రకంగానన్నా వుండేది.... ఈ మిగిలింది యాటికని సరిపోతాది! ఆ యంగటేసులు శెట్టీ, రామశేషయ్యా, సందకాటికల్లా యింటికాడ మూగుతారు. ఎక్కడి పీడ' అనుకుంటూ వాళ్ళ కొట్లవేపు నడిచాడు.

శెట్టి అంగట్లో మొత్తమయిన అప్పు మున్నూటికిగాను 250 జమ కట్టాడు. రామశేషయ్య బట్టలంగట్లో ఇన్నూటా నలభైకిగాను, ఇన్నూరు జమవేసి మిగిలిన నలభై ఐదు రూపాయిల్నీ లెక్కబెట్టుకుంటూ యింటిదారి పట్టాడు నారప్ప.

దారిలో నడుస్తూ మడికి తేవాల్సిన యూరియా మూట, ఈ నెల కట్టాల్సిన కరంటుబిల్లూ లెక్కవేసుకున్నాడు. ఇంకా గానుగచెక్క తెచ్చిన గాండ్ల మల్లప్పకూ యివ్వల్ల, శివయ్య ఆ తతిమా లెక్కయిస్తే బొటాబొటీ సరిపోతుంది. పండగకు బట్టలూ, పెద్దబిడ్డకు బట్టలూ, మల్లా అప్పులే! ఏం బతుకో ఏంపాడో.

నారప్ప తువ్వాలుతో ముఖం తుడుచుకొని యింటి ముంగిట్లోకి అడుగు బెట్టాడు. ఇంటి అరుగు మీద ఓ వ్యక్తి కూచొని సిగరెట్ పీలుస్తున్నాడు. స్లాగు, పాంటూ, వేసుకున్నాడు – ముప్పయ్ ఏళ్ళుంటాయి. "ఎవరబ్బా" అనుకుంటూ అనుమానంగానే నారప్ప అరుగు దగ్గరకు వచ్చాడు.

ఆ వ్యక్తి నారప్పను చూడగానే "పది గంటలప్పుడు వచ్చినాను. నువ్వు చూస్తే అతీగతీలే – రామ్మూర్తి పంపించినాడు" అన్నాడు.


రామ్మూర్తి పేరు చెప్పగానే, కరెంటు ఇంజను, అనంతపురం, వాసవీ ఎలెక్ట్రికల్స్ షాపూ, నారప్ప కళ్ళ ముందు మెదిలాయి.

కరెంటింజను బాపతు లెక్క యింకా ఎనిమిది నూర్లుందంట – నెలకిందటనే తెచ్చి యిస్తానని చెప్పింటివంట – నీకోసం చూసి చూసి ఎన్నాళ్ళకూ రాకపోతే నన్ను పంపించినాడు రామ్మూర్తి. వెంటనే బాకీ పైసలు చెయ్యకపోతే బాగుండదని చెప్పినాడు. ఇదిగో నీ పేరుతో చీటీ కూడా రాసి పంపించినాడు" అంటూ ఓ తెల్లకాగితం మడత నారప్ప చేతికందించాడు ఆ వచ్చిన మనిషి.

నారప్ప ఏం మాట్లాడలేదు.

('ప్రజాసాహితి'
1978 నవంబరు సంచిక నుండి) ✺

# డి.ఎన్.ఝా (ద్విజేంద్ర నారాయణ్ ఝా) మరణం



**ఢిల్లీ** విశ్వవిద్యాలయ ఆచార్యుడు, భారత ప్రాచీన, మధ్యయుగ చరిత్రపై సాధికారిత గల చరిత్రకారుడు డి.ఎన్.ఝా తన 81వ ఏట 4-2-2021న ఢిల్లీలో మరణించారు. ఆయన 1940లో జన్మించారు.

1959లో కలకత్తా యూనివర్శిటీకి చెందిన ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ.(ఆనర్స్), ఆ తర్వాత పాట్నా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదివిన ఝా, ప్రసిద్ధ చరిత్రకారుడైన ఆర్.ఎస్. శర్మ వద్ద విద్యార్థి. చరిత్రను సామాజిక ఆర్థిక కోణాల నుండి అధ్యయనం చేసిన ఆధునిక భారతీయ చరిత్రకారుల్లో ఆర్.ఎస్.శర్మ ఒకరు. ఝా 1997లో 'ప్రాచీన భారతదేశం – ఒక చారిత్రక పరిశీలన'; 2001లో 'పవిత్ర గోమాత ఒక పుక్కిటి పురాణం' (ది మిత్ ఆఫ్ ది హోలీ కౌ); 2004లో 'ఎర్లీ ఇండియా – ఎ కన్‌సైజ్ హిస్టరీ'; 2020 జనవరిలో 'ప్రాచీన భారతంలో మద్యపానం' అనే గ్రంథాలు రచించారు. ఎన్.సి.ఇ.ఆర్.టి వారి చరిత్ర పుస్తకాలు రాశారు. ఆయన ఐ.సి.హెచ్.ఆర్‌లో సభ్యుడు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు కార్యదర్శిగా పనిచేశారు.

ఆవు పవిత్ర జంతువు అనడంపైనా, దానిని గోమాత అని పిలవడంపైనా, గోమాంసం తినడం పాపమని అనడంపైనా, ఇటీవల హిందూమతవాదులు చేస్తున్న ప్రచారంపైనా 2001లో ఆయన రాసిన 'ది మిత్ ఆఫ్ ది హోలీ కౌ' పుస్తకాన్ని మొదట్లో మత ఆందోళనకారుల వల్ల అమ్మకాలు ఆపేసినా, 2004లో దానిని వెర్సో ప్రచురణకర్తలు అంతర్జాతీయంగా విడుదల చేశారు. 2009లో ఇండియాలో నవయాన సంస్థ ముద్రించి విడుదల చేసింది. ఆ పుస్తకంలో ఆయన భారతీయుల తొలి ఆహారపుటలవాట్లలో ఆవు మాంసం కూడా ఒకటనీ, వైద్యం కోసం కూడ ఉపయోగించేవారనీ, యజ్ఞాలలో ఆవులను బలి ఇచ్చేవారనీ, వేదాలు, ఉపనిషత్తుల ఆధారంతో ఋజువు చేశారు.

ఈ పుస్తకం రాసినందుకు ఆయనకు చంపివేస్తామని బెదిరింపులు వచ్చాయి. ఆయన ఉపన్యాస కార్యక్రమాలను అడ్డుకున్నారు. భౌతికదాడులు చేశారు. అయినా ఆయన బెదరలేదు. తన పరిశోధనా ఫలితాలను ధైర్యంగా తన పుస్తకాలలో రాశారు. గోమాంస భక్షణ ముస్లిములు ప్రవేశపెట్టారన్న ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఆవు మాంసం తినడం వేద కాలం నుంచీ వున్న భారతీయుల ఆహారపుటలవాటు అని చెప్పారు. బాబ్రీ మసీదును రామాలయం కూల్చి కట్టారన్న వాదనకు ఋజువులు ఏమీ లేవని 1991లో రాసిన నివేదిక సమర్పించిన నలుగురు చరిత్రకారులలో ఝా కూడా ఒకరు. గత సంవత్సరం 2020లో ప్రాచీన భారతంలో మద్యపానంపై రాసిన పుస్తకంలో అప్పట్లో 50 రకాల మద్యాలను త్రాగేవారని వివరించారు. గుప్తుల కాలాన్ని 'స్వర్ణయుగ'మని చిత్రీకరించడాన్ని ఆయన తప్పు పట్టారు.

మతతత్వాన్నీ, కాషాయీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆధునిక అభ్యుదయ చరిత్రకారుడు ఝా. ✺

కవిత

# వలస నడకల దుఃఖం

- తన్నీరు నాయబ్ రసూల్

యుగయుగాలుగా నడుస్తున్నట్లుగానే
అనివారిత నడక అసహజంగా
కలిచివేస్తున్న దృశ్యాలు మేఘాలై అలుముకుంటున్న
చెప్పనలవిగాని దుఃఖపు సరిహద్దు నుండి
ఒక హృదయ ద్రవీకరణంలా మొదలౌతుంది
నలిగిన, పగిలిన మనసుబాటల అగాథాల వెంట
సొంత గమ్యాల కోసం ఇదివరకెరుగని నడకలు
ఆకలిదప్పుల లోతులకు భయపడకుండా
అశేష హృదయార్తనాదాలను జతగా చేసుకుని
రాక్షస దారులపై రక్త చారికలై నడుస్తుంటాయి
ఇంతకీ నడిచేది వలస తత్త్వమైన నువ్వూ, నేనే
విషాదాలుగా విచ్చుకునేది నువ్వూ, నేనే
చిట్లిన కలలు పాదాల పగుళ్ళై
కఠినదారులపై కన్నీళ్ళై కదిలిపోతుంటే
ఉచ్ఛ్వాస, నిశ్వాస దారాలతో అల్లిన
కొత్త రక్తపు సాలీడు గూడులో చిక్కుకున్న
అనంత దుఃఖ ఊహలగతులుగా
దేశానికి వేలాడేది మళ్ళీ నువ్వూ, నేనే
బాధాతప్త విపంచికల దగ్ధ గానాలపై
అసహాయకీలలై సాగిపోతున్న పేద జీవితాలు
వినిపిస్తున్న హృదయ ద్రవీకరణ మాటలు
మన కరుణ చూపులంతటిపై కుమిలిపోతున్నాయి
ఇదో వర్ణించనలవిగాని సంద్రపుఘోష
వ్యాఖ్యానాలకు అందని విలయగాథ
రహదారులతో మాటలు కలుపుకుంటూ సాగుతున్న
నగ్న పాదాల ఓపికను
కొన్ని కన్నీళ్ళు ధారపోసి స్వాగతించాలి
చెమట స్నానాలు చేసుకుంటూ
ఎండగాలికి దేహాలను అరబెట్టుకుంటూ
దారులు దారులుగా విడిపోయిన నడక
ఆనందపరిచే చేయూత గమనాల కోసం
దేశ వెన్నెముకల నమూనాలుగా నడిచి పోతుంటాయి
ఇప్పుడంటే ఇప్పుడు నడవడం జీవిత కాంక్ష
తడబడే నడకల అలసటలతో
గూటికి చేరె పిట్టల్లాగా, ఆశల రెక్కలపై
ఇంటికి చేరుకోవడమే అసలు సిసలు బ్రతుకు యుద్ధం
నిరంతర బాటసారి మనసులను చేసుకుని
సొంతనేలకు చేరుకోవడమే ఆఖరి మజిలి
బాధలు బాధలుగా కదిలిపోతున్న ప్రస్థానాలు
జీవన రంగస్థలంపై కొత్త సందేహాలకు
సరికొత్త నడకలను నేర్పుతున్నాయి
అలసి సొలసి నడుస్తున్న పేదపాదాలు
వెలుగురేఖల వాకిటకు చేరేవరకు
నువ్వూ, నేను నడకల మడుగులవుదాం
దుఃఖపు కొనల నుండి క్షేమంలోకి
దుఃఖరహితమై వెళ్లేందుకు దుఃఖపాటవుదాం
నడిచిపోతున్న దుఃఖాలన్నీ
రేపటి దేశపు సుఖాలవ్వాలని
నువ్వూ, నేను కొంచెం కొంచెంగా దుఃఖనదులౌదాం
మనమిప్పుడు అనేక లేత పాదాలమై
జీవన రహదారుల వెంట మొలుద్దాం
వలస నడకల ఊతమయ్యి నిలుద్దాం
దేశపు దేహంపై వలస నడకల దుఃఖమై
అనేక ప్రశ్నల గుత్తులై వేలాడుదాం
ప్రశ్నించే గొంతులమై నినదిద్దాం

కవిత

# 'రైతు పోరు'

- షేక్. కరీముల్లా

**పొలాలన్నీ** హలదండలై,
జన సముద్రాలై ఉరికి వస్తున్నాయి.
విత్తనాలు విచ్చుకొని
చెట్లు అవుతున్నాయి.
చెట్లు అడవులై....
ధిక్కార స్వరాలై....
ఉప్పెనలై....
మరో ప్రపంచాన్ని సూచిస్తున్నాయి.
ఇది జనహోరు.... ఇది రణహోరు....
పల్లెలు కదులుతున్నాయి.
నగరాలు, మహానగరాలు కదులుతున్నాయి.
ఢిల్లీ శివారుల్లో
ఊర్లకు ఊర్లు వెలుస్తున్నాయి.
గ్రామాలు చైతన్యమై
ఫాసిస్టు మూకలకు సమాధానం చెబుతున్నాయి.
పొలాలు దున్నే ట్రాక్టర్లు
పాలకుల గుండెలపై కవాతులు చేస్తున్నాయి.
ఛిద్రమైన ఈ దేశపు దేహం
నెత్తుటి గాయాలతో
రేపటి నవ చరిత్రను నిర్మిస్తోంది.
ఇంక్విలాబ్ జిందాబాద్..

# రైతాంగ ఉద్యమాలను శక్తిమంతంగా నిర్మించాల్సిన ఆవశ్యకతను తెలియజేసే

# 'చరిత్రాత్మక రైతు రక్షణ యాత్ర' (జులై 1937-మార్చి 1938)

- రవి

**జాతీయోద్యమంలో** భాగంగా రైతాంగ ఆందోళనలూ విస్తృతంగా సాగాయి. ఆనాటి రైతుసంఘ ఆధ్వర్యంలో నిర్మాణయుతంగా సాగిన ఈ 'రైతు రక్షణ యాత్ర' కూడా అందులో భాగమే. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంజిల్లా ఇచ్ఛాపురం నుండి కోస్తా జిల్లాలన్నింటిలో పర్యటిస్తూ మద్రాసు వరకు సాగింది ఈ యాత్ర. కాలినడకన 1512 మైళ్ళ (2414 కి.మీ.) దూరం, 130 రోజులపాటు రైతుసంఘం నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావుగార్ల నాయకత్వంలో సాగిన ఈ యాత్ర యావద్భారత దృష్టినాకర్షించింది. యాత్ర ముగింపుగా ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు రైతాంగ, ఆదివాసీ సమస్యలపైన, జమిందారీ విధాన రద్దు కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు.




రైతు రక్షణ యాత్ర రైతాంగాన్ని, ముఖ్యంగా ఆనాటికే వివిధ సంస్థానాల్లో మగ్గుతున్న రైతాంగ, పీడిత ప్రజానీకాన్ని బాగా ప్రభావితం చేసింది. జమిందారీ వ్యతిరేక పోరాటాలు వూపందు కోవటానికి దోహదపడింది. ఈ కారణాలన్నింటి ఫలితంగానే మద్రాసు రాష్ట్ర శాసనసభలో జమిందారీ రద్దు బిల్లును నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టవలసి వచ్చింది. (జమిందారీ విధానాన్ని రద్దుచేస్తూ 1948 సం॥ నాటికి గానీ చట్టం రాలేదు)

రైతు రక్షణ యాత్ర జరిగి ఎనిమిదిన్నర దశాబ్దాలు అవుతున్నా, ఈ యాత్ర చారిత్రక ప్రాధాన్యతతోపాటు ప్రాసంగికతనూ కలిగి వుంది. మారుమూల పల్లెల్లోని నిరుపేద రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను, ఆదివాసులను సంఘాలలోకి సమీకరించి సంఘటిత పోరాటాలను ఎలా నడపాలో రైతు రక్షణ యాత్రను నిర్వహించిన తీరును పరిశీలిస్తే స్పష్టమౌతుంది.

ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవసాయ, రైతాంగ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో, ఈ సంక్షోభ పరిష్కారానికి రైతాంగ ఉద్యమాలను శక్తివంతంగా నిర్మించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పేందుకే రైతు రక్షణ యాత్ర పుస్తకాన్ని ముద్రిస్తున్నట్లుగా ప్రచురణకర్తలు పేర్కొనటం గమనించ దగింది. గత చరిత్ర భుజాలపై నిలబడి వర్తమానం నుండి మెరుగైన భవిష్యత్‌కై ముందుకు సాగటానికి వకుళాభరణం రామకృష్ణగారు వెలువరించిన రైతురక్షణ యాత్ర పుస్తకం విలువైన అనుభవాలనందిస్తోంది.

## రైతు రక్షణయాత్ర - రాజకీయార్థిక నేపథ్యం

రైతు రక్షణ యాత్ర ఏ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించిందీ రామకృష్ణగారు చారిత్రకంగా ఈ పుస్తకంలో వివరించారు. ఓవైపు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస దోపిడీకి తోడు, సంస్థానాధీశుల, జమిందార్ల పీడన అణచివేతలను రైతు, కూలీ, ప్రజానీకం ప్రధానంగా ఎదుర్కొంటున్న కాలమది.

బ్రిటిష్ వలసవాదులు మన దేశంలో వేళ్ళూనుకున్న తర్వాత భూమిపై జమిందారులకు ఆస్తిహక్కు కల్పించటంతోపాటు, భూమిశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టారు. వేలం ద్వారా శిస్తు నిర్ణయించి విచ్చలవిడిగా వసూలుచేసే ఈ విధానానికి వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమించారు. దీనితో 30 సం॥ల వరకు ఒకే రకమైన శిస్తు వుండే విధంగా శాశ్వత శిస్తు విధానం తెచ్చారు. రైతులు ఏవిధంగానూ శిస్తుల నుండి తప్పించుకోలేకపోయారు. 1802 నుండి 1930 మధ్య కాలంలో రైతులు చెల్లించిన శిస్తు నాలుగు నుండి 25 రెట్లు పెరగటం, రైతాంగాన్ని ఎలా దోచుకున్నారో తెలియజేస్తోంది. ఈ దోపిడీని సహించలేకనే 1857 నాటికే మనదేశంలో వేలాది రైతాంగ, ఆదివాసుల, పౌరుల - తిరుగుబాట్లు సంభవించాయి.

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వివిధ పాయలుగా జాతీయోద్యమం సాగింది. 1920ల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకత్వ స్థానంలోనున్న గాంధీ, అహింసా సిద్ధాంతాన్ని ప్రబోధిస్తూ ప్రజా పోరాటాల వెల్లువపై నీళ్ళు చల్లుతున్నాడు. అయినప్పటికీ బ్రిటిష్ పాలకులపై తిరుగుబాట్లు ఆగలేదు. ఆంధ్ర రాష్ట్రంలో ఒక్క గుంటూరు జిల్లాలోనే 1930లలో జరిగిన చీరాల-పేరాల శాసనోల్లంఘనం, పెదనందిపాడు శిస్తుల నిరాకరణ ఉద్యమాలతోపాటు పల్నాడులో పుల్లరి వ్యతిరేక పోరాటం దేశవ్యాపితంగా సంచలనం కలిగించాయి.

1920 దశకందాకా రైతుసంఘాలకు దేశ స్థాయిలో నిర్మాణ స్వరూపం లేదు. చెదురుమదురుగానున్న సంఘాలన్నింటికీ కలిపి 1930లలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్మాణరూపం ఇచ్చారు. 1936లో ప్రాథమిక స్థాయిలో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ, డిసెంబర్‌లోనే రెండవ మహాసభలు జరుపుకొని రైతాంగ సమస్యలపై

విస్తృతంగా దృష్టి సారించింది. 1936 తర్వాతనే కాంగ్రెస్ పార్టీ తన ఎజెండాలో వ్యవసాయ సమస్యలను కార్యక్రమంగా చేర్చింది. సమస్యలను పేర్కొనటం వరకే కాంగ్రెస్ పరిమితమైంది కానీ, వాటిపై నిర్దిష్ట కార్యాచరణలోకి రాలేదు. పైగా ఈ డిమాండ్స్‌పై పనిచేస్తున్న కిసాన్ సభ అంటే కాంగ్రెస్‌కు సరిపడని విధంగా తయారైంది. రైతు రక్షణ యాత్రలోనూ మొదట కాంగ్రెస్ నాయకత్వం భాగస్వామిగా వున్నా, క్రమక్రమంగా దానికి దూరం జరుగుతూ వచ్చింది. (గాంధేయవాదిగా, కిసాన్ సభ నాయకునిగా రైతు రక్షణ యాత్రకు నాయకత్వం వహించిన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు కాంగ్రెస్ నుండి విడగొట్టుకొని సోషలిజం ధ్యేయంగా, కార్మిక-కర్షక రాజ్యం కోసం నిలిచారు.) ఇదీ రైతు రక్షణ యాత్ర రాజకీయ నేపథ్యం.

## దిగజారిన రైతాంగ జీవన స్థితిగతులు

రైతు రక్షణ యాత్ర చేపట్టిన కాలంలో రైతాంగం, గ్రామీణ పేదల దుస్థితి ఇలా వుంది : రైతులలో వందకు 95 మంది దుర్భర దారిద్ర్యంలో మునిగి వున్నారు. పన్నుల భారం, భూమి శిస్తు భారం వారిని కుంగ దీస్తున్నది. వరదలు, కరువుకాటకాలు మొదలైన ప్రకృతి అవాంతరాలు తరచుగా పంటలకు నష్టం చేస్తున్నాయి. ఆర్థిక తోడ్పాటు లేక రైతులు నూతన వ్యవసాయ పరిశోధనా ఫలితాలను పొందలేకపోతున్నారు. రైతుల రుణ పరపతి అడుగంటిపోయింది. రైతులకు కుటుంబ పోషణయే భారమైంది. అనేకమంది రైతులు రుణభారాల వల్లనే భూములను కోల్పోయి నిరాధారులౌతున్నారు. రుణభారమధికమై రైతుల భూములన్నీ వ్యవసాయేతరులైన బడా సంపన్నుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వ బ్యాంకులు రైతులకిచ్చే రుణాలు చాలా పరిమితంగా వున్నాయి. మంచినీటి కోసం ఎంతోదూరం నడిచి పోవాల్సి వస్తోంది. సాగునీటి సౌకర్యాలు లేవు. ఫలితంగా రాయలసీమలో కరువులు సంభవిస్తున్నాయి. లంచగొండితనం తీవ్రమైంది. పోలీసుల జులుం పెరిగిపోయింది. ఫ్యూడల్, దౌర్జన్యాలు, అక్రమాలతో అనేక గ్రామాలు భూలోక నరకాన్ని తలపిస్తున్నాయి. అటవీ ప్రాంతవాసుల బాధలు తీవ్రంగా వున్నాయి. వారి హక్కులన్నింటినీ హరించి వేస్తున్నారు. రైతులలో నూటికి 95 మంది నిరక్షరాస్యులై వున్నారు. దళితులకు తిండి, ఇంటి వసతి లేక ఎంతో హీనంగా చూడబడుతున్నారు. సాంఘికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి వున్నారు. గ్రామాల్లో విద్య వైద్యమేకాక కనీస సౌకర్యాలు కూడా లేవు. ప్రభుత్వ పాలనంతా పరాయిభాషలో జరగటం ప్రజలకు చాలా కష్టంగా వుంది. (ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం నాటి కంటే నేటి గ్రామీణ పేదల స్థితిగతులు ఎంత 'మెరుగయ్యాయో' మన కళ్ళెదటే వుంది కదా?!)

పైన పేర్కొన్న రాజకీయార్థిక నేపథ్యంలో, రైతాంగ ప్రజానీకపు జీవనం తీవ్రంగా దిగజారిన పరిస్థితుల నేపథ్యంలో సాగిన రైతు రక్షణ యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది.

## చైతన్యయుతంగా సాగిన రైతు రక్షణ యాత్ర

1937 జులై 3వ తేదీన ఈ యాత్ర ప్రారంభమైంది. 1512 మైళ్ళు కాలినడకన, 130 రోజులపాటు, 520 గ్రామాలగుండా సాగిన ఈ యాత్రలో నాలుగున్నర లక్షలమంది ప్రజానీకం వద్దకు ఉద్యమ సందేశాన్ని చేరవేశారు. 25 వేలమంది సంతకాలతో కూడిన దాదాపు 500 విజ్ఞాపన పత్రాలను క్షేత్రస్థాయిలో రైతాంగం వీరికి అందజేశారు.

రైతు రక్షణ యాత్ర నిర్వాహక కమిటి, యాత్ర వివరాలను, ఏ సమయానికి ఏ గ్రామం చేరుకునేదీ ముందుగానే తెలియబర్చేవారు. దానికనుగుణంగా యాత్రను పొలిమేరల నుండే రైతుకూలీలు మేళతాళాలతో స్వాగతించేవారు. ప్రజలు వెంట నడుస్తూ మరొక గ్రామానికి దోవ తీసేవారు. మధ్యలో సభలు నిర్వహించటంతోపాటు రైతు రక్షణ నిధికి 'పైసా ఫండ్' ఇవ్వాలని ప్రజలను కోరేవారు. రైతు భజనలు, పాటలతో యాత్ర ఓ మహా ప్రవాహంలా సాగింది. ప్రధాన యాత్ర జరిగే మార్గానికి దగ్గరలోని గ్రామాల రైతులు పరిసర గ్రామాలను కలుపుతూ వారంతా ఒక యాత్రగా బయలుదేరి, ప్రధాన యాత్రలో కలిసే విధంగా చిన్న చిన్న యాత్రలు ఎన్నో జరిగాయి. రాత్రికి గ్రామస్థులు పెట్టిన అన్నం తినడం, దగ్గరలో వున్న సత్రాల్లో బసచేయటం జరిగేది. ఈ సభలలో స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొనేవారు. కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావుల నాయకత్వంలో సాగిన ఈ యాత్రలో ఎక్కువ ప్రాంతాలు పర్యటించిన ఇతర నాయకులలో గౌతు లచ్చన్న, పుల్లెల శ్యాంసుందరరావు, ఎన్.జి.రంగా, భారతీదేవి రంగా, నెల్లూరు వెంకట్రాముడు, చుండి జగన్నాథం, నందూరి ప్రసాదరావు, పిన్నమనేని శీతారామయ్య, రెబ్బాప్రగాడ మందేశ్వరశర్మ, వావిలాల గోపాలకృష్ణయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలైనవారున్నారు.

ఆంధ్రరాష్ట్ర ఉద్యమ చరిత్రలో ఒక ప్రాధాన్యత గల ఘట్టంగా చెప్పుకోదగిన రైతు రక్షణ యాత్ర గురించిన సమగ్ర నివేదిక లిఖిత చరిత్రకెక్కలేదు. ఈ యాత్ర గురించిన విశేషాలు అక్కడక్కడా పాక్షికంగా లభించటమే తప్ప యాత్రా క్రమమంతా మొత్తంగా నమోదు చేయబడలేదు. చరిత్ర పరిశోధకులుగా వకుళాభరణం రామకృష్ణగారు ఆనాడు ప్రచురితమైన పత్రికా వార్తల నుండి, ఆ యాత్రలో పాల్గొన్న కొందరు వ్రాసుకున్న జ్ఞాపకాల నుండి సేకరించిన భాగాలన్నింటినీ ఒక దగ్గరకు కూర్చి, రైతు రక్షణ యాత్రను కాలక్రమానుగతంగా నమోదు చేసి అందివ్వటం ఆయనకున్న ఉద్యమ స్పృహను తెలియచేస్తుంది. కొన్ని జిల్లాలలో రైతు రక్షణ యాత్ర విశేషాలు చాలా పరిమితంగానే లభ్యమయ్యాయి. భవిష్యత్తులో దీనినింకా పరిపుష్టం చేసుకోవలసి వుంది.

ఇచ్ఛాపురంలో 1937 జులై 3న ప్రారంభమైన రైతు రక్షణ యాత్ర 525 గ్రామాలగుండా సాగి 1938 మార్చి 27న మద్రాసు చేరుకుంది. ఈ యాత్రలో కాంగ్రెస్‌వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, యువజనులు, కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 1937 అక్టోబర్ 1 నుండి 1938 ఫిబ్రవరి 16 మధ్యకాలంలో - రైతు నాయకుల అనారోగ్యం, వర్షాలు, ప్రజలకు ముమ్మరమైన పనులు - కారణంగా యాత్రను తాత్కాలికంగా నిలిపి తర్వాత కొనసాగించారు. మొత్తం 1512 మైళ్ళు కాలినడకన, 542 మైళ్ళు మోటారు వాహనాల మీద యాత్ర సాగింది. 500 గ్రామాలలో సభలు, 60 తాలూకా స్థాయి సభలు జరిగాయి. ఈ సభలలో దాదాపు 4,50,000 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ పైన తెల్పిన అంకెలన్నీ - దాదాపు 85 సం॥ల క్రితం, ఎంతటి పట్టుదల, పథకం, సమన్వయంలతోపాటు ఎంతగా ప్రజల తోడ్పాటు వుంటే ఇది సాధ్యమౌతుందో తెలుపుతున్నాయి.

## రైతుల 'ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్'

ఈ యాత్రాక్రమంలో 25,000 ప్రజల సంతకాలతో కూడిన 800 దరఖాస్తులను, స్థానిక ఇబ్బందులను గురించి రైతులు పెట్టుకున్న 300 అర్జీలను క్రోడీకరించి దాదాపు 100 డిమాండ్లతో కూడిన 'ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్'ను రూపొందించి ప్రభుత్వానికి మెమోరాండం రూపంలో అందించారు.

రైతు రక్షణ యాత్ర పుస్తకంలో వర్గీకరించిన ఆ డిమాండ్స్ అన్నింటినీ అందించటం చాలా ఉపయోగకరంగా వుంది. ఆనాటి పరిస్థితుల్లో రైతులు, కూలీలు, గ్రామీణ పేదలు, ఆదివాసులు, దళితులు, కౌలుదార్లు మొదలగువారి సమస్యలన్నింటిపై రూపొందించిన డిమాండ్స్ ఇందులో వున్నాయి. ముఖ్యంగా నాటి జమిందారీ వ్యవస్థలో రైతులెదుర్కొంటున్న సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. జమీన్ రైతులు, రెమిషన్స్, నీటి వసతులు, అడవులు, శిస్తు వసూళ్ళు, సాముదాయక భూములు, సర్వే సెటిల్‌మెంట్లు, లంక భూములు, స్వంత భూములు, జమాబంది, ల్యాండు కోర్టులు, రైత్వారీ రైతులు, రుణములు మొదలైన అంశాలపై డిమాండ్స్ ఇందులో వున్నాయి.

## ప్రస్తుత రైతాంగ సంక్షోభం – 'రైతు రక్షణ యాత్ర' ప్రాసంగికత

భూముల నుండి పెద్ద ఎత్తున రైతుల గెంటివేత, అడవుల నుండి ఆదివాసుల విస్థాపన, రైతుకూలీల వలసలు; సన్నకారు, చిన్నకారు రైతులేగాక మధ్యతరగతి రైతుల దివాలా.. ముఖ్యంగా కౌలురైతుల ఆత్మహత్యలు మొదలైన సవాలక్ష సమస్యలతో ప్రస్తుత రైతాంగం, ఆదివాసులు కుదేలై వున్నారు. ఎరువుల, పురుగుమందుల, విత్తనాల ధరలు పెంపు చేస్తూ వ్యవసాయ ఖర్చులను పెంచుతోన్న పాలకులు, ప్రకృతి విపత్తులకు ఎదురొడ్డి రైతులు దక్కించుకున్న ఆ కొద్దిపాటి పంటలకు సైతం న్యాయమైన ధర, గిట్టుబాటు ధర కాదు కదా, ప్రభుత్వమే ప్రకటించిన కనీస మద్దతు ధరను కూడా కల్పించకుండా సామ్రాజ్యవాద మార్కెట్‌శక్తుల దయాదాక్షిణ్యాలకు వారిని వదిలి వేస్తున్నారు. ఉద్దేశ్యపూరితంగానే రైతులను దివాలా తీయించి, భూములు వదిలిపోయేట్లుగా, కార్పొరేటు సంస్థల బాధిత కూలీలుగా, కాంట్రాక్టు వ్యవసాయంలో నిర్బంధ పాలేర్లుగా కట్టివేస్తున్నారు. గ్రామాల్లో దళితులపై, నిరుపేదలపై, మహిళలపై ఫ్యూడల్ హంతకదాడులు పెచ్చరిల్లుతున్నాయి.

ఈ సంక్షోభ పరిస్థితులకు ప్రతిచర్యగానే ప్రస్తుతం దేశంలో సాగుతున్న రైతాంగ ఉద్యమం వుంది. రైతులను అన్నివిధాలా దగా చేసే మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని గత 8 నెలలుగా రైతాంగం ఆందోళనలు సాగిస్తున్నారు. గత సం॥ నవంబర్ 26న 'ఛలో పార్లమెంట్' పిలుపుకు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి లక్షలాదిగా రైతాంగ ప్రజానీకం తరలివచ్చారు. పోలీసులు సృష్టించే ఆటంకాలను, అవరోధాలను అధిగమించి ముందుకు సాగుతున్నారు. ఢిల్లీ శివారు రహదార్లనే ఆవాసాలుగా చేసుకొని లక్షలాదిమంది రైతాంగం గడ్డ కట్టించే చలిని, వర్షాన్ని లెక్కచేయకుండా గత 3 నెలలుగా ఉద్యమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసే కుట్రలను తిప్పికొట్టారు. ప్రభుత్వ అనుకూల మీడియా సాగించే దుష్ప్రచారాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు. లాఠీఛార్జీలు, జల ఫిరంగులను కాచుకున్నారు. ముఖ్యంగా జనవరి 26న 'ఎర్రకోట ఘటన' సాకుతో ప్రభుత్వం నిర్బంధాన్ని తీవ్రం చేసింది. ఢిల్లీ చేరుకునే జాతీయ రహదార్లపై కందకాలు తవ్వించింది; మొనదేలిన ఇనుప మేకులను రహదారులపై పాతించింది. ఇప్పటికే ఈ ఉద్యమంలో వివిధ కారణాలతో 200 మంది వరకూ మరణించారు. ఈ రైతాంగ ఉద్యమానికి దేశవ్యాపితంగానూ ప్రపంచవ్యాప్తంగానూ కార్మికులు, విద్యార్థి, యువజనులు, మేధావులు మద్దతుగా నిలుస్తున్నారు. కవులు, కళాకారులు దాదాపుగా దేశంలోని అన్ని భాషలలోనూ ఈ ఉద్యమాన్ని చిత్రిస్తూ, నిర్బంధాన్ని ఖండిస్తూ, సంఘీభావం ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా పాటలు, కవితలు, కథలు, కళారూపాల ద్వారా చాలా విస్తృతంగా స్పందిస్తున్నారు.

ప్రస్తుత రైతాంగ ఉద్యమ డిమాండ్లు దేశవ్యాపిత స్వభావాని వైనప్పటికీ, ఉద్యమం వివిధ కారణాల వలన అన్ని ప్రాంతాల్లోనూ ఒకే విధంగా లేదు. ఏమైనా, తక్షణం రైతాంగాన్ని కదిలించగలిగిన నిర్దిష్ట డిమాండ్లను రూపొందించుకోవటం అవసరం. అందుకే క్షేత్ర స్థాయిలోని వాస్తవిక పరిస్థితులను నాయకత్వం అవగతం చేసుకునేందుకు, ఒక ఉద్యమంగా ప్రజలను కదిలించేందుకు 'రైతు రక్షణ యాత్ర'ను ఈ కోణంలో పరిశీలించటానికి, అనుభవాలను గ్రహించేందుకు 'రైతు రక్షణ యాత్ర' పుస్తకం ఉపయోగకరంగా వుంటుంది.

చట్టపరంగా జమిందారీ విధాన రద్దుకు రైతు రక్షణ యాత్ర నాంది పలికింది. మునగాల, వెంకటగిరి, కాళీపట్నం, పిఠాపురం, మందస, చల్లపల్లిలలో జమిందారీ, ఇనాందారీ వ్యతిరేక పోరాటాలు రూపందుకోవడానికి రైతు రక్షణ యాత్ర తోడ్పడింది. ఈ పోరాటాల ప్రధాన ఉద్దేశ్యం జమిందారీ, భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి, దున్నేవానికే భూమిపై హక్కు కల్పించటం. రైతుసంఘ నిర్మాణం దృష్టితో నిర్వహించిన ఈ రైతు రక్షణ యాత్ర ఫలితంగా గ్రామస్థాయి నుండి నిర్మాణాన్ని ఏర్పరచుకొని బలోపేతం చేసుకోవటానికి రైతు సంఘం శాఖోపశాఖలుగా విస్తరించటానికి తోడ్పడింది. ఈ అనుభవాలను ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవటం అవసరం.

పుస్తకం పేరు 'రైతు రక్షణ యాత్ర' అయినప్పటికీ, ఆ యాత్ర నేపధ్యాన్ని, ఆ యాత్ర ఫలితాల్ని కూడా రచయిత ఇందులో పొందుపరిచారు. యాత్రకు నాయకత్వం వహించిన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావుల జీవిత విశేషా లందించటంతోపాటు యాత్రలో పాల్గొన్న వివిధ జిల్లాల ముఖ్యుల వివరాలు అందించారు. ముఖ్యంగా 'అనుబంధం'లో రైతు రక్షణ యాత్ర మద్రాసులో రాష్ట్ర స్పీకరుకు అందించిన విజ్ఞాపన పత్రం, డిమాండ్స్‌ను ఉద్యమ కార్యకర్తలు పరిశీలించాలి. చరిత్ర పఠనాసక్తి గలవారికి మాత్రమేగాక, ఉద్యమ కార్యకర్తలకు సైతం పునశ్చరణగా ఈ పుస్తకం తోడ్పడుతుంది. ✺

## బి.ఎన్. మూర్తి

**గత** 40 ఏళ్ళుగా భారత నాస్తిక సమాజంలో క్రియాశీలంగా పనిచేస్తూ, విశాఖపట్నంలోని సామాజిక చైతన్యవేదిక కన్వీనర్ బి.ఎన్. మూర్తి 23-1-2021న విశాఖలో మరణించారు. ✺

గల్పిక

# అమ్మకానికి దేశం

– శంకరం

**'యేట్రా** ఏవైంది అందరూ అలా పరిగెడతన్రు' గాభరాగా అడిగాడు వెంకన్న

'నీకు తెల్దా మన సోవీసుగాడ్సచ్చిపోనాడంట్రా' అంటూ ఏడుపు ముఖంతో చెప్పాడు గంగరాజు.

'అమ్మమ్మమ్మ..... యెంత పనైపోనాది! నిన్న పొద్దేల యిద్దరవీ కల్లు పాక్కాడ కల్సి తాగినాం. అప్పుడు బానే వున్నాడ్రా.... కాపోతే రోజూనాగ వుసారుగలేడు.... మరింతలోనే యేటైపోనాది.... యేవైనా దెలిసిందా?' అంటూ ఆరా తీసాడు వెంకన్న బాధపడుతూనే.

నిన్న రేత్రి యింటికొచ్చిన కాడ్నుంచీ మొగుడు, పెల్లాల మజ్జి గొడవయ్యిందంట....

దేనికో....?

"సోవీసుగాడి అయ్య యవుసాయం మీద సేసిన అప్పులు పెరిగిపోయి, అప్పులోల్ల బాద పడ్నేక ఆ అప్పులోల్లకే యింటిని తెగనమ్మీసేడట. దాని మీద ఈడి పెల్లం 'పిల్లలకి దిక్కు నేకండా సేసినారయ్యా' అంటూ 'ఉండనీకి కొంపా కూడా నేకపోతే ఎక్కడుండేటట్టు' అని నిస్టూరం వేసిందట. ఈడు బాదతో నిద్రట్టక తెల్లార్లూ అటూ ఇటూ కదుల్తూనే ఉన్నాడంట. ఆలిసంగా తొంగున్న పిల్ల ఏకువ జామునే నెగనేక పోయిందంట. పొద్దేక నెగిసి పాక ఊడుద్దావని లోనకెల్లీసరికే ఈడు నేలమీద్దొర్లుతూ నోట్లోంచి నురగలు కక్కుతుండంట. ఇంకేవుంది.... నెత్తీ నోరూ కొట్టుకుంటూ ఆయమ్మ మన ఏసీబుగాడి ఆటోలో దుగాపెసాదు ఆస్పత్రికి తీస్కెల్లిందంట.... యెల్లీటప్పిటికే పేనాలు పోనాయని సెప్పిండంట డాట్రు...."

యెంత పన్జేసేడ్రా.... యింతోటి కొంపా నేకపోతే బతకనేవట్రా....

యిదిగాపోతే ఇంకోటి.. బలవంతంగా ఉసురు దీసుకోడవేటి?

యిప్పుడాడి పెల్లానికీ, పిల్లలకీ దిక్కెవల్రా?

ఒరే ఆనక ఇసారిద్దాంగానీ పొద్దెక్కిపోతంది.... జరగాల్సింది సూడండని పెద్దోల్లు తొందర సెయ్యడంతో నలుగురూ నాలుగు చేతులూ వేసి తంతు కాస్తా కానిచ్చేసారు.

సాయంత్రం స్మశానానికి వెళ్ళి కర్మ చేసి వచ్చి నలుగురూ కూర్చున్నారు. అందరి హృదయాలు ఆక్రోశంతోనూ, ఆవేశంతోనూ మండుతున్నాయి. గంగరాజు మనసులోని ఆవేదన వెళ్ళగక్కడం మొదలుపెట్టాడు.

"దేశానికి తిండెట్టే రైతులు తినడానికి తిండీ, ఉండడానికీ కొంపా లేని రోజులొచ్చి పడ్డాయి...."

"దీనమ్మ గద్దెనెక్కే పెతివోడూ యవుసాయాన్ని పండగ సేత్తావని సెప్పివోడేగానీ రైతులు బతుకులు మార్చాలనే ఇంగితం ఒక్కడిగ్గూడా నేకపోతంద్రా...."

"మీరెన్నైనా సెప్పండిగానీ, బూవిపోనాదని, కొంప పోనాదనీ పేనాలు దీస్సుకోడం తప్పురా.... యెంతమంది ఇల్లూ వాకిల్లూ వొగ్గేసి సెన్నైలు, కాశ్మీర్లూ పోడంనేదు? మన్ని నమ్ముకున్న పెల్లాం, పిల్లల గురించి కూడా ఆలోసించాలి గానీ....?"

వాళ్ళతో కాస్త అక్షర జ్ఞానం వున్న నారాయణ అన్నాడు" ఆల్ల బాబు కొంపమ్మీసినాడని ఈడు పేనం ఒగ్గేసినాడు. మరి ఓ పక్క దేశాన్నే తాకట్టెట్టెత్తున్నారు.... కాదు కాదు అమ్మేత్తన్నారు. అలగని దేశంలో ఉన్న జనవంతా సచ్చిపోతంద్రా?.... సచ్చిపోవాల్నా?"

"ఒరే నారాయుడూ మాకరదవయ్యానాగ సెప్పు.... దేశాన్నమ్మీడానికి అదేవైనా సింతపండా, పనసకాయా?" అన్నారు అందరూ.

సరే, మీరడిగారు కాబట్టి సెప్తున్నాను. మొన్న శుక్రోరం ఎల్జైసీ కడదావని అనకాపిల్లి ఆపీసికెల్లాను. నానెల్లీసరికి ఆపీసులో పన్జేసీ వోల్లందరూ బయట రోడ్డు పక్కన నించోని దేని గురించో పెద్ద పెద్ద కేకలేస్తన్నారు. 'బావూ డబ్బులు కట్టించుకోరా' అని ఒకల్ని అడిగినాను. మరీ నీవొచ్చి డబ్బులు కట్టలు తెచ్చిత్తావని ఈడ నించోని ఆశతో ఎదురు సూత్తన్నాం' అన్నాడు.

అదేటి బావూ అట్టా అంటారని అడిగినాను. "నేకపోతే ఏటి, గవుర్మెంటు ఎల్జైసీని బజార్లో సింతపండునమ్మినట్టు ఎవడికో అమ్మేత్తాదట, మా ఉజ్జోగాలుంటాయో, ఊడతాయో, మా కుటమానాలు ఏటవుతాయో తెలీక, ఎవురికి సెప్పుకోవాలో తెలీక రోడ్లు మీనకొచ్చి మా గోల ఇనిపించుకొండిరా అని మావరుత్తావుంటే డబ్బులు కడతాడట ఈనగోరు. నువ్వు కట్టిన డబ్బులు కూడా ఏటవుతాయో.... ఎల్లి కుసింత సేపు ఆగి ఆ.... యెల్లు" అన్నారు.

'అమ్మడియమ్మ! ఎల్జైసీనమ్మిత్తే మన్డబ్బులన్నీ పోతాయేమో' అన్నారందరూ.

"అందల పన్జేసీవోల్ల వుజ్జోగాలకే దిక్కునేకపోతే మన్డబ్బులు ఒక లెక్కా!" ఇంకోటి సెప్తాను. ఇనండి."

'ఒరే బావూ సంతోసూ.... ఇట్రామ్మా!'

'ఏందయ్యా, ఏదైనా పనుండాదా నాతో?'

'ఓ సంగత్చెప్పు, నీకాడ సెల్లుపోనుందా? ఉండే వుంటాదిలే, ఈ కాలపు కుర్రోల్లు సెల్లుపోన్లు నేకండా ఉండగల్రా? అందల సిమ్ము ఏటిది? అని నారాయణ అడిగాడు.

"ఇప్పుడందరూ జియో సిమ్మేగదా వాడతన్నారు, నాది గూడా అదే 49 రూ॥లతో సార్జింగు సేయించుకుంటే నెలంతా ఎంతమందికైనా పోను సేసుకోవచ్చు, అన్‌లిమిటెడ్" అన్నాడు ఆ కుర్రవాడు.

"జియో పైవేటోడిది కదా, అలాగే ఐడియా, ఏర్‌టెల్లు కూడా....

ఔను ఇయ్యన్నీ పైవేటు కంపినీలే, గవుర్మెంటు కంపినీ.... బియెస్సెన్నెల్ ఎప్పుడో తొంగుంది కదా...."

"అదిరా నాయన్లారా సంగతి, గవుర్మెంటు కంపినీని తొంగోబెట్టి, పైవేటు కంపినీలకి ఎడాపెడా పరిమిసన్లిచ్చీసేరు. ఒకప్పుడు ఎవులింట్లో

చూసినా గవుర్మెంటు పోన్లే వాడీవోరు. పెబుత్వానికి బోల్డాదాయం వచ్చీది, ఉజ్జోగులకి మంచి జీతాలొచ్చీవి. అట్టాంటిది పోన్లట్నీ పెవోటోల్ల కిచ్చీసి, గవుర్మెంటు కంపినీ నస్టాల్లోకొచ్చీసినాదని, అందల పన్జేసీ వోల్లని బలవంతంగా రిటైర్మెంటు జేయించీసి యింటికంపీసినారు.... అరదవైందా?" అన్నాడు నారాయణ.

'కిస్నార్పనం అన్నమాట!'

'అన్నమాట కాదు... ఉన్నమాటే!'

ఇంతలో చిరంజీవి, అతని భార్య అప్పుడే బస్ దిగి చేతుల్లో సంచుల్తో అటుగా వస్తున్నారు.

చిరంజీవిని చూసిన నారాయణ 'ఏంరా సిరంజీవీ, ఏడకైనా పొయ్యొస్తున్నారా?' అని అడిగాడు.

"ఔను మావా! మా పెద్దనాన్ని సూసొత్తన్నాం...."

ఐద్రాబాదులో గదా ఉంటంది పెద్మమ్మి?

మరేనయ్యా!

ఏ బండికొచ్చావ్రా?

ఈడింత బేగ ఒగ్గీలా లేదని భార్యని యింటికి వెళ్ళిపొమ్మని, వాళ్ళ మధ్యకు వచ్చి కూర్చున్నాడు.

"బండి గురించి కదా అడిగినావు మావా.... అదేదో కొత్తగా ఏసిన పైవేటు రైలట. టౌన్లో అనుకుంతన్నారు, ఈ సమచ్చరం 150 పైవేటు రైల్లు ఏసేరట...."

"అంతే గాదొరే.... సానా రైలుస్టేసన్లని కూడా మేన్టైన్ సెయ్యనీకి పైవోటువోల్లకే అప్పగించీనారంట, తెలుసా?" అడిగాడు నారాయణ.

'అంటే, రైల్వేని కూడా సంతలో అమ్మకానికెట్టీసినారన్నమాట! ఇకను రైల్లల్లో కూడా ప్రయానాలు సెయ్యలేం ఈ లెక్కన" అన్నారందరూ.

'సిటీ నుండొచ్చినావు గదరా సిరంజీవీ, ఇంకేట్రా సంగతులు?'

రైళ్ళని పైవోటోల్లకి అప్పజెప్తెత్తున్నందుకే మావోల్లు గోరం జరిగిపోయినట్టు మాట్టాడతన్రు. నాను అక్కడిన్న మాటల్ని బట్టి సూత్తే మందేశిం ఇమానాల్ని నడిపే కంపినీ.... అదేట్రా సంతోసూ?

అది ఏరిండియా!

"ఆ, అదే.... దాన్ని అమ్మీడానికి అప్పుడే పేపర్లలో పెకటన కూడా ఇచ్చీసినారట. అలగే మాంచి లాబాల్లో నడుత్తున్న ఆయిల్ కంపినీని సంగోరు, ఒరిస్సాలోని అదేదో స్టీలు కంపినీల్ని కూడా అమ్మెత్తారట...." తనకు తెలిసిన సంగతులు చెప్పాడు చిరంజీవి.

"నాకు తెలీకడుగుతానూ.... ఎవరిచ్చేర్రా ఈల్లకి అతికారం ఆల్లిస్టవచ్చినట్టు కంపినీల్ని అమ్మీసుకోడానికి, ఇయ్యన్నీ ఆల్ల బాబుగార్ల సొత్తా?" అన్నాడు నడివయసు దాటినా ఆవేశం సడలని రామయ్య.

'పెదనాన్నా, మీరందరూ ఎక్కడెక్కడియ్యో మాట్లాడతన్రు. మన స్టీల్ప్లాంటుని కూడా అమ్మెత్తారట, తెలుసా?'

'ఈల్లకి పోయేకాలం గాపోతే, ఎన్ని సమచ్చరాలు పోరాటం సేత్తే, ఎంతమంది పేనాలొగ్గితే, ఎంత రక్తపాతం జరిగితే, ఎన్ని వేలమంది రైతులు బూవుల్ని వదులుకోని ఉజ్జోగాలు, సజ్జోగాల్లేకండా పోతే మనకి స్టీలు కంపినీ వచ్చింది? అది మనుత్తరాంద్రకే కాదు రాష్టానికే గుండెకాయ నాంటిది. గుండెకాయ నేకపోతే పేనాలెక్కడుంటాయిరా? దాన్నమ్మిత్తే అందల పన్జేసీవోల్ల బతుకులేటవుతాయి? దానిమీదాదారపడి బతికేవోల్లు కుటుమానాలేటవుతాయి?' "అప్పుడు నాను ఐదో తరాతి సదూతున్నాను. మా శేషన్న ఏడో తరాతి సదువుతుండు. ఆ సమచ్చరం ఆల్లకి పెద్ద పరీచ్చల్లేకండనే పాసు జేసీసినారు. స్టీలు కంపినీ కోసవని సదూకుంటున్నోల్లు, ఉజ్జోగాల కోసం ఎదురు సూత్తాన్నోల్లు, రాజికీయ నాయకులు వొయిజాగులో, ఇంకా శానాసోట్ల గొడవలు సేత్తన్నారని, అందుకే బళ్ళు మూసీసినారనీ, అందుకే పరీచ్చలు కూడా నేకండా అందర్నీ పాసు జేసీనారని మా అన్నే సెప్పినట్టు గుర్తునాకు...." అన్నాడు పంచాయితీ తలయారీ అయిన ఎంకడు.

'సేతిల పేపరేట్రా సంతోసూ? అందలేవైనా రాసినారేవో సూడు.'

ఆ.... వున్నాది మావయ్యా. "ప్రభుత్వరంగ సంస్థల్ని కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూల పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడానికి కొత్త ఎత్తుగడలు వేస్తోంది. నాలుగు బేంకుల్ని, షిప్పింగ్ కంపినీ, నీలాచల్ స్టీల్ప్లాంటు, బెంగుళూరులో వున్న బియిఎమ్మెల్ కంపినీ, ఇంకా మరికొన్నిటిని విక్రయించనున్నట్లు.... అంటే అమ్మీడవన్నమాట.... బిజెపి సర్కార్ ప్రణాళికలు వేసింది."

మావయ్యా మా కాలేజీ సారు మొన్న సెప్పేరు – సగం కంపినీల్ని అదానీకి, సగం కంపినీల్ని అంబానీకి అమ్మెయ్యడానికి అన్ని యేర్పాట్లూ జరిగిపోయాయని, మందేశంలో ముందు ముందు సామాన్యులెవ్వరూ మూడు పూట్లా తిండి తిండం కష్టవని, నిరుద్యోగం ఇంతకు పదిరెట్లు పెరిగిపోద్దని...."

"సూద్రా గంగరాజూ, ఆల్ల బాబు కొంపనమ్మీసాదని సోంగాడు పరువు పోగొట్టుకొని మొహం సెల్లనోడినాగ పేనాల్దీసుకుండు. మరిప్పుడు దేశింల ఇన్ని కంపినీల్ని.... అది గూడా నాబాల్లోనున్న కంపినీల్ని ఎడాపెడా అమ్మిపారీడానికి మాయదారోల్లు సిద్ధపడిపోనారు గందా. అందుకని ఆ కంపెనీలల్ల పన్జేసెటోల్లంతా బలవంతాన పేనాల్దీస్కోవాలా? సచ్చిపోడవే అన్ని సమస్సలకీ పరిస్కారవా?" అన్నాడు వెంకన్న.

"ఇట్టా ఒక్కో కంపినీని అమ్మి, అందల పన్జేసెటోల్ల కడుపులు కొట్టే బదులు మొత్తం దేశాన్నే ఏ అమెరికోడికో నేకపోతే ఇంగ్లీసోడికో అమ్మితే తరాలకు సరిపడా సంపాయించుకోవచ్చు. ఇటు ఆల్ల దగ్గర బోల్డు తెలివితేటలున్నాయి. కాబట్టి రకరకాల పేక్టరీలెట్టి సిన్నా, సితకా ఉజ్జోగాలైనా ఇత్తారు" అన్నాడు కడుపు మండిన మరొక రైతు.

అసలింతకీ దేశింల జరుగుతున్న ఉజ్జెమాల్ని జూసి మన్లాంటి పెద్దోల్లం నడుత్తున్న కుర్రాల్లకీ, పిడికిల్లెత్తుతున్న రైతాంగానికీ సపోర్టివ్వాల. అంతేగానీ అయిందానికీ, కాని దానికీ ఉసురు తీస్కోకూడదు. ఎవడబ్బ సొమ్మని దేశాన్ని అమ్మకానికి పెడతన్నర్రా అని నిల్దియ్యాల. ఈ దేశంగానీ, ఈ దేశింల పెజలు గానీ అమ్మకానికి సిద్ధంగా లేరనీ, సేతనైతే పెజలకి మంచి సెయ్యండి, సేతగాపోతే కిందకి దిగిపొండని సట్టాలు తిరగ రాయించాల.

అవున్రా అయ్యా! మా బాగా సెప్పేవు. ఊరూరా రైతులు, కుర్రోల్లు, కమ్మరి, కుమ్మరి, నేత పనోల్లందరూ ఊరూ, వాడా ఏకవై కదలాల్రా!! పెజలు కదలబారితే ఏ నా కొడుకూ ఒక్క కంపినీని కాదు గదా ఒక అంగులం బూవి కూడా అమ్మలేడు.... ఆ!!

# వలసాంధ్రలో స్త్రీ చైతన్య దీప్తి దరిశి అన్నపూర్ణమ్మ కథలు

సమీక్ష

డా॥ షేఖ్ మహబూబ్ బాషా

**వలసాంధ్రలో** ఇరవైయ్యవ శతాబ్ది ప్రథమార్ధంలో సంఘ సంస్కరణోద్యమం ముమ్మరంగా నడిచింది. పురుష సంఘసంస్కర్తలతో పాటు అనేకమంది మహిళా సంఘసంస్కర్తలు సంస్కరణోద్యమంలో పాలుపంచుకొని ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఒకవైపు ఉద్యమంలో క్రియాశీలకంగా పాలుపంచుకుంటూనే యింకోవైపు సంస్కరణోద్యమ సాహిత్యాన్ని సృష్టించారు. అలాంటి మహిళా సంఘసంస్కర్తల్లో ప్రముఖురాలు దరిశి అన్నపూర్ణమ్మ (1907–1931). సంఘసంస్కరణోద్యమంలోనూ, మహిళోద్యమంలోనూ అన్నపూర్ణమ్మ పోషించిన పాత్రనూ, ఆమె కథల్నీ పాఠకులకు పరిచయం చెయ్యడమే ఈ వ్యాసం ఉద్దేశం.



'గదర్ పార్టీ' సంస్థాపకుల్లో ప్రముఖుడైన దరిశి చెంచయ్య మొదటి భార్య అయిన అన్నపూర్ణమ్మ 1907వ సంవత్సరంలో బళ్ళారిలో వైశ్యకులంలో జన్మించింది. ఆమె తల్లి సంస్కరణ దృక్పథం కలది. తన రెండవ కుమార్తెను రజస్వల అయ్యేంతవరకు ఆపి మదనపల్లె కళాశాలలో చదివించింది. అన్నపూర్ణమ్మను సంస్కరణ భావాలు కల చెంచయకిచ్చి వివాహం చేసింది. "వైశ్యకులములో రజస్వలానంతర వివాహమును ప్రారంభించింది అన్నపూర్ణమ్మగారి తల్లియేననుట సత్యదూరమనిపించు కొనజాలదు" అని 1-1-1932 నాటి "గృహలక్ష్మి" (స్త్రీల పత్రిక) ప్రశంసించింది. అన్నపూర్ణమ్మ బళ్ళారి కాన్వెంటులోనూ, తిరువళిక్కేణి బాలికల ట్రెనింగ్ కాలేజీలోనూ, గుంటూరులోని శారదానికేతనంలోనూ విద్యాభ్యాసం చేసింది. 15 సంవత్సరాల వయస్సులో దరిశి చెంచయ్యను వివాహమాడింది బాల్యవివాహాలు విస్తృతంగా ప్రాచుర్యంలో ఉండిన నాటి పరిస్థితుల దృష్ట్యా అన్నపూర్ణమ్మ పెళ్ళి ఆలస్యంగానే జరిగిందని చెప్పుకోవాలి.

అన్నపూర్ణమ్మ మొదటినుండీ సంస్కరణ భావాలు కలదైనప్పటికీ పెళ్ళి తర్వాత వాటికి మరింత సానబెట్టి తనవంతు ప్రోత్సాహమందించాడు చెంచయ్య. అన్నపూర్ణమ్మ పాల్గొన్న ఉద్యమాలన్నింటిలోనూ ప్రముఖంగా పేర్కొనదగ్గది వితంతు పునర్వివాహోద్యమం. 1920ల్లో ఆంధ్రలో ముమ్మరంగా నడిచిన వితంతు పునర్వివాహోద్యమం చెంచయ్య ఆధ్వర్యంలోనే జరిగింది. భర్తతో కలిసి అన్నపూర్ణమ్మ వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, విశ్వబ్రాహ్మణ మొదలైన కులాల్లో మొత్తం 18 వితంతు పునర్వివాహాల్ని జరిపించింది. 19వ శతాబ్దంలో ఏవిధంగా కందుకూరి వీరేశలింగం – రాజ్యలక్ష్మమ్మ దంపతులు వితంతు పునర్వివాహోద్యమానికి వెన్నెముకగా నిలిచారో 1920ల్లో దరిశి చెంచయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు వెన్నెముకగా నిలిచారు. "మా ఇంట్లో (వితంతువులైన) వధువులెందరో వుంటూండేవారు. నా భార్య అన్నపూర్ణమ్మ వారినెంతో ప్రేమగా చూచుకొనేది. ఇలాంటి సంఘసేవ చేయాలనే ఆశతోనే ఆమె నన్ను వివాహం చేసుకొన్నది. సంఘసంస్కరణోద్యమాలంటే ఆమెకెంతో సంతోషం. వధువులతో ఆమె చాలా చనువుగా వుండేది. వారు వరుసలతో పిలుచుకొనేవారు.... భార్యల సహాయం లేనిదే స్త్రీల ఉద్యమాలను పురుషులమెంత శ్రమపడినా జయప్రదం చెయ్యలేము. నా ప్రథమ భార్య అన్నపూర్ణమ్మకు స్త్రీ ఉద్యమాలయందు ఎంతో ఉత్సాహముండేది. ఎందరో స్త్రీలు మా యింట్లో ఉండేవారు. వారందరిని ప్రేమతో అన్నపూర్ణ ఆదరించేది. వారు అన్నపూర్ణమ్మను ఎంతో ప్రేమించేవారు. జయాపజయాలు, ఫలితాలు మా యిద్దరివీని." ("నేనూ – నా దేశం", పు. 231–233) ఒక రకంగా అన్నపూర్ణమ్మ వితంతు పునర్వివాహోద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిందని చెప్పవచ్చు. 1931 నవంబరులో బందరులో ఒక వితంతు పునర్వివాహాన్ని నిర్వహించి వచ్చిన తర్వాత తీవ్రంగా అనారోగ్యానికి గురై నవంబరు 28వ తేదీన పాతిక సంవత్సరాల పిన్న వయస్సులోనే అన్నపూర్ణమ్మ చనిపోయింది.

అన్నపూర్ణమ్మ అభిప్రాయంలో వితంతువులకు పునర్వివాహం మాత్రమే పరిష్కారం కాదు; విద్య కూడా చాలా అవసరం. అందుకే 12 మంది వితంతువులను విద్యార్జన దిశగా ప్రోత్సహించింది. వారి కోసం ఉపకారవేతనాల్ని యేర్పాటు చేసింది. ఈ విధంగా వితంతువుల విద్యాభివృద్ధికి తోడ్పడింది. ఆమె ప్రోత్సాహాన్నందుకున్న అనేకమంది వితంతువులు విద్యావంతులై జీవితాల్లో స్థిరపడ్డారు. 1927–1928 ప్రాంతంలో ఒకరోజు తన స్నేహితురాలు తుర్లపాటి రాజేశ్వరమ్మతో కలసి విజయవాడలో రైవస్ కాలువగట్టున నడుస్తుండగా ఎవరో వితంతువు శిశువును కని గొంతు నులిమి పారవేయగా కాకులు పొడుచుకు తింటూండడం చూచిన యిద్దరూ ఏడుస్తూ యింటికొచ్చారు. ఈ విషయమై ఏదైనా చేయాలని దరిశి చెంచయ్యతో కలిసి ఆలోచించి "వితంతు శరణాలయా"న్ని స్థాపించారు. ఇందులో అన్నపూర్ణమ్మ కార్యనిర్వాహక సంఘ సభ్యురాలుగా పనిచేసింది. "ఆంధ్రపత్రిక" ఈ శరణాలయాన్ని గూర్చి విస్తృతంగా ప్రచారం చేయగా అనేకమంది గర్భిణులైన వితంతువులు అక్కడికి రావడం మొదలుపెట్టారు; వారు బిడ్డల్ని కని అక్కడ వదిలి వెళ్ళేవారు. అలా సుమారు 60 మందికి ఆ

శరణాలయం ఉపయోగపడింది. విజయవాడలోని మహిళా డాక్టర్లు, ముఖ్యంగా గుడిపాటి వెంకటాచలం వదిన అయిన డాక్టర్ రంగనాయకమ్మ ఈ శరణాలయానికి ఎంతగానో సహాయపడింది. బిడ్డలు లేని దంపతులు యిక్కడి పిల్లల్ని తీసుకొని పోయేవారు. ("నేనూ – నా దేశం", పు. 234–235).

అన్నపూర్ణమ్మ ఆంధ్ర సార్వజనిక క్షేత్రంలో పనిచేయడం ప్రారంభించేనాటికి వలసాంధ్రలో మహిళోద్యమం బలంగా వేళ్ళూనుకొని ఉంది. ఆంధ్రలోని పలు పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ మహిళా సంఘాలు యేర్పడి మహిళాభివృద్ధికి పాటుపడనారంభించాయి. యావదాంధ్ర స్త్రీల విశాల వేదికగా "ఆంధ్ర మహిళా మహాసభ" 1910లో ఉనికిలోకి వచ్చి ప్రతి సంవత్సరం ఆంధ్రలోని వివిధ ప్రాంతాల్లో మహిళా సమావేశాలను యేర్పాటు చేసేది. 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్' ఆంధ్ర రాష్ట్ర శాఖగా "ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ" 1927లో యేర్పాటు చేయబడి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మహిళా సమావేశాలను నిర్వహించేది. ఈ నేపథ్యంలో 1928లో కొమఱ్ఱాజు అచ్చమాంబ విజయవాడలో "భారత మహిళా మండలి"ని స్థాపించింది. దీనికి తుర్లపాటి రాజేశ్వరమ్మ అధ్యక్షురాలు కాగా దరిశి అన్నపూర్ణమ్మ కార్యదర్శిగా వ్యవహరించింది. అంతేకాకుండా 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్' బెజవాడ శాఖకు కూడా అనేక సంవత్సరాలు అన్నపూర్ణమ్మ కార్యదర్శిగా పనిచేసింది. 1929లో బొంబాయిలో జరిగిన నాలుగవ "అఖిల భారత మహిళాసభ"కు ప్రతినిధులుగా వెళ్ళిన ముగ్గురు ఆంధ్ర స్త్రీలలో అన్నపూర్ణమ్మ కూడా ఒకరు. ఈ విధంగా అన్నపూర్ణమ్మ సమకాలీన మహిళోద్యమంలో చురుకుగా పాల్గొని మహిళాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడింది.

అన్నపూర్ణమ్మ క్షేత్రస్థాయిలో పనిచేసిన కార్యకర్తే కాకుండా సంస్కరణోద్యమ సాహిత్యాన్ని సృష్టించిన మేధావీ, సృజనశీలీ కూడా. ఆమె కొన్ని కథల్నీ, వ్యాసాల్నీ ప్రచురించింది. ఆమె రచనలు సంస్కరణ పక్షం వహించిన వైశ్యుల పత్రిక అయిన "వాసవి"లో ఎక్కువగా ప్రచురితమయ్యాయి. స్త్రీల పత్రిక అయిన "గృహలక్ష్మి"లో కూడా కొన్ని రచనలు ప్రచురించబడ్డాయి. ఆమె "హైందవ స్త్రీల హక్కులు – కర్తవ్యములు" ('వాసవి' జనవరి 1929, పు. 390–394), "నాల్గవ అఖిల భారత మహాసభ", "జాతీయత" (రెండు భాగాలు), "గాంధ్యవతారము", "విడాకుల చట్టము" మొదలైన వ్యాసాల్ని రాసింది.

## అన్నపూర్ణమ్మ కథలు

ఇప్పటిదాకా లభిస్తున్న ఆధారాలను బట్టి అన్నపూర్ణమ్మ ఆరు కథలను రాసింది. "అచ్చొచ్చింది" అనే కథ ఇల్లు అచ్చిరావడమనే మూఢనమ్మకం ఎంతటి ప్రమాదానికి దారితీయగలదో తెలుపుతుంది. మొదట పేదవాడై క్రమక్రమంగా ద్రవ్యవంతుడైన సుబ్బిశెట్టి పిసినారి. హైదరాబాద్ నగరంలో "పగలు వెలుతురు లేక రాత్రిళ్లు గాలి"రాని "ఎలుక బొక్క"లాంటి యిళ్ళు కట్టుకుంటాడు. ఆ ఇళ్ళు అచ్చి వచ్చిందని బలంగా నమ్ముతాడు. అనారోగ్యకరమైన ఇంట్లో ఉండడం వల్ల అతనికి కలిగిన సంతానం, భార్య (పుల్లమ్మ) చనిపోతారు. యాభై సంవత్సరాల వయస్సులో "రవ్వల నగల వర్షం కురిపించి చక్కని చుక్కను సుందరమ్మను" మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. ఆమె ఇంటి అసౌకర్యాన్ని గూర్చి గాలి ఆడక "వంకాయలాగు ఉడికిపోతున్నా"నని తన అసహనాన్ని వ్యక్తపరచినా "నీవు వంకాయలాగు ఉడికినాసరే బెండకాయలాగు వేగినాసరే ఈ ఇల్లు అచ్చొచ్చింది" అంటాడు. సుందరమ్మకు గర్భంతో పాటు క్షయ కూడా వస్తుంది. "శుభ్రమైన గాలి యుండు ప్రదేశమున నివసించినగాని రోగం కుదరదని" డాక్టర్ హెచ్చరిస్తాడు. అయినా తన మూఢత్వం వలన సుబ్బిశెట్టి వినడు. సుందరమ్మ చనిపోతుంది. అరవై సంవత్సరాల వయసులో సుబ్బిశెట్టి ఇంకో పెళ్ళి చేసుకుంటాడు. ఇంటి కారణంగా రంగమ్మకు కలిగిన నలుగురు పిల్లలూ చనిపోతారు. "ఏ డాక్టరును విచారించినను యింటిలో గాలి సరిగలేనందున బిడ్డలు కృశించి చనిపోవుట తటస్థించు చున్నదని ఊరిబయట బంగళాలో యుండిననేగాని జీవించరని చెప్పుచుండిరి." కానీ శెట్టి మాత్రం 'అచ్చొచ్చిన' ఇంటిని విడవడానికి ఏమాత్రం సమ్మతించడు. మళ్ళీ మొగబిడ్డ కలిగి రెండు సంవత్సరాలుండి చనిపోతాడు. ఈ విధంగా ఒకరి తర్వాత ఒకర్ని పెళ్ళి చేసుకున్నా తగినంత గాలీ, వెలుతురూ లేని ఇంట్లో నివసించడం కారణంగా సుబ్బిశెట్టి భార్యలూ, పిల్లలూ చనిపోతుంటారు. అయినా ఇళ్ళు అచ్చివచ్చిందనే మూఢనమ్మకం కారణంగా సుబ్బిశెట్టి ఇళ్ళు మారడానికి సిద్ధంగా ఉండడు. ఒకరోజు తను ఎంత సంపాదించాడో లెక్కలు చూసుకుంటూ సుబ్బిశెట్టి కూడా చనిపోతాడు.

స్థూలంగా చూస్తే పై కథ మూఢనమ్మకాలను వ్యతిరేకించటంతోపాటు గృహ నిర్మాణ పద్ధతులపై ఎక్కుపెట్టిన విమర్శగా కన్పిస్తుంది. అదే కాలంలో కొంతమంది భారతీయుల గృహనిర్మాణ పద్ధతిపై కూడా విమర్శలు చేశారు. "హిందూ" గృహాల నిర్మాణంపై విమర్శ సంఘ సంస్కరణోద్యమ సాహిత్యంలో ఒక అనివార్య భాగంగా వుండేది. బ్రిటీష్ వలసవాదులు భారతీయులపై చేసిన సాంస్కృతిక దాడిలో భాగంలో వారి ఇంటి సంస్కృతినీ మరీ ముఖ్యంగా సరిగా గాలీ, వెలుతురూ ప్రసరించని భారతీయుల ఇళ్ళను విమర్శించేవారు. ఈ విమర్శను చాలామంది భారతీయ సంఘ సంస్కర్తలు తమ రచనల్లో కొనసాగించారు. ఉదాహరణకు "హిందూ గృహములు" అనే వ్యాసంలో ("తెలుగు జనానా", ఏప్రిల్ 1902, పు. 305–307) టేకుమళ్ళ రాజగోపాలరావు భారతీయుల ఇంటి నిర్మాణ విధానాలపై, ఇంటి వస్తువుల్ని భారతీయులు అమర్చే పద్ధతిపై తీవ్రంగా దాడి చేశాడు. ఆంగ్లేయుల ఇళ్ళలో భారతీయుల ఇళ్ళను పోల్చి భారతీయుల ఇళ్ళు అపరిశుభ్రమైనవిగానూ, భారతీయుల అలవాట్లు అనారోగ్యకరమైనవిగానూ తేల్చి చెప్పాడు. ఇలాంటి సాహిత్యం వస్తున్న రోజుల్లోనే అన్నపూర్ణమ్మ రాసిన పై కథ మూఢత్వం గురించీ, భారతీయ గృహ నిర్మాణ పద్ధతి గురించీ, స్త్రీల ఆరోగ్యం దృష్ట్యా వివరించే ప్రయత్నం చేసింది.

"పుట్టింటి బిడ్డ అత్తింటి కోడలు" కథలో విడాకుల చట్టాన్ని సమర్థించింది అన్నపూర్ణమ్మ. గారాబంగా పెరిగిన నవనీతానికి వేశ్యాలోలుడైన ముద్దుకృష్ణతో పదమూడేండ్ల వయస్సులో వివాహమౌతుంది. కాపురానికి వెళ్ళిన దగ్గర్నుండీ నవనీతం గృహ హింస బారిన పడుతుంది. వేశ్యలను ఇంట్లోనే పెట్టుకున్న భర్త వాళ్ళకు కూడా సపర్యలు చేయమంటాడు. "అందరికీ చాకిరి చేయగల శక్తి" తనకు

లేదని చెబుతుంది నవనీతం. అన్నం వండే పెద్ద పాత్ర కాలిమీద పడి ఆమెకు గాయమవుతుంది. అయినా కరగని భర్త ఆమెను "పశువును బాదినట్లు" బాదడంతో మూర్ఛపోతుంది. ఇరుగుపొరుగు వారికి నవనీతంపై భర్త చేసే దాష్టీకం తెలిసినా భార్యాభర్తల పోట్లాటలో జోక్యం కలుగజేసు కోవటానికి వెనకాడతారు. పైగా "పతివ్రతలకు భర్త ఎంత బాధించినను ఓర్చుకోవడమే విధి" అంటారు. "భర్త తన్ను ముక్కలు ముక్కలు చేసినను విచారించే దిక్కు లేకపోగా ముత్తైదువు చావు చచ్చిందని సంతోషించే వాండ్లు చాలామంది యున్నట్లు" తెలుసుకుంటుంది నవనీతం. ఇంతలో నవనీతం తమ్ముడు రంగనాథం పండుగకు పిలుచుకు పోవడానికి అక్క ఇంటికి వచ్చి ఆమె పరిస్థితిని గ్రహిస్తాడు. నవనీతాన్ని పుట్టింటికి పంపటానికి ముద్దుకృష్ణ అత్తామామలొచ్చి బ్రతిమాలినా నిరాకరిస్తాడు. దీంతో నవనీతం తమ్ముడైన రంగనాథానికి "మనోబాధ" హెచ్చించి "కటికవాని బారినుండి గోవులను రక్షించుటకు ధర్మశాలలు గలవు. అంతకంటెను అనేక రెట్లధికముగ బాధపడుచున్న హిందూ సంఘమందలి స్త్రీని సంరక్షించుటకు మార్గములు లేవు గదా" అని చింతిస్తాడు. "మాయోపాయములచే" తన అక్కను భర్త బారి నుండి తప్పిస్తాడు.

యాభై వేల రూపాయలూ, నగలూ దొంగిలించి పుట్టింటికి పారిపోయిందని భార్యపై ఫిర్యాదు చేసి డబ్బూ నగలు సహా భార్యను అప్పగించాలంటూ కోర్టులో వ్యాజ్యం వేస్తాడు నవనీతం భర్త. నవనీతం కోర్టుకు వెళ్ళి తన గోడంతా హృదయ విదారకంగా వెలిబుచ్చగా "ప్రేక్షకుల హృదయములు కరిగి నీరైనవి". నవనీతం చెప్పింది విన్న జడ్జి యిలా అంటాడు : "హిందూ లా ప్రకారం నవనీతం భర్త గృహమునకేగవలసినదే. ఈ విధముగ తీర్మానము చేయవలసెనుగదాయని విచారము గలుగుచున్నది. నవనీతం వలె అనేక స్త్రీలు బాధపడుచున్నారని తెలియును. ఈ కష్టములు మాన్పుటకు ఒకటే మార్గం – విడాకుల చట్టం. నేడు ఈ విషాదకరమైన చరిత్రను విన్నవారందరు స్త్రీ హక్కు కొఱకు పోరాడుటకు ప్రయత్నము చేయవలెను. మీ సంఘము నందు నన్ను గూడ చేర్చుకోవలె."

రంగనాథం తదితరుల కృషి కారణంగా విడాకుల చట్టం పాసవుతుంది. చివరికి నవనీతం భర్త పశ్చాత్తాపపడి భార్యను స్వీకరిస్తాడు. రంగనాథం అక్కకు తన ఆస్తిలో సగభాగం యిస్తాడు. ఈ కథలో అన్నపూర్ణమ్మ గృహ హింసతో అనేక కష్టాలు పడుతున్న స్త్రీలకు విడాకులను ఒక పరిష్కారమార్గంగా చూపెట్టింది. విడాకుల చట్టాన్ని పాస్ చేయించడం ద్వారా దూరదృష్టితో కూడిన అభ్యుదయ దృక్పథాన్ని ప్రదర్శించింది. అంతేకాకుండా రంగనాథం ద్వారా తన అక్కకు సగం ఆస్తి యిప్పించి స్త్రీల ఆస్తి హక్కును కూడా బలంగా ప్రతిపాదించింది. సమకాలీనంగా కడప రామసుబ్బమ్మ మొదలైన మహిళా మేధావులు విడాకుల చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న చారిత్రక సందర్భంలో అన్నపూర్ణమ్మ విడాకుల చట్టాన్ని స్వాగతించడం విశిష్టమైనది.

"సీతమ్మగారు" కథ స్త్రీలకు రావాల్సిన ఆస్తిహక్కును బలంగా ప్రతిపాదిస్తుంది. సీతమ్మ – రామారావులకు పుట్టిన సంతానమంతా ఆడపిల్లలే! కనుక సీతమ్మ మగపిల్లవాడు కావాలనుకుంటుంది. రామారావు తన అన్నలతో కలసి వ్యాపారం చేస్తుంటాడు. అన్నదమ్ములు ఆస్తి పంచుకొన్నయెడల రామారావుకు ఏడున్నర లక్షల భాగం వస్తుంది. విడిపోతే వ్యాపారంలో నష్టం వస్తుందనీ, అన్నలకు కష్టం కలుగుతుందనీ అన్నలతో కలిసే ఉంటాడు రామారావు. ఒకరోజు అకస్మాత్తుగా అస్వస్థుడై రామారావు చనిపోతాడు. స్త్రీలకు ఆస్తిహక్కు లేని కారణంగా సీతమ్మకు రామారావు అన్నల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది. "ఏడున్నర లక్షలకు అధికారియగు భర్తకు యిల్లాలై యుండి, ఆర్గురు ఆడ బిడ్డలకు తల్లియగు సీతమ్మగారు విగత భర్తయగుసరికి, స్త్రీలకు ఆస్తికి అధికారము లేనందున స్వతంత్ర జీవనము చేయుటకు వీలులేక యింటిలోని వారందరికి అడుగులకు మడుగులొత్తవలసియుండెను."

రామారావు చనిపోయేటప్పుడు అతని కుటుంబానికి తాము చేస్తామన్న సహాయాన్ని సులభంగా మరచిపోయిన అతని అన్నలు సీతమ్మకు కేవలం పదివేల రూపాయలు యిస్తామంటారు. దీంతో హతాశురాలయిన ఆమె "ఆహా! స్త్రీలెంత దౌర్భాగ్యులు. స్త్రీలకు స్వాతంత్ర్యము లేదా? స్వానుభవము వలన ద్రవ్యమునకధికారము లేకపోవుటయే అస్వాతంత్ర్యమని వెల్లడియగుచున్నద"ని అనుకొంటుంది. దీనికి సమాధానంగా ఆమె స్నేహితురాలైన చూడామణి "పుణ్యభూమియని పేరుగాంచి, స్త్రీ స్వరూపిణియగు ఆదిశక్తిని పూజించి, భారతదేశమును మాతృభూమియని భక్తితో సేవించు ఈ దేశమున స్త్రీలు ఆస్తి హక్కులు లేక బాధలు పడుచుండుట హాస్యాస్పదము. మహమ్మదీయ, క్రైస్తవ మతములలో స్త్రీలకు కొంతవరకు ఆస్తిహక్కు గలదు. మగలను దూషించుట వలన ఫలితము గలుగదు. స్త్రీలు తమ హక్కుల కొరకు పోరాడవలయు"నంటుంది.

రామారావు చనిపోయేనాటికి సీతమ్మ గర్భవతి. కొంతకాలానికి ఆమెకు కొడుకు పార్ధసారథి పుడతాడు. తండ్రి ఆస్తికి కుమారుడు వారసుడౌతాడు కాబట్టి ఆస్తి పంచి యివ్వమని భర్త అన్నలను అడుగుతుంది సీతమ్మ. పార్ధసారథి ఆమె కొడుకు కాదనే మిషతో ఆస్తి పంచివ్వమంటారు వాళ్ళు. ఆమె కోర్టుకెళ్ళి ఓడిపోతుంది. అయినా నిరాశ చెందక హైకోర్టులో అప్పీల్ చేస్తుంది. కేసు మూడు–నాలుగు సంవత్సరాలు నడుస్తుంది. ఈలోగా తన భర్త అన్నల కుమారులు చనిపోతారు. మరికొంత కాలానికి అన్నలు కూడా చనిపోతారు. కోర్టు తీర్పు సీతమ్మకు అనుకూలంగా వస్తుంది. అయినా ఆమె తన భర్త అన్నల భార్యలకు వారి ఆస్తి యిచ్చేయమని తన కుమారునికి చెబుతూ యిలా అంటుంది : "అబ్బాయి! భార్యాభర్తలు జీవితాంతము వరకు సుఖదుఃఖములలో సమానముగ పాల్గొనుచుందురు. హిందూ మతము నందు మోక్ష సాధనకు భార్యాభర్తలిరువురు ప్రయత్నించవలెనని చెప్పుదురు. పార్వతీపరమేశ్వరులు, లక్ష్మీనారాయణులు, సీతారాములు అని స్త్రీ వాచకమునకే ప్రధాన స్థానమొసంగెదరు. ఏ కారణమువలననో ప్రస్తుత సాంప్రదాయములందు స్త్రీలకు ఏలాటి న్యాయము ఆగపడుట లేదు. భర్తతో సుఖముగ కాలము గడపి బిడ్డ పాపలను గని తుదకు భర్త మరణించిన భర్త కష్టార్జితమును భార్య అనుభవించుటకు అధికారము లేదు. ఈ విషయము నాకు విపరీతముగ తోచుచున్నది. స్త్రీలకు పురుషులకు బేధము చూపక వారి భర్తల ఆస్తి వారికొసంగుము." దీంతో "పార్ధసారథి తల్లి యిష్టప్రకారమే పెద తండ్రుల ఆస్తిని వారి భార్యలకిచ్చెను."

"సుశీల" కథలో భారతదేశ సమాజంలో అనాథలైన స్త్రీలకు కలిగే అనేక రకాలైన కష్టాలను కళ్ళకు కట్టినట్లు అన్నపూర్ణమ్మ చూపించింది. వితంతువైన మనోహరమ్మ తనకు భాగవతం చెప్పడానికి వచ్చే రామశాస్త్రితో వెళ్ళిపోవడం కారణంగా సుశీల పుడుతుంది. ఈ "కళంకం" సుశీల జీవితాంతం వెంటాడుతుంది. సుశీల చిన్నప్పటి నుండీ చదువులో బాగా చురుకైనది. ఎనిమిదోయేట ఆమెకు పెళ్ళవుతుంది. భర్త దొంగతనాలు చేసే అలవాటున్నవాడు కావడంతో జైలుపాలవుతాడు. తర్వాత చనిపోతాడు. సుశీల వితంతువైనా చదువు మాత్రం కొనసాగిస్తుంది. కొంతకాలానికి తల్లిదండ్రులు కూడా చనిపోయి సుశీల అనాథగా మిగిలిపోతుంది. కానీ ఆమెకు చదువుకొని "గౌరవముగ జీవించవలెనని కోరిక" ఉంటుంది. కానీ దారీ తెన్నూ తెలియదు. "ఒంటరిగ స్కూలుకు వెళ్ళి వచ్చుట దుర్భరమైనది. దుర్మార్గ సంఘము. రాళ్ళు విసరేవారు, వెక్కిరించేవారు, నవ్వేవారు, చేతులు చరచువారు, ఉత్తరములు వ్రాసి పడవేయవారు, కుండలు గోకే ఆడదానికి చదువెందుకురా" అని ఎగతాళి చేసే పోకిరీల చేష్టలు మితిమీరిపోయాయి. అంతేకాకుండా ఇరుగుపొరుగు ఆడవాళ్ళ సూటిపోటి మాటలు కూడా ఆమెను తీవ్రంగా బాధించసాగాయి. ఒక్క పొరుగింటి ముసలమ్మ మాత్రం ఆమె పట్ల సానుభూతితో ఉండేది.

ఇలాంటి సందర్భంలో బ్రహ్మ సమాజ మందిరంలో రాజారాం మోహన్‌రాయ్ వర్ధంతి సభ జరుగుతుంది. ఉపన్యాసకుడిగా వయోవృద్ధుడైన ప్రకాశంగారు అక్కడికి వస్తారు. ఆయనకు ముసలమ్మ సుశీల పరిస్థితిని వివరించగా ఆయన ఆమెను చదివించడానికి సుముఖత వ్యక్తం చేస్తాడు. అతని సహాయంలో సుశీల కలకత్తాలోని ఒక విద్యాసంస్థలో చేరుతుంది. కాని పోకిరీలు సుశీల దుర్నడత కలదని అక్కడి హాస్టల్ సూపరిండెంటుకు ఉత్తరం రాయగా సుశీల ఎంతగా బ్రతిమాలినా ఆమెను హాస్టల్ నుండి తీసేస్తారు. గత్యంతరం లేక సుశీల ప్రకాశంగారి దగ్గరికి తిరిగి వచ్చేస్తుంది. ప్రకాశంగారికీ, సుశీలకూ అక్రమ సంబంధాన్ని అంటగడుతుంది సమాజం. ఈ అపవాదునుండి తప్పించుకోవడానికి సుశీల ప్రకాశంగారిని తన్ను పెళ్ళి చేసుకోమని అడిగి పెళ్ళి చేసుకొంటుంది. అయినా వాళ్ళు భార్యా-భర్తల్లా కాకుండా తాతా-మనవరాళ్ళలా జీవితాన్ని గడుపుతుంటారు. సుశీల మహిళాభివృద్ధి కోసం పాటుపడుతుంటుంది.

ఈ కథలో బాల వితంతువుల దుస్థితిని, సమాజం వితంతు పునర్వివాహాలను గౌరవించకపోవటం వలన వారి పిల్లల దుస్థితిని వివరిస్తుంది అన్నపూర్ణమ్మ. ఒక స్త్రీ - ఒక పురుషుడు కలిసి ఉంటే సంఘం మోపే నీలాపనిందల్ని అసహ్యించుకొంది. అందుకే వృద్ధ వివాహాలకు తాను వ్యతిరేకి అయినప్పటికీ సుశీల - ప్రకాశం వివాహం జరిపిస్తుంది. అయినా వారివి భార్యా-భర్తల సంబంధానికి దూరంగా ఉంచుతుంది. ఒంటరులైన అనాథ స్త్రీలు ఎదుర్కొనే అనేక సమస్యల్ని చర్చకు పెట్టి సమాజంలో రావాల్సిన నాగరికమైన మార్పుల్ని సూచించింది.

"జ్ఞానాంబ" దొంగస్వాములూ, మూఢభక్తులకు సంబంధించిన కథ. "పనిపాటలు లేక సోమరులై తిరుగు" బైరాగులు, గోసాయిలు, బ్రాహ్మణ గురువులు మూఢభక్తులను ఏవిధంగా పీల్చి పిప్పిచేసేవారో కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. అంతేకాకుండా భక్తుల్లో మూఢత్వ జాడ్యం ఎంతో లోతుగా పాతుకుపోయి ఉండిందో నిరూపిస్తుంది. కేశవయ్య పరమ మూఢుడైన భక్తుడు. కాషాయాంబరధారులు ఎవరు కన్పించినా తన ఇంటికి పిలిచి సపర్యలు చేసి జ్ఞానోపదేశం చేయమంటూంటాడు. అతని బలహీనత తెలిసిన దొంగస్వాములనేకమంది అతని ఇంట్లో నెలల తరబడి తిష్టవేస్తుంటారు. "గోశాయిలు, బావాజీలు నెలల పర్యంతం స్నానము చేయక పెద్ద పెద్ద గడ్డములను బెంచి ఒడలంతయు బూడిద బూసుకొని వికృత స్వరూపములు గలిగి రాత్రింబవళ్ళు గంజాయి పీల్చుచు, నల్లమందు సేవించుచు బూతు పాటలు పాడుచు (అతని ఇంట్లో) కాలం గడిపేవారు." నలుగురు తమ్ముళ్ళూ, వారి భార్యలూ ఉన్న పెద్ద సంసారంతో ఉన్న కేశవయ్య వారందర్నీ స్వాముల సేవలో నియోగిస్తుంటాడు. అతని కోడలు జ్ఞానాంబకు మాత్రం ఈ దొంగ స్వాముల వాలకం నచ్చక వారిని సేవించనంటుంది. కేశవయ్య ఆమెను చీవాట్లు పెట్టి ఆమెకు అన్నం పెట్టవద్దని తన భార్యను శాసిస్తాడు. దీంతో శుష్కించిన జ్ఞానాంబ పుట్టింటికి వెళ్తుంది. ఆరోగ్యవతి అయ్యాక అత్తవారింటికి వెళ్ళమని చెప్పిన తండ్రితో నాటి మూఢాచారాల్ని గూర్చి జ్ఞానాంబతో ఈ విధంగా చెప్పించింది అన్నపూర్ణమ్మ : "నాన్న! వారి ఆచారములు చాలా విపరీతముగ నుండును. ఉదయం మొదలు మధ్యాహ్నం రెండు గంటలవరకు తడిగుడ్డలతో నుండి గురుపూజలు జరుపవలెను. పాత్రాపాత్ర వివక్షత లేక అతి దుర్మార్గులైనను కాషాయాంబరము ధరించినవారికి సర్వోపచారములు జరిపెదరు. గురువులందు నమ్మకములేని నన్ను నిర్బంధముగ సేవ జేయుటకు నియోగించెదరు. వారు మూఢభక్తితో అనంతమైన ద్రవ్యమును ఖర్చు చేసెదరు. గ్రుడ్డి, కుంటి మొదలగు వాండ్లకు భిక్షం వేసిన యిల్లంతయు గుల్లచేయుచున్నావని దూషించెదరు. మా ప్రక్కయింటి యిల్లాలు చాలా కష్టదశలో నుండి గంజికి గూడ దొరకక అవస్థపడుతుండగ పడి బియ్యమొసంగితివి. ఆ విషయం తెలిసి మా అత్తగారు నన్ను కొట్టిరి. ఏదీ తోచనపుడు రామాయణ భారతాది గ్రంథములు చదువుచుందును. స్త్రీలు చదువుచుండిన పురుషులకు చిన్నతనమని యింటి యందు ఏ గ్రంథములుగాని యుంచడము లేదు. బహిర్దిశములందు పడు బాధలు అపరిమితములు. నాలుగు రోజులలో మండ్లు మడివలన ఒకటి రెండు పూటలు మాత్రమే అన్నము దొరుకును. ఈ బాధలన్నిటిని స్త్రీలకు గల నైజమగు ఓర్పుతో సహించితిని."

డబ్బుని దొంగస్వాముల సేవలో దురుపయోగం చేయడంకన్నా ప్రజోపయోగకరమైన కార్యాల్లో వెచ్చించడం సమంజసమైనదని ఈ కథ ద్వారా తెలియజేసింది అన్నపూర్ణమ్మ. అందుకే తన తండ్రి మరణానంతరం రెండు లక్షల ఆస్తికి వారసురాలైన జ్ఞానాంబ ప్రజోపయోగకరమైన విషయాలపై ఆ డబ్బుని వెచ్చిస్తుంది. అంతేకాకుండా మరణశయ్యపై ఉన్న తన భర్త తనకిచ్చిన లక్ష రూపాయలను కూడా ప్రజాసేవకే వినియోగిస్తానని చెబుతుంది.

అన్నపూర్ణమ్మ కథలు చాలా ప్రాథమికమైనవి. శిల్పపరంగా యివి గొప్ప కథలుగా అన్పించకపోవచ్చు. అయినప్పటికీ వాటిలో వ్యక్తమైన "విషయం" దృష్ట్యా అవి అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

వాటిని రాసిన సమయం 1920లు అని గుర్తించుకుంటే వాటిలో వ్యక్తమైన విషయం ప్రశంసార్హమైనదిగా మనం గమనించగలం.

అన్నపూర్ణమ్మ రచనల్ని ఆమె చనిపోయిన తర్వాత ఆమె భర్త అయిన దరిశి చెంచయ్య ఒక పుస్తకంలో క్రోడీకరించాడు. పుస్తకానికి "మరపురాని అన్నపూర్ణ" అని శీర్షికనుంచాడు. కానీ విషాదమేమిటంటే సమకాలీన సమాజంలో అన్నపూర్ణమ్మ, ఆధునికాంధ్ర దేశ నిర్మాణంలో ఆమె పోషించిన పాత్ర మరుగున పడ్డాయి. భండారు అచ్చమాంబ, మాగంటి అన్నపూర్ణాదేవిల వలె దరిశి అన్నపూర్ణమ్మ కూడా చిన్న వయస్సులోనే చనిపోవడం విషాదకరం. ✺

## షంషుర్ రహమాన్ ఫరూకీ



**ఉర్దూ కవి,** నవలా రచయిత, అనువాదకుడు, సాహిత్య చరిత్రకారుడు, సంపాదకుడు, ప్రచురణకర్త, ప్రొఫెసర్ అయిన ఫరూకీ తన 85వ ఏట అలహాబాద్‌లో 25 - 12 - 2020న మరణించారు. ఆయన 30-9-1935లో ఉత్తర ప్రదేశ్‌లోని అజంఘర్‌లో జన్మించారు.

అజంఘర్, గోరఖ్‌పూర్‌లో విద్యాభ్యాసం చేసిన ఫరూకీ, 1955లో అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. ఇంగ్లీషు చదివారు. తన రచనా వ్యాసంగం 1960లో ప్రారంభించారు. 1966లో ఉర్దూ సాహిత్య పత్రికను ప్రారంభించారు. 'షబ్‌ఖూన్' అనే ఈ పత్రికకు నాలుగు దశాబ్దాలకు పైగా సంపాదకునిగా, ప్రచురణకర్తగా వున్నారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. భారత తపాలాశాఖలో పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా పనిచేసి 1994లో ఉద్యోగ విరమణ చేశారు.

తన రచనల ద్వారా ఉర్దూ సాహిత్యంలో ఆధునికతను ప్రవేశ పెట్టారు. మీర్జాగాలిబ్ పైనా 18వ శతాబ్దపు ఉర్దూ కవి మీర్ తఖీ మీర్‌పైనా వీరు రాసిన నాలుగు సంపుటాల గ్రంథం ప్రసిద్ధమైనది. ముస్లిముల బురఖా, హిజాబ్, టోపీల సంప్రదాయాలకు ఈయన వ్యతిరేకం.

18వ శతాబ్దపు ఉర్దూ మౌఖిక కథా కళారూపం 'దస్తాంగోయ్'ను పునరుద్ధరించారు. 19వ శతాబ్దంలో ఒక వెలుగు వెలిగిన ఈ కళారూపం 1928లో మీర్ బఖర్ ఆలీ మరణంతో మరుగున పడిపోయింది. తన మేనల్లుడు మహమ్మద్ ఫరూకీ సహకారంతో దానిని ఆధునీకరించి 21వ శతాబ్దంలో ప్రచారం చేశారు. వీరి కళాబృందం ఈ కళారూపాన్ని 2004తో ప్రారంభించి ఇండియా, పాకిస్తాన్, అమెరికాలలో ప్రదర్శించింది.

1986లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1996లో సరస్వతీ సమ్మాన్ అవార్డు, 2009లో పద్మశ్రీ అవార్డు వీరికి లభించాయి. ✺

కవిత


## ఒంటికన్ను కాలచక్రం....

– జనజ్వాల

ఎందుకో....!
ఈ మధ్య నింగంతా
చెరచబడ్డ దళిత బిడ్డలా
వుంటోంది -
ఉరితీయబడ్డ కవి
నిరపరాధి పద్యంలా
వుంటోంది -
ఇంకా.... కులం మచ్చలతో కుళ్లిన
వాన కురుస్తూనే వుంది -
నెమలి పింఛాలతో
ఉట్టి కొడుతూనే వున్నారు, నేరగాళ్ల వారసులు -
ప్రశ్నతో పరిగెత్తుతూనే వుంది
జింక -
విల్లంబుడ్ని నిర్దోషిగా.. రాజుగా
ప్రకటించింది.... ఒంటికన్ను కాలచక్రం
ఎప్పుడు చూపు ఒక్కటే -
కర్ణుడి రథం ఎందుకు క్రుంగిందో
కవచకుండలాలు ఏకుల మారువేష
మాయ మాటలకు
చిరునవ్వుల శిలగణతి హత్య చేయబడిందో...!
రహస్యం ఏముంది?
పరిశీలన తేలిన తెప్పలు, కప్పలు, బకబకలు
పిక... పిలకల సమాధాన పత్రాలు దిద్దేది
మాస్టార్ ఒక్కరే కదా!
ఆచార్యులు మౌనంగానే
యుద్ధానికి మద్దతు తెలిపారు కదా!
న్యాయస్థానాలు.... నిండు సభలు.... ఎప్పుడు
వ్యూహ దీపాలు ఆరిన తీరు ఒక్కటే -
అంతా.... సమ్రాట్ల పర్వమే.... సామ్రాజ్య పెత్తన
ఆధిపత్యం.... కుల వస్త్రాభరణాలే -
ఎంతకాదు అనుకున్న.... భారతి ముఖశిఖ మీద
శాస్త్రానికి.... శాసనానికి అందని
గాయాల రోగగ్రస్థుల నాలుక తెంచబడ్డ
మూగ నేల -
దేశభక్తిలో చెరచబడ్డ
దళిత బిడ్డల పుణ్యతల్లి -

★★★ ★★★ ★★★

కొత్తగా వాక్యం రాసుకోవడానికి ఏముంది?
వుంటే.., ఇరవై... ఇరవై ఒకటి, అంకెల మార్పులోకి...,
ఒక కొత్త నత్త నడక తప్ప!
కంచెలు బిగించుకుంటున్న విగ్రహ ఉత్సవాలు తప్ప!
శతాబ్దాలు దాటిన నిషాదిగని గీతా చప్పట్లు తప్ప! ✺



# బాల సాహితి

## రైతు కోసం

**- జ్యోత్స్న, 10వ తరగతి**

(**ఒక** ఇంట్లో నలుగురు సభ్యులు ఉంటారు. నలుగురు రాత్రి భోజనంకి అందరూ కూర్చొని ఉంటారు. అమ్మ, నాన్న, అన్నయ్య, చెల్లి అందరూ కూర్చోని భోజనం చేస్తున్నారు. అమ్మ అన్నం వడ్డిస్తుంది. అప్పుడు చెల్లి (రాధిక)కి అమ్మకి మధ్య సంభాషణ జరిగింది.)

రాధిక : అమ్మా! నీకు చెప్పడం మరిచిపోయాను కానీ నేను స్కూల్ నుండి వస్తుంటే దారిలో రైతుల మీద ట్యాంక్ నీళ్ళు కొట్టుతున్నారమ్మా అక్కడ ఏమి జరుగుతుందమ్మా!

అమ్మ : రైతుల తిరుగుబాటు అమ్మా

రాధిక : అమ్మా! నేను అక్కడ చాలా విచిత్రమైన సంఘటన చూశానమ్మా

అమ్మ : ఏంటమ్మా అది!

రాధిక : రైతుల మీదికి నీళ్ళు కొట్టినవారికి రైతులు భోజనం ఇచ్చారమ్మా!

అమ్మ : ఆ ఔనా!

రాధిక : అమ్మా ఇలా నీళ్ళు పైకి కొడితే అంతమంది రైతులు తిరగ పడాలి కదమ్మా కాని అన్నం పెట్టారమ్మా నాకైతే చాలా ఆశ్చర్యం వేసింది.

అమ్మ : అదేనమ్మా రైతు గొప్పతనం. అదే రైతులు తిరగబడితే వాళ్ళ పరిస్థితి ఏంటో ఆలోచించావా?

రాధిక : ఔనమ్మా! కాని వాళ్ళు ఎందుకు అక్కడున్నారు.

అమ్మ : ప్రభుత్వం మూడు చట్టాలు చేసిందమ్మా. దానికి వ్యతిరేకంగా అక్కడ కూర్చున్నారు.

రాధిక : దాని గురించి తరువాత చెబుతానులే. ముందు భోజనం చెయ్యి. (రాధిక భోజనం చేసి అన్ని పనులు అయిన తరువాత)

రాధిక : అమ్మా! ఏంటి ఆ మూడు చట్టాలు?

అమ్మ : 1. రైతుల సరుకులకు (పంటలకు) ఎక్కడ ఎక్కువ ఆదాయం వస్తే అక్కడ అమ్ముకోవడం.
2. రైతులకు ధరలు హామీ, సేవల ఒప్పందం
3. నిత్యావసర సరుకులు ఎన్నయినా నిల్వచేసుకోవటం

రాధిక : అమ్మా! రైతులకు మేలు కలిగించేవే కదమ్మా!

అమ్మ : ఈ మూడు చట్టాలు కార్పొరేట్లకు ఎక్కువ లాభం. రైతులకు చాలా నష్టం.

రాధిక : అమ్మా! రైతు కష్టజీవి కదమ్మా!

అమ్మ : ఔను! నీవు పెన్ను, పుస్తకం, యూనిఫారం మొదలగునవి కొంటావా? అయితే రేటు నీవు చెప్పవు. వాడు వెల చెబితే నీవు డబ్బులు ఇస్తావు కదా! రైతుకు ఆ స్వేచ్ఛ లేదు. తన పొలానికి, తాను పండించిన పంటకు, తాను కష్టానికి తాను వెల కట్టే స్వేచ్ఛ లేదు రైతుకి. దీని వెనుక కార్పొరేట్లకు లాభం ఉంది. ధనవంతుడు ఇంకా ధనవంతుడు అవుతాడు – పేద రైతు పేదవాడిగా ఉండిపోతాడు. ఆనాడు మనకు సమరయోధులు రైతులకు గురించి చట్టాలు చేసిన ఇంత బాధాకరమైనవి కాదు. రైతుల మీద కొన్ని నినాదాలలో రైతుల గొప్పదనం చాటారు కొందరు మహానుభావులు.

రాధిక : చెప్పమ్మా

అమ్మ : "జై జవాన్ జై కిసాన్" –
"ఏరు పుయ్యడం వస్తే – రాజ్యమేలడం వస్తుంది"
"రైతు దేశానికి వెన్నెముక"

రాధిక : అమ్మా! నేను రేపు మా పాఠశాలలో రైతుల గురించి, రైతు కష్టం గురించి, ఈ మూడు చట్టాల గురించి, నీవు చెప్పిన విషయాలు అన్ని చెబుతాను అమ్మా! రైతుల కోసం మనమేమన్నా చెయ్యాలమ్మా!

అమ్మ : అలాగేనమ్మా!
అందరి కోసం ఒక్కరు!
ఒక్కరి కోసం అందరూ!



**రైతు పాట పాడుదాం....**

**బండి తరుణిశ్రీ,**
**2వ తరగతి**

# సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జాతీయ ప్రజాతంత్ర సాహితీ సాంస్కృతికోద్యమ నిర్మాణానికై కలసి రండి! అన్న పిలుపుతో అనంతపురంజిల్లా తరిమెల గ్రామంలో జరిగిన జనసాహితి 10వ రాష్ట్ర మహాసభలో

# సింగమనేని నారాయణ చేసిన ప్రారంభోపన్యాసం

**"విద్వాన్** విశ్వం పేరిట జరిగే ఈ ప్రాంగణంలో మహాసభ జరగడం చాల సంతోషాన్ని కలుగచేస్తోంది". 'పెన్నేటి పాట'లో విశ్వం వర్ణించిన రాయలసీమ దుస్థితి ఈ 50 సంవత్సరాల కాలంలోనూ ఇంకా దిగజారింది.

"ఒక కోటి మందికి నివాసయోగ్యమైన విస్తారమైన ఈ ప్రాంతంలో కేవలం 30 లక్షల మంది మాత్రమే వుంటున్నారు. 1954-2007కి పరిస్థితి ఎంత దిగజారిపోయిందో తలచుకుంటే ఎంత దుఃఖం వస్తుందో చెప్పలేం. దీనికి కారణాలు ఇక్కడి రచయితలు అన్వేషిస్తున్నారు. ఇతర జిల్లాలవారు కూడా అనంతపురం జిల్లా ప్రజల గురించి పరిశీలించి స్పందించాలి. ఇక్కడి రైతులు ప్రతి ఏడాదీ తమ పశువులను కబేళాలకు తరలించడం గురించి రాష్ట్రంలోని రచయితలందరూ మాట్లాడాలి. కరువుపై 'ఇనుప గజ్జెల తల్లి' అనే కథాసంపుటిని మేం ప్రచురించాం.

"మేం ప్రత్యేక రాష్ట్రం కోరడంలేదు. అలా కోరడమంటే ఆదాయం లేని కొడుకును వేరు పెట్టడమే. మా రాయలసీమను ప్రత్యేక దేశంగా ప్రకటిస్తే గంజాయి పండించుకుంటూ, బాంబులు తయారుచేసి అమ్ముకుంటూ సుభిక్షంగా వుంటాం. అనంత దుఃఖభారంతో ఈ విజ్ఞప్తి చేస్తున్నాను. మా మాటల్లోని సారాన్ని గ్రహించండి.

"ఈ మహాసభ సందర్భంగా ఎన్నో విషయాలను పునర్విమర్శ చేసుకోవాలి. ఒక భయంకరమైన సామాజిక సంవేదనల నేపథ్యంలో ఈ చిన్న పెద్ద సభ జరుపుకుంటున్నాం. ఎన్నెన్నో మార్పులు – మనలను నట్టేట ముంచేస్తున్నాయి. సమాజానికి ఆయువు పట్టైన విద్య, వైద్యం, వ్యవసాయం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి.

"దేశీయ సంస్కృతి, కళలను ధ్వంసంచేస్తూ, మార్కెట్ సంస్కృతి, వస్తువ్యామోహ సంస్కృతితో నింపివేసి మనలను సాంస్కృతికంగా దుర్భరస్థితిలోకి పాలకులు నెట్టివేశారు. పేద ప్రజలకు మంచి విద్య కనీసం రేపైనా అందుతుందనే ఆశ లేదు. వైద్యం, విద్య ప్రైవేటీకరణ అయిపోయాయి. గ్రామీణ ప్రజల ఆర్థికస్థితి చితికిపోయింది. నిరుద్యోగం ప్రబలిపోతోంది. ఏ కొందరికో లక్షలార్జించే విద్య, వుద్యోగాలు మాత్రం సృష్టింపబడుతున్నాయి.

"ఇటీవల ఒక కథల పోటీకి వచ్చిన వందలాది కథల్లో ఎక్కువ వృద్ధాప్య సమస్యలపై వచ్చాయి. వృద్ధాప్యం సామాజిక సమస్యైపోయింది. ఈనాడు రాయలసీమ రైతు 'నా భూమిని కొంటారా' అంటూ రోడ్డున పడ్డాడు. ఈనాడు అనంతపురంజిల్లా అమ్మకానికి వుంది.... రాయలసీమ రచయితలమైన మేము ప్రాంతీయ స్పృహ కలిగిన రచనలు చేస్తున్నామే కాని ప్రాంతీయవాద స్పృహతో ఏ రచనా చేయలేదు. ఇతర ప్రాంతాల వారిలా ఒక వాదంగా రచనలు చేయలేదు. మా కథలకు ప్రాంతీయ ముద్ర వేయవద్దు. ఇక్కడి కథలు ప్రపంచ కథలు.




"ఈనాడు మార్క్సిజంపై దాడి జరుగుతోంది. మరలా ఒకసారి భూస్వామ్యం గురించి, పాలకవర్గాల గురించి, వర్గ దృక్పథం గురించి మాట్లాడుకోవాల్సి వస్తోంది. కులం ఒక వాస్తవమే అయినా కులమే సమస్తం, మతం, లింగం సమస్తం అనే దృక్పథాలు వచ్చాయి. ఇది శాస్త్రీయమైన అవగాహన కాదు. ఆధునికానంతరవాదానికి ఇవన్నీ కొత్తపేర్లు మాత్రమే. సమాజాన్ని ప్రశ్నించే మౌలిక భావనలను ఏ సిద్ధాంతం అందించిందో వీరు గుర్తించడానికి నిరాకరిస్తున్నారు.

"ఒకాయన తన కుక్క బయటకు పోడానికి గోడలో ఒక త్రోవపెట్టాడు. ఆ కుక్కకు పిల్లలు పుడితే వాటికోసం చిన్న చిన్న రంధ్రాలు పెట్టాడు. కాని ఈ కుక్కపిల్లలు కూడా తల్లికోసం పెట్టిన త్రోవగుండానే వెళ్తున్నాయి. ఈ చిన్న రంధ్రాలన్నీ వివిధ వాదాలు. పెద్ద రంధ్రం మార్క్సిజం.

"హైదరాబాదు వెళ్తే అక్కడి రచయితలను కదిలిస్తే ఏ వాదం మాట్లాడతారో అన్న భయం వుంది. మైనారిటీ మిత్రులతో చెప్పాను. మార్క్సిస్టులు మాత్రమే సెక్యులరిస్టులు అని. సమ్యక్ దృక్పథం కల్గిన వాళ్ళను ఈ వాదాలవాళ్ళు శంకిస్తున్నారు. నిజానికీ వాదాలన్నీ ఉద్యమాలు కాదు. ఈ సామాజిక సంవేదనలన్నీ ఒక గొడుగు కిందకు వచ్చి సమస్యల పరిష్కారం కొరకు ఉమ్మడిగా సంఘటితంగా పోరాడాలి.

"ప్రపంచీకరణ అనేది పెనుసంత. మన సమూహాన్ని చీల్చి, మనలను వ్యక్తులుగా విడగొడుతున్న కుట్రను బద్దలుకొట్టాలి. నేను జనసాహితిలో గతంలో పనిచేశాను. ఆనాడు ప్రజలంటే ఎవరు అని నిర్వచించుకున్నాం. ఇప్పుడూ అదే ప్రశ్న. ప్రజలెవరో నిర్ణయించుకోలేకపోతే సందిగ్ధంలో పడిపోతాం. ప్రజల పక్షంగా రాసి ప్రజావ్యతిరేక పక్షంలో కవిగా మారిపోతావు.

"కనీసం మార్క్సిజం, గతితార్కిక దృక్పథం తెలియకుండా నీవు ఏ తత్త్వం నుంచి సమాజాన్ని పరిశీలిస్తావు? అని కొ.కు. ప్రశ్నించాడు. ఈ మహాసభ మనలో ఉత్తేజం కల్గించాలి."

వ్యంగ్య కథ

# పెరుగుట విరుగుట

పాపినేని శివశంకర్

**అంధక** రాజ్యాన్ని బంధక మహారాజు పాలించే కాలంలో పెద్ద ఉపద్రవం తలెత్తింది. అసలే ప్రజలకు అంతు లేకుండా పెరిగిన పన్నుల బాధ. గోరుచుట్టుపై రోకటి పోటులా ఇంకొక కొత్త చట్టం వచ్చింది. అదేమిటంటే దేశంలో రైతులు ఎంత కష్టపడి పండించినా పన్నులకు పోగా మిగిలిన పంటను రాజ బంధువులైన పెద్ద పెద్ద వ్యాపారులకే అమ్మాలి. ధరలు వ్యాపారులే నిర్ణయిస్తారు. దాంతో రైతులు పండించినవాటికి సరైన ధర రావటం లేదు. వాళ్లు అప్పుల్లో కూరుకు పోయారు. కొందరు దేశం వదిలి వలసపోయారు. రైతు వర్గంలో అశాంతి, అలజడి మొదలయ్యాయి. ప్రభుత్వానికి విన్నవించుకొన్నా ఫలితం లేకపోగా వారంతా కట్టగట్టుకొని ఉమ్మడి ఆందోళనకు దిగారు. వేగులవారి ద్వారా రాజుగారికి ఈ వార్తలన్నీ చేరుతున్నాయి. రాను రాను పరిస్థితి విషమించటంతో వృద్ధమంత్రి రాజుగారికి విన్నవించాడు. మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేశారు.

'పరిస్థితి సం-క్లిష్టంగా ఉంది మహారాజా! మనం ఏదో ఒకటి చెయ్యాలి' అన్నాడు వృద్ధమంత్రి తంత్రానందుడు.

'ఏదో ఒకటి ఏముంది మహామంత్రీ! మనం చేసిన కొత్త చట్టాన్ని రద్దు చేస్తే బాగుంటుంది. రైతులు పండించే పంటలకు తగు మాత్రపు కనీస ధర కల్పించటం ప్రభుత్వ కర్తవ్యం.' అన్నాడు కొత్తగా చేరిన కుర్రమంత్రి కుమార వర్మ.

'అవునవును... కానీ ... అయినా ...మనం ఈ విషయాన్ని ఇంకాస్త లో...తుగా ఆలోచించాలి.' అన్నాడు వృ.మం.

'రైతులు మన ఆత్మ చుట్టాలు. వారి ఆత్మహత్యలు మా యొక్క మనస్సును కలచి వేస్తున్నాయి' అన్నారు మహారాజు.

'అవును. అందుచేతనే తమరి మాటలలో ఆ తడబాటు. అప్పుడే ఏలినవారి ఎడమ కంటిలో చిరు అశ్రుబిందువు తొణుకుచున్నది' అన్నాడు వృ.మం. వెంటనే రాజుగారు చెమ్మ లేని కళ్లొత్తుకున్నారు.

'అయినను మనము చేసిన చట్టాన్ని మనమే రద్దు చెయ్యటమా? అది మనకెంత తలవంపు? అయినను ఈ రైతులు మన చట్టం గిట్టకపోతే అసలు వ్యవసాయం మానేసి, వేరే వృత్తులు చూసుకోరాదా?' అన్నారు మహారాజు.

'రాదా?' అని వంత కలిపారు తక్కిన విధేయ మంత్రులు.

కుమార వర్మ తల పట్టుకున్నాడు. మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. చర్చలలో కుర్ర మంత్రి కంటి నలుసులా తయారయ్యాడు.

'అంత కంటె ముఖ్య విషయం మన ముందున్నది. రాణి వారికి తొమ్మిదో మాసం గదా! రాజ వైద్యులను వెంటనే రప్పించండి' ఆదేశించారు మహారాజు. 'చిత్తం చిత్తం' అన్నాడు వృ.మం.

'రైతుల సమస్యకు మార్గాంతము ఆలోచించెదము గాక! ప్రస్తుతము మాకు శిరోబాధగా యున్నది. ఇక సభను చాలించి బసకు వెళ్లెదము' అంటూ మహారాజు వృద్ధమంత్రి వైపు సాలోచనగా చూస్తూ లేచారు. వృద్ధమంత్రి చిరునవ్వుతో తల పంకించాడు.

వారం రోజుల్లో రాజ్యమంతటా ఊరూరా గొప్ప చాటింపు వేశారు. అదేమిటంటే మహారాజుగారు ప్రజా సమస్యల నివారణ కోసం గడ్డం పెంచుతున్నారని. అదెట్లాగంటే వారు సుదీర్ఘ గడ్డంతో తపస్సు చేసి దేవతల్ని మెప్పించి వరాలు తెస్తారు. దాంతో దేశ సమస్యలన్నీ – రైతుల సమస్యలతో పాటు – పటాపంచలవుతాయి!

రైతులంతా తెల్లబోయారు. క్రమక్రమంగా వాళ్ల ఆందోళన కార్యక్రమం ముమ్మరం అవుతున్న దామాషాలోనే రాజ గడ్డం బెత్తెడై, జానెడై, మూరెడై విజృంభించింది. ఆపైన బంధక మహారాజు ఒకనాడు ఆంతరంగిక సమావేశం ఏర్పాటు చేశారు.

'ఇప్పుడెలా ఉన్నది పరిస్థితి?' అని తెల్ల గుబురు గడ్డాన్ని (ఉద్దేశిస్తూ) నిమురుకుంటూ మందహాసంతో అడిగారు.

'రైతుల ఆందోళన ఇంకా తీవ్రం...' అని కుమార వర్మ ఏదో చెప్పబోతుండగా తంత్రానందుడు అందుకొన్నాడు.

'...కావటం మాటదేముంది గానీ అంతా ప్రశాంత వెన్నెల వాతావరణం మహా ప్రభూ!'

'అది యేలాగున?'

'ఏలినవారి శ్వేత గడ్డమే కారణం ప్రభూ! వెన్నెల వలె ఎంత తెలుపు! ఎంత మెరుపు! ఏతత్ స్ఫూర్తితో రాజ్యంలో ఎంతోమంది ఉత్సాహంగా గడ్డములు పెంచుచున్నారని వేగుల వార్త.'

మహారాజు మందహాసం చేశారు. కాని ఆస్థాన కవి వామన భట్టు కాస్త అడ్డు తగిలాడు.

'తమరి మోము శ్మశ్రు సుందరమే. సందేహం లేదు. అయితే మహామంత్రుల వారి మాటలతో కించిత్తు విభేదించవలెనని యున్నది.'

ఆంతరంగికులంతా ఆసక్తిగా వింటున్నారు. 'తమరి మోము చంద్రుని వలె, గడ్డము వెన్నెల వలె యున్నదని మహామంత్రులవారు చక్కగా సెలవిచ్చారు. అయితే చంద్రునిలో మచ్చ వలె, ఏలినవారి శ్వేత గడ్డములో ఒకానొక నల్ల వెంట్రుక దాగియున్నది. అది గదా సొగసు!

*'ఆ యొక్క నల్ల వెంట్రుక*
*మీ యొక్కయు గడ్డమునకు మెరుపై, ఆపై*
*మా యొక్కయు మన యొక్కయు*
*వేయొక్కయు ప్రజలనిక బలే కాపాడున్!'*

కుర్రమంత్రి గతుక్కుమన్నాడు. 'రాజుగారి వెంట్రుక ప్రజల్ని కాపాడుతుందా?'

మహారాజు మాత్రం ముసిముసి నవ్వుతో 'సెబాసు' అన్నారు. 'మీ కందము చేవ గల కందవలె అందముగా యున్నది. నాలుగు పాదాల్లో ఐదు 'యొక్క'లు వేసిన మీ కవితా మచక్రుతి బహు ప్రశంసనీయము.'

'కవితా చమత్కృతి గదా!' గొణిగాడు కుమార వర్మ. రాజుగారు అతని వంక గుర్రుగా చూశారు. 'మాకట్లే బాగున్నది. కవితా మచక్రుతే' అన్నారు.

'అవును. భాషలోనే సరికొత్త పదం కనిపెట్టిన ఏలినవారి ప్రజ్ఞే ప్రజ్ఞ' అన్నాడు వృద్ధమంత్రి.

కుమార వర్మ అయోమయంగా తల ఊపి, ఆస్థాన కవి వంక తిరిగాడు. 'భట్టు గారూ! పద్యంలో అన్నీ 'యొక్క'లతో నింపితే నింపారు గానీ, నాల్గో పాదంలో యతి తప్పిందే? 'వే'కి, 'లే'కి యతి కుదరదు గదా?' అని సందేహం వెలిబుచ్చాడు.

ఆస్థాన కవి వామన భట్టు తల గోక్కుని, తమాయించుకున్నాడు. 'ఆ మాత్రం ఈ ఆశు మార్తాండ బిరుదాంకితుడికి తెలియదనే మీ అభిప్రాయమా? వే, లే – ఇవి రెండూ ఒకే రూపంలో ఉన్నాయా లేదా? కనుక కొత్త యతి – స్వరూప యతి – వేశాను. నేనే కనిపెట్టాను.'

'ఇది బహు బాగున్నది. అయినను యతిదేమున్నది? మతి శ్రుతిలో యున్నది కదా!' అన్నాడు మహారాజు.

'మరే, కదా?' అన్నారు సభాసదులు.

కాలం గడిచి రైతుల ఉద్యమం తగ్గు ముఖం పదుతుందిలే అనుకొన్న మహారాజు, వృద్ధమంత్రి ఆలోచన సరికాదని తేలిపోయింది. ప్రభువుల వారి గడ్డం పెరుగుతున్నట్టే రోజు రోజుకీ రైతుల ఆందోళన కూడా ఉధృతం అవుతున్నది. వాళ్లు వ్యవసాయం వదిలి రహదారుల మీదకు వచ్చారు. నిరాహార దీక్షలు మొదలయ్యాయి. మెల్ల మెల్లగా దేశంలోని అన్ని సామంత రాజ్యాల సేద్యగాళ్లు కూడా ఉద్యమంలో చేరసాగారు. రాజుగారికి శిరోవేదన అధికమైంది.

'బలవంతాన వారి ఆందోళన మాన్పించాలని మేము చేసిన బల ప్రయోగం కూడా ఫలించలేదు మహారాజా!' విన్నవించాడు సేనాధిపతి. 'రాజ ద్రోహం నేరం మోపి, ఎందరిని కారాగారం పాలు చేసినా ఉద్యమంలోకి మరెందరో వచ్చి చేరుతున్నారు.'

'ఇప్పటికైనా ఏలినవారు వారిలో పెద్దలను రప్పించి, సమస్యలేమిటో తెలుసుకొని, పరిష్కారమార్గం ఆలోచించటం మంచిదని నా అభిప్రాయం' అని కుమార వర్మ సూచించాడు.

మహారాజు భ్రుకుటి ముడివడింది. 'అట్లైనచో అల్పులకు మేము తల వంచినట్టు కాదా?'

తంత్రానందుడు అందుకున్నాడు. 'అవును ప్రభూ! కుమారుడు బొత్తిగా చిన్నవాడు గనుక ఇంకా రాజనీతి బోధపడుట లేదు. అట్లు చేస్తే ప్రభుత్వం లొంగిపోయినట్టు అవుతుంది. ఏలినవారు చులకనై పోవటమే గాక, రేపు ప్రొద్దున ఈ తీరున ఇతర వర్గాలూ ఇట్టి విద్రోహకర ఆందోళనలు చేపట్టవచ్చు. అందునా ప్రస్తుత ఉద్యమంలో కొన్ని దేశద్రోహ శక్తులు కూడా చేరాయని గూఢచారుల నివేదికలు తెల్పుతున్నాయి.'

'అయినను రైతులు మా ఏడో ప్రాణం. (రాణి గారు వారి ఆరో ప్రాణం అని సభ్యులకు తెలుసు.) వారి సమస్యల పరిష్కారానికై మేమిక తపస్సుకు బయలువెడల వలసిందే' అన్నారు మహాసభలో, బారెడు తెల్ల గడ్డం నిమురుకొంటూ.

'అదేమో గాని, ఈ నిండు గడ్డంతో తమరు మహాకవుల మాదిరిగా ఉన్నారు' అని కొనియాడాడు ఆస్థానకవి వామన భట్టు.

'మాదిరిగా ఏమిటి? సాక్షాత్తు మహాకవులే. ఇంతటి గడ్డం మహాకవి కాళిదాసుకు కూడా లేదు.' అని సేనాధిపతి నొక్కి వక్కాణించాడు.

'ఈ నిండు సభలో తమరి నోటివెంట ఒక చక్కని, చిక్కని కవిత వినవలెనని యున్నది మహాప్రభూ!' విన్నవించాడు మరొక మంత్రి.

మహారాజు మందహాసం చేశారు. మరొకసారి ఏకైక నల్ల వెంట్రుక గల తెల్ల గడ్డం నిమురుకొన్నారు. గొంతు సవరించుకొన్నారు.

*'అదుగదుగో తూర్పున సూర్యోదయం*
*ఇదుగిదుగో మహారాణికి పుత్రోదయం*
*తెచ్చేను ప్రజావళికి భాగ్యోదయం...'*

నాల్గో పాదం తట్టక రాజుగారు తడుముకుంటుండగా, ఆస్థాన కవి అందుకున్నాడు.

'వచ్చేను రాజుగారికి కవిత్వోదయం'

'వహ్వా! వహ్వా!' అన్నారు సభాసదులు హర్షధ్వానాలతో.

'సూర్య భగవానుడు తూర్పున ఉదయిస్తాడనే మహత్తర సత్యాన్ని విప్పి చెప్పిన మహా ప్రభువుల ఆలోచనా పటిమే పటిమ' అని ప్రశంసించాడు మహామంత్రి.

'ఆ యొక్క కవితా గరిమే గరిమ' అందుకొన్నాడు వామన భట్టు.

ఈ సభా గోష్ఠి పరికిస్తున్న కుర్రమంత్రి కుమార వర్మకు మతి పోయింది. 'ఇది ప్రభుత్వమేనా? ఇందులో నేను భాగస్వామినా?'

రోజురోజుకీ రైతుల ఉద్యమం మరింతగా విస్తరిస్తుంది. నిరాశా నిస్పృహలతో కొందరు ఆత్మహత్య చేసుకొన్నారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత అధికమైపోయింది. అయినా మహారాజుగారు బెల్లం కొట్టిన రాయల్లే కిమ్మన్నాస్తిగా ఉండిపోయారు. ఫలానా రోజు వారు తపస్సుకు బయలు వెడలుతున్నారనే వార్త రాజ్యమంతటా చాటింపు వేశారు.

కుమార వర్మ ఈ వ్యవహారం ఎంతమాత్రం సహించలేకపోయాడు. మహా రాజు వినడు. మహామంత్రేమో ప్రభువుకు తందాన తాన. ఈ పరిస్థితి ప్రభుత్వ పతనానికి దారి తీస్తుందని మొత్తుకున్నా ప్రయోజనం లేకపోయింది. ప్రజల కోసం కాకపోతే ప్రభుత్వం ఎందుకు అనే ప్రశ్న తలెత్తింది కుమార వర్మకి. ప్రజల్ని పట్టించుకోని ప్రభుత్వంలో తాను మాత్రం ఎందుకు అని మరో ప్రశ్న కూడా వేసుకున్నాడు. ఇట్లాగే కొనసాగటం ఆత్మ ద్రోహం అనుకొన్నాడు. తానిక మంత్రివర్గంలో కొనసాగలేనని మహామంత్రికి చెప్పి, రైతుల ఉద్యమం జరిగే చోటుకి వెళ్లి వారితో గొంతు కలిపాడు.

ప్రభువుల వారి తపో యాత్రకు పుణ్య తిథి నిర్ణయించబడింది. శుభ ముహూర్తంలో మేళతాళాల మధ్య బంధక మహారాజు తపస్సుకు బయల్దేరారు. అయితే విధి వక్రించింది. దురదృష్టవశాత్తు, ఏతత్ శుభముహూర్తాన బారెడు పెరిగిన ప్రభువులవారి గడ్డం వారి కాళ్లకే అడ్డం పడి, బిళ్ల బీటుగా పడినవారై, తత్ తూలుడుచే మోకాలు విరిగినవారై, హంసతూలికా తల్పమునకు చేర్చబడిరి. ✺

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 90వ వర్ధంతి సందర్భంగా...

కవిత

# షహీద్! నువ్ మళ్ళీ పుట్టాలి

- ప్రసన్న

వాడప్పుడప్పుడంటుంటాడు
ఇది ప్రపంచంలోనే అతిపెద్ద
పైసాస్వామ్య దేశమని
కులస్వామ్యమో మతస్వామ్యమో
ఏ మూకస్వామ్యమైనా పర్లేదు
ఆ మూకను వాడు ఏర్చికూర్చుతాడు
నువ్వైతే ప్రజలకోసమంటావ్
ప్రజాస్వామ్యమంటావ్
కామ్రేడ్!
ఇప్పుడు ఆ ప్రజలకోసం మళ్ళీ ఉదయించు

మతం పేరుతో రెచ్చగొడితే
పిచ్చెక్కిపోయి ఓట్లు రాల్చే
వెర్రి జనంగా ప్రజల్ని మార్చివేసి
ప్రజల శ్రమని పువ్వుల్లో పెట్టి వాడికందించినవ్నాళ్లు
ఏ ఎండకా గొడుగు పట్టే
సౌకర్యవంతమైన లౌక్యవాదం కావాలి వాడికి
నీకేమో మనిషిని మహోన్నతంగా నిలబెట్టే
మతాతీత లౌకిక వాదం కావాలి
మహాశయా! ఆలస్యం చేయక...
ఆలోచనవై మాలో ప్రవహించు

ఆలోచనల నుండి ఆయుధాల దాకా
పెట్టుబడుల నుండి పేటెంట్ల దాకా
అన్నీ ప్రపంచ పెద్దన్న చేతిలో పెట్టి
దొర ముందర తలవంచుకుని
దొర ఎంగిలి దొరికించుకుని
వారు చెప్పినట్టు ఆడటంలో
ఉన్న మజా తెలియదు నీకు
నవ భారతం సర్వసత్తాక దేశం కావాలంటావు
షహీద్! జర జల్దీ...
అధ్యయన కాంక్ష యువతరంలో రగిలించు

పక్కోడిని తొక్కేసి
ఎక్కడికో ఎగబాకేందుకు
బక్కోడిని మెక్కేసి
అడ్డంగా తెగబలిసేందుకు
సొమ్మువాదం కావాలి వాడికి
కానీ నీకో...
దోచుకోవడం దాచుకోవడం లేని శ్రమజీవులకి కూడా
సమాన అవకాశాలు కావాలి
శ్రమజీవులకి అధికారం కావాలి
సామ్యవాదం కావాలి
అయ్యా! ఏమైనా చెయ్...
నాటి ఇంక్విలాబ్ పిడికిలిగా నినదించు

వాడి వరకు మాత్రం
ఆస్తి లాగే దేశం కూడా...
వాడితర్వాత కొడుక్కో కూతురుకో
అల్లుడికో మనమడికో.....
ఆ..... నీకు అర్థం అయ్యింది కదూ...
ఔను! కుటుంబ పాలన కావాలి వాడికి
మరి నువ్వో...
గణతంత్ర దేశం కావాలంటావ్
అందుకే చెప్తున్నా
మా దేశంలో మళ్ళీ ఉడుకు రక్తాన్ని ఉప్పొంగించు

అప్పుడెప్పుడో వాడికన్యాయం జరిగినప్పుడు
ఆవేశంలో అన్నాడు గానీ.....
దేశంలో మళ్ళీ భగత్ సింగ్ పుట్టాలని
కూలి జనం కోసం ప్రాణాలిచ్చే కొడుకును
ఎవరు మాత్రం కావాలనుకుంటారు
వాడి మాటని నేను దత్తత తీసుకుంటున్నా
మన ఎజెండాని విత్తనంగా నాటాలి
ఈ మట్టికి మళ్ళీ నువ్వే మాటలు నేర్పించు

ఆశయాలను బొందపెట్టి
ఆకారాలకు ఆలయాలు కట్టి
మీ త్యాగాలకు వెలలు కట్టి
సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టిన
దగాకోర్ల దివాళాకోరు పాలనలో
దశాబ్దాలుగా మమ్ము మేమే

వంచించుకుంటూ హింసించుకుంటూ
ఆర్జిస్తున్నాం నిన్ను
షహీద్! నీ ఆవేశం మళ్ళీ ఊపిరులూదాలి

రైతులైనా కూలీలైనా
కార్మికులైనా ఏ రకం శ్రామికులైనా
వాళ్ళ రక్త మాంసాలకు దళారీగా
వారి అశ్రు స్వేదాల బేహారిగా
అధికారానికి ఎగబాకుతాడు వాడు
నువ్వైతే శ్రామిక వర్గ రాజ్యాధికారం తెస్తావ్
శ్రామికులే దేశానికి పునాది అంటావ్
మరందుకే నీకీ ఆహ్వానం
ఆవహించనీ నీ ఆవేశం

జాతీయోద్యమానికి జీవంపోసిన
తెలంగాణ రైతాంగాన్ని సాయుధం చేసిన
నగ్జల్బరికి నడకను నేర్పిన
సిక్కోలు చేత సింహగర్జన చేయించిన
కొండమొదలు గుండెలయవై
ప్రజాయుద్ధ పంథావై
మరొక్కసారి మాకోసం
మరణంలేని మహాప్రభంజనమై
అంతరాలన్నింటినీ అంతం చేసుకుని
అంతరిక్షమంతైన మహాజనమై
ఇంక్విలాబ్ రణన్నినాద సుగంధమై
వ్యాపించు విశ్వమంతా

అనంత చైతన్య విద్యుత్తువై
వదిలించు మా సుదీర్ఘమైన నిద్రమత్తును
కదిలించు ప్రతి మస్తిష్కాన్నీ హృదయాన్నీ
బ్రతుకు దారి కనపడక
ఢిల్లీని చుట్టుముట్టిన రైతన్నకి
విశాఖ రోడ్డెక్కిన కూలన్నకి
హత్యాచారాలతో భీతిల్లిన ప్రతి చెల్లికీ
దిక్కుమొక్కులేని ప్రతి ఒక్కరికీ
వేగుచుక్కవై దారి చూపించు
వెలుగుదారిలో ముందుకు నడిపించు
ఈ దేశపు యువత నుండి వందలు వేలుగా
భగ భగ భగ భగత్ సింగాలను పుట్టించు
భగత్సింగ్!
నీవు వేన వేల భగత్సింగ్‌లవై
మరోసారి ప్రజ్వలించు

పాట

# అమ్మబాబోయ్ ఆ మూడు చట్టాలు

– రౌతు వాసుదేవరావు

**అమ్మబాబోయ్!** ఆ మూడు చట్టాలు
నమ్మకండి రైతులకవి శాపాలు
వ్యవసాయం చట్టాలని పెట్టినారు నామాలు
కార్పొరేటు దళారీల పాలిట అవి వరాలు ॥ అమ్మ ॥

నిత్యావసర సరుకుల నిల్వల చట్టం చూడు
ఎవరైనా ఎంతైనా సరుకు నిల్వ చేయొచ్చుట
పొలంలోనే పంటనమ్మే రైతులకవి మేలంట
బహుళజాతి కంపెనీలు దళారీలే తప్ప
బడుగు రైతులెవరైన సరుకు నిల్వ చేయగలర ॥ అమ్మ ॥

దేశంలో ఎక్కడైన తమ పంటని అమ్మొచ్చుట
ఉట్టికేగలేనమ్మ స్వర్గానికి ఏగుతుందా
ఊరు దాటి వెళ్ళలేని రైతు నోట మట్టి కొట్టి
కారుచౌకగా రైతుల సరుకులన్ని కాజేసి
బడా బడా కంపెనీల బొక్కసాలు నింపునంట ॥ అమ్మ ॥

కాంట్రాక్టు పార్మింగనుమతి మూడో చట్టం చూడు
ఐదేళ్లకు వర్తించే ఒప్పందపు రేటు పెట్టి
ఏ పంటో ఏ ఎరువో అగ్రిమెంటు చేస్తారట
రసాయనం గుమ్మరించి వ్యాపారపు పంటలేసి
నేలతల్లి కడుపు కొట్టి రైతుకు ఉరితాడంట ॥ అమ్మ ॥

మా కడుపులు కొట్టేటి ఆ చట్టాలొద్దంటు
ఢిల్లి కోట ముట్టడించ రైతులంత కదిలినారు
దేశంలో నలుమూలల దావాలనమంటుతోంది
పీడిత బతుకుల్లో వెలుగులనే నింపుతోంది
కనరండి రారండి కదనాన ఉరకండి ॥ అమ్మ ॥

# మహిళాదినోత్సవ కవిత

పుస్తకమూ కలమూ చేబూనిన వనిత
దేశాల్నే కదిలించగలదు
మేధస్సూ, గళమూ గల వనిత
ప్రపంచాన్నే మార్చివేయగలదు

(సాషా టిమర్ఫి ఆంగ్ల మినీ కవితకు
అనువాదం – రవిబాబు)




మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం స్ఫూర్తిని స్వీకరిద్దాం!

**మహిళలపై అమలవుతున్న పితృస్వామ్య అణచివేత దోపిడీ పీడనలకి వ్యతిరేకంగా పోరాడుదాం!**

# ధనస్వామ్యం, మనుధర్మం సృష్టించిన బందిఖానా 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్'

**– బాలాజీ** (కోల్‌కతా)

**వంటా వార్పూ,** బట్టలు ఉతకడం, ఇల్లు ఊడ్వడం, పిల్లల పెంపకం, వృద్ధుల సేవా వంటి సమస్త ఇంటి పనంతా 'కుటుంబ శ్రమ' అనే రకానికి చెందుతుంది. ఇది ఉత్పత్తి స్థలంలోంచి 'జీతాన్ని' మోసుకొచ్చే 'ఉత్పాదక శ్రమా' కాదు, జీతమిచ్చి పనిపిల్ల చేత చేయించుకునే 'అనుత్పాదక శ్రమా' కాదు. మన పని అనుకుని 'అదివారాన్ని' కూడా ఆశించని గృహిణి చేత చేయించే స్వచ్ఛంద శ్రమ.

భర్త చేసే బయటి పనీ, భార్య చేసే ఇంటి పనీ ఇంటికి సమాన అవసరాలే అయినా, 'జీతం రాళ్లు' తెచ్చే మగాడు అధికుడయ్యాడు, 'లెక్క'లోకి రాని వెట్టిచాకిరి చేసే ఆడది అధమురాలైంది. ఇంటా, బయటా వున్న అసమాన శ్రమ విభజన ఒకే బండి చక్రాల్లాంటి భార్యాభర్తల మధ్య సృష్టించిన తారతమ్యమిది. ఈ అగాధానికి 'హిందూ భారతం' చేర్చిన అదనపు భారం ఫ్యూడల్ మతభావజాలం. మనుధర్మశాస్త్రం ప్రకారం స్త్రీలందరూ అధములే, అపవిత్రులే. వారిని ఎలా అణగదొక్కి వుంచాలో ఒకటికి పదిసార్లు అది నొక్కి చెబుతుంది. ఈ నేపథ్యంలోనే 'ఒక మహాభారత పాకశాల' సినిమా ఒక వనిత విలాపాన్ని విశ్లేషించే ప్రయత్నం చేస్తుంది **'ది గ్రేట్ ఇండియన్ కిచెన్'** అనే మళయాలం సినిమా. దీనికి దర్శకుడు జోయ్ బేబీ. ఈ యేడాది జనవరిలో 'నీ స్ట్రీం' అనే పేరు తెలీని ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌లో విడుదలై సంచలనం సృష్టిస్తోంది.

## సినిమా కథ :

ఈ సినిమాలో పాత్రలకు పేర్లుండవు. అంటే ఇది భారతదేశంలోని ఎవరి కథైనా కావచ్చు. వంటిల్లు అన్నది ప్రతీక మాత్రమే. గృహంలో గృహిణి స్థానం చర్చించడం అసలు ఉద్దేశం. కథానాయకి (నిమిషా సజయన్) డ్యాన్స్ చేస్తున్న దృశ్యంతో సినిమా ప్రారంభమవుతుంది. 'చెమటలు పడుతున్నా, చాలా ఇష్టంగా ఆమె నృత్యం చేస్తుంటుంది. ఆ సంగతి ఆమె ముఖారవిందంలో మనకు కనిపిస్తోంది. అంతే! ఆ ఒక్క దృశ్యం తరువాత ఆమె కథ అడ్డం తిరుగుతుంది. ఆమెకు ఒక ఛాందస అగ్రవర్ణ హిందూ కుటుంబానికి చెందిన టీచర్‌తో (సూరజ్ వెంజరమూడ్) వివాహం కుదురుతుంది. కొత్త కారు కట్నంగా తీసుకొస్తూ, దీపం పట్టుకుని కుడికాలు ముందుపెట్టి అత్తగారింట్లోకి కొత్త కోడలు అడుగు పెడుతుంది. ఆ కుటుంబంలో భర్త, అతని తల్లి, తండ్రీ వుంటారు. ఎన్నో ఆశలతో ఆ ఇంటికొచ్చిందని ఆమె మెరిసే కళ్లు సాక్ష్యం చెబుతాయి. ఒకటి రెండు రోజులు ఆమె ఆశల పల్లకిలో ఊయలలూగుతుంది. మూడవరోజు సంతోషంగానే వంటగదిలో అత్తకు అసిస్టెంటుగా మారిపోతుంది. ఇంటి మగాళ్ల అభిరుచికి తగ్గట్టు ఏ వంట ఎలా




వండి పెట్టాలో నేర్పుతుంది అత్త. వేడి వేడి దోస పెనం మీంచి ప్లేట్లో పడాలంటే, పొయ్యి దగ్గర్నుంచి డైనింగు టేబుల్ దగ్గరికి ఎంత తొందరగా పరుగెత్తాలో కొత్త కోడలు నేర్చుకుంటుంది. మామగారికి మిక్సీలో చేసిన పచ్చడి గానీ, ప్రెషర్ కుక్కర్ అన్నం గానీ నచ్చదు. అందుకని ఆధునిక పరికరాలు వున్నా, రుబ్బురోలు, పచ్చడిబండ, కట్టెల పొయ్యితో కుస్తీ పట్టక తప్పదు. మామగారి బ్రష్‌కు పేస్టు రాసి అందించాలి, బయటికి వెళ్లాలంటే కాలి వద్ద చెప్పులు పెట్టాలి. యోగాతో కొడుకూ, మొబైల్‌తో మామా కాలక్షేపం చేస్తూ వుంటే, ఆడాళ్లు ఎప్పుడూ ఏదో ఒకటి వండి పెడుతూ, కనీసం తినడానికి కూడా తీరిక లేకుండా పరుగులు తీస్తూ వుంటారు. ఈలోగా కథలో మలుపు. గర్భవతి అయిన కుమార్తె ఇంటికి అత్త వెళ్లాల్సి వస్తుంది. 'గ్రేట్ ఇండియన్ కిచెన్' బాధ్యతంతా కోడలి మీద పడుతుంది.

ఇంటిపనిలో పరకెత్తు సహాయం కూడా చేయకూడదన్న పట్టింపు మగాళ్లది. చీకేసిన మునక్కాడలు కూడా టేబుల్ మీదే పడేసి, ఆడవాళ్లకు పనిభారం పెంచేసే పాడుబుద్ధులు ఆ మగవారివి. హొటల్లో చూపించే టేబుల్ మేనర్స్ ఇంట్లో పాటించవచ్చు కదా అని భయపడుతూనే అన్నందుకు భార్య సారీ చెప్పే దాకా తగ్గని పంతం ఆ భర్తగారిది. కొత్త కోడలు డాన్సు టీచరు పోస్టుకు అప్లై చేస్తానంటే మామ నుండి గానీ, భర్త నుండి గానీ పర్మిషన్ లభించదు. పాడైన సింకు గొట్టం రిపేరు చేయించే బాధ్యత కూడా తీసుకోని భర్త. పదిసార్లు చేతులూ, మొహం కడుక్కుని పక్కలోకి వచ్చినా ఇంకా వొంటి నుండి వంటగది వ్యర్థాల దుర్వాసన పోనట్టు ఆ భార్య సతమతమౌతూ వుంటే, ఆ భర్త ఆమె ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా తనక్కావలసినది తోడుకుంటూ వుంటాడు. తనకు ఆ పని బాధగా వుంటోంది కనుక, 'ఫోర్ ప్లే' అవసరమని అంటే, అలాంటి సంగతులు ఆడవారికి తెలియడమే పెద్ద నేరమన్నట్టు ఆ భర్త పేచీ పెడతాడు. 'ఆర్గాజం' అంటే ఏమిటో

తెలీకుండానే చాలామంది ఇండియన్ భార్యలు జీవితాలు చాలిం చేస్తుంటారు అన్నది నేటికీ ఒక కటిక వాస్తవం. బహిష్టు సమయంలో స్త్రీలు మలినపడతారు కనుక, వారి చేతి వంట తినకూడదు గనుక, ఆ సమయంలో వంటగదిలోకి వెళ్లకూడదు. వేరే పనిమనిషి వచ్చి వంటచేస్తుంది. తను మరో 'ఒంటరి ఖైదు' లాంటి చిన్న గదిలోకి మారాలి. అక్కడ చాప మీద కూడా నిద్రపోడానికి వీల్లేదు. ఇదిలా వుంటే భర్త అయ్యప్ప మాల వేసుకుంటాడు. ఆ సమయంలో భార్య అతడి కంట పడడం కూడా ఆమె నేరమే అన్నట్టు వుంటుంది అతడి ప్రవర్తన. లోలోపల మరుగుతున్న లావా ఓ రోజున పెళ్లుబుకుతుంది. సింకులోని నిలువ నీరు ఆ మగమహారాజుల మొహాలమీద కుమ్మరించి తను బంధ విముక్తురాలౌతుంది. ఆమె కోరుకున్న ఉద్యోగాన్ని ఆమె సాధించు కుంటుంది. ఆమెకిష్టమైన ఆ వృత్తిలో ఆమె సృజనాత్మకత పొంగిపొరలి బయటికి వస్తుంది. తన విద్యార్థినుల శక్తిమంతమైన నృత్య ప్రదర్శనకు మెచ్చుకోలుగా చప్పట్లు కొడుతూ, సంతృప్తిగా ఆమె ఊపిరి పీల్చుకుంటుంది. అక్కడ ఆమె భర్త మరో పెళ్లి చేసుకుని, రెండో భార్యతో వంటగదిలో సరసమాడుతూ 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్' కోసం ఆమెను సిద్ధం చేస్తుంటాడు.

## సినిమా నిర్మాణరీత్యా బాగున్న అంశాలు :

**'తొండిముత్తాలుం దృక్షాక్షియుమ్', 'చోళ'** వంటి సినిమాల్లో తన అద్భుత నటనతో ఆకట్టుకున్న నిమిష కోడలి పాత్రలో అద్భుతంగా నటించింది. కొత్త కోడలు ఆ ఇంటికొచ్చిన కొత్తలో సంతృప్తికరమైన వదనం నుండి మెల్లమెల్లగా ఆ ఇంట్లో తన స్థానమేమిటన్న సందేహం ప్రవేశిస్తుండం, అలా అలా అక్కడ వుండడం అసహనీయం అనే దశ వరకూ ఆమెలో వచ్చిన మార్పులన్నీ ఆమె తన ముఖ దర్పణంలో అద్భుతంగా ప్రతిఫలించింది. ఛాయాగ్రహకుడు సాలూ జె థామస్ పనితనం కూడా చాలా ప్రశంసించదగ్గది. బహుశా వంటగదిని ఒక బందిఖానాగా చూపిన మరో గొప్ప సినిమా ఇంకోటి లేదేమో! కూరగాయలు తరగడం, నూరడం, రుబ్బడం, వేపడం, దోసె పోయడం, తాలింపు వేయడం, సింక్‌లో అడ్డుకున్న చెత్తను చేత్తో కెలికి తీయడం వంటి దృశ్యాలన్నీ క్లోజప్‌లో చాలాసార్లు కన్పిస్తాయి. మొదట్లో స్లోగానూ, తర్వాత్తర్వాత త్వరితంగానూ కన్పిస్తాయి. ప్రతిసారీ ఫ్రేమ్‌లో కనిపించే రెండు చేతులూ ఎవరివో మనకు తెలుస్తూనే వుంటుంది. డైనింగ్ టేబుల్ టాప్ యాంగిల్ షాట్, సింకు దగ్గర వంటగిన్నెల గుట్టలు – ఇలా దృశ్యాల రిపిటీషన్ ద్వారా పాత్ర పరిస్థితిని ప్రేక్షకుడు అనుభవించేలా చేశాడు దర్శకుడు. నేపథ్య సంగీతం ఉండదు. అన్నీ వంటింటి ధ్వనులే భయంకరంగా వినిపిస్తుంటాయి. ఆమె వంటింట్లో వున్నంతసేపూ సినిమాలోని అధిక భాగం మసక వెలుతురులోనే నడుస్తుంది. ఆమె ఆ యింటి నుండి బయటపడి వెళుతున్నప్పుడు, ఆ తర్వాత డాన్స్ సీక్వెన్సు చాలా బ్రైట్‌గా కన్పిస్తాయి. ఆమె ఆ ఇంటి నుండి వచ్చి రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతున్నప్పుడు నేపథ్యంలో ఇంటి పని బానిసత్వంలో మగ్గుతున్న వేరే క్యారెక్టర్లు కన్పిస్తారు. ఉద్యోగం కోసం అప్లై చేస్తున్నప్పుడు ల్యాప్‌టాప్‌కు కాంట్రాస్టుగా కట్టెల పొయ్యి చూపడం చాలా అర్థవంతంగా వుంటుంది. అలానే ఈ సినిమాలో ఉపయోగించిన ఒక చిన్న పాట కథానాయకురాలికి చాలా యిష్టమైన బుల్లి స్నేహితురాలు, తన కోసం 'తమ' కథను వినిపిస్తున్నట్టు వుంటుంది.

సూరజ్ సంగతి వేరే చెప్పనక్కర లేదు. సినిమాలో అతడు భయంకరమైన విలన్ కాడు. భార్యను కొట్టి తిట్టే రకం కాదు. కానీ, ఆడ, మగ శ్రమ విభజన ఎలా వుండాలో తన తల్లిదండ్రుల నుండి నేర్చుకుని, అదే సహజమని నమ్ముతున్నవాడు. స్త్రీలు సెక్సులో చొరవచూపడమన్నది ఆ అగ్రవర్ణ పురుషాహంకారికి జీర్ణంకాని విషయం. పైగా అతడిపై హిందూత్వ పార్టీ స్నేహితుల ప్రభావం కూడా వున్నదని కథలో తెలుస్తూనే వుంది.

## కథనంలో చిన్న లోపాలు :

సినిమా మొదటి భాగంలో వున్న అందం కొంత ఆఖర్లో సడలింది. ఆ పాత్ర సమస్యను సమాజంలోని బృహత్తర సమస్యకు అన్వయించడానికి శబరిమల సంఘటనను కథలోకి తెచ్చినప్పుడు కథనంలో ఉన్న ట్యూన్ కొద్దిగా దారి తప్పిందనిపిస్తుంది. స్త్రీలు అపవిత్రులు అన్న విషయం అక్కడ గుడి ప్రవేశం విషయంలోనూ, రుతుస్రావంలో వున్న స్త్రీలు ఇక్కడ ఇంటిలోకీ, తులసి చెట్టు వద్దకూ రావడంలోనూ ఒకేరకమైన విధి నిషేధాలున్నాయని దర్శకుడు చెప్పదలుచుకున్నాడు. నిమిష తను ఆ యింటి నుండి బయటకు వచ్చేసిన తర్వాత ఆమెకు రావాల్సిన ఉద్యోగం రావడం, ఆమె కథ సుఖాంతం అయినట్లుగా చూపడం జరిగింది. అయితే అది యాదృచ్ఛిక ప్రత్యేక సంఘటన మాదిరి అనిపిస్తుంది. కానీ సాధారణంగా ప్రతి ఒక్కరి విషయంలోనూ అలా జరగదు. చాలా పెద్దింటివారు గనుక, కోడలి బహిష్టు సమయంలో మరో పనిమనిషిని పెట్టుకోగలిగిన ఆర్థిక స్తోమత కల కుటుంబం కనుక, వారు సాధారణంగానే ఒక పని మనిషిని పెట్టుకునే అవకాశం వుంది, కనీసం అంట్లు తోమడంకోసమైనా! కానీ కథను క్లైమాక్సును చేర్చడానికి మొత్తం పనిభారాన్ని కోడలి మీద మోపారు. అలాగే వ్యవస్థీకృతమైన దోపిడీ పీడనల సమాజంలో ఒంటరి పోరాటం వ్యవస్థను మార్చలేదు. అయితే ఇలాంటి చిన్న చిన్న లోపాలు వున్నా, ఈ సినిమా గొప్పతనం ముందు అవి చాలా చిన్నవి. కేవలం కేరళ వాళ్లే ఇంత సాహసవంతమైన సినిమాలు తీయగలరా అని అనిపించే సినిమా.

## స్త్రీ పురుష అసమానతలు ఎలా తొలగుతాయి?

పురుషులు బయట చేసే పనికి 'శ్రమశక్తి విలువ' లేక 'జీతం' రావడమూ, స్త్రీ ఇంటి వద్ద చేసే పనికి జీతం వంటిది రాకపోవడమూ స్త్రీపురుషుల అసమానతలకు ముఖ్య కారణం. స్త్రీలు బయటిపనుల్లోకి రావడమూ, పురుషులు కూడా ఇంటి పనుల్లోకి రావడమూ జరగాలి. పురుషాధిక్యత అనేది శ్రమ సంబంధాల్లో వున్న అసమానత వల్ల ఏర్పడింది. స్త్రీపురుషుల సామాజిక సంబంధాల్లో ఉన్న అసమానత శారీరక సంబంధాల్లో కూడా ప్రతిఫలిస్తుంది. ఈ అంతరాలు తొలగిపోయి, స్త్రీ పురుషుల మధ్య స్నేహపూరితమైన దాంపత్య సంబంధాలు ఏర్పడాలంటే, దోపిడీ ఉత్పత్తి సంబంధాలపై పోరాటం జరగాలి. సమగ్రంగా సామాజిక వైరుధ్యాలు పరిష్కృతమౌతున్నప్పుడు కుటుంబం అనే యూనిట్‌లోని అసమానతలు, వైరుధ్యాలు కూడా తొలగిపోతాయి. సినిమాలాంటి కళారూపాలు ఇంత సమగ్రమైన చర్చ చేసే అవకాశం వుండకపోవచ్చు. కానీ అవి బృహత్తర సమస్యలోని ప్రత్యేక అంశాలపై ప్రేక్షకులను సెన్సిటైజ్ చేయగలగాలి. అటువంటి ఒక కర్తవ్యం ఈ సినిమా నెరవేర్చిందని చెప్పవచ్చు. ✺

క
ర
ప
త్రం

# విద్యార్థులు ఉక్కు సంకల్పంతో పోరాడి సాధించిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరించడానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

*మిత్రులారా!*

"విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు" అన్న నినాదంతో కాలేజీలు, స్కూళ్ళని వదిలిపెట్టి, తరగతులను బహిష్కరించి బందులు, ధర్నాలు, సమ్మెలు, సభలతో నిరవధిక నిరాహార దీక్షలతో ఆనాటి విద్యార్థి యువతరం పోరాడింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఒక్క విశాఖ ప్రాంత ప్రజలే కాక ఆంధ్ర రాష్ట్రమంతా ఈ పోరాటంలో భాగస్వాములయ్యారు. పోరాటం ఉధృతమవుతున్న దశలో 1966 నవంబర్ 1వ తేదీన జరిగిన పోలీసు కాల్పుల్లో తొమ్మిదేళ్ళ బాలుడితో సహా 32 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా పరిశ్రమ ఏర్పాటుకు 1971లో 64 గ్రామాల పరిధిలోని 22 వేల ఎకరాల భూమిని సేకరించి శంకుస్థాపన చేశారు. ఇది జరిగిన 20 ఏళ్లకి ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమయ్యింది. ప్రస్తుతం వ్యూహాత్మక అమ్మకం పేరుతో 3 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే భూములు, యంత్ర పరికరాలు కల్గి వున్న పరిశ్రమని, విద్యార్థులు, యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కారుచౌకగా అంబానీ, అదానీ, పోస్కో వంటి కార్పొరేట్ కంపెనీలకు అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నది.

ప్రస్తుతం పరిశ్రమలో 33 వేలమంది పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా విశాఖ ఉక్కు అనుబంధ పరిశ్రమల్లో, ఉక్కు ఉత్పత్తుల రవాణా తదితరరంగాల్లో లక్షమందికి పైగా ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం యిచ్చిన 4,896 కోట్లతో 1.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమైన ప్లాంట్ 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి స్వయంకృషితో అభివృద్ధి చెందింది. ఈ విధంగా 2003-2015 మధ్య కాలంలో కార్మికుల శ్రమతో అత్యధిక లాభాలను కూడా సాధించింది. ప్లాంట్ విస్తరణలో కానీ, నష్టాలలో వున్నపుడు కానీ ఎటువంటి సహాయ సహకారాలు అందించకపోయినా, పరిశ్రమ ప్రారంభంలో కేవలం నామమాత్రపు పెట్టుబడి పెట్టినందుకు గాను పన్నులు, డివిడెండుల రూపంలో 42 వేల కోట్ల రూ॥లను కేంద్రానికి చెల్లించింది.

వాస్తవానికి ప్లాంట్ నష్టాల పాలవ్వడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణం. మొదటిగా ప్లాంట్ ప్రారంభించి ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం సొంత గనులు కేటాయించలేదు. దీని వలన టన్ను 1000 రూ॥లు అయ్యే ఇనుప ఖనిజాన్ని 8 వేల రూ॥లు పెట్టి కొనే పరిస్థితికి నెట్టబడింది. సొంత గనులున్న ప్రయివేట్ కంపెనీల కన్నా అదనంగా 5 వేల రూ॥లు పైనే ఖర్చు చేస్తున్నది. ఈ విధంగా సొంత గనులు లేని కారణంగా కేవలం ముడిసరుకు కొనడం వలనే ప్రతి ఏటా 3,472 కోట్లు నష్టపోతున్నది. టాటా స్టీల్, జిందాల్, ఎస్సార్, అదానీల కంపెనీలకు, అసలు పరిశ్రమ ఏర్పాటు చేయలేని బ్రహ్మణి స్టీల్స్, పోస్కో లాంటి ప్రయివేట్ కంపెనీలకు గనులను కేటాయించి, అంతే కాక దేశంలోని ఇనుప ఖనిజాన్ని 80 శాతం చైనాకి కూడా ఎగుమతి చేస్తున్న పాలకులు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఉద్దేశ పూర్వకంగానే గనులు కేటాయించలేదు. అదే విధంగా విదేశాల నుండి దిగుమతి అయ్యే స్టీల్‌పై భారీగా సుంకాలు తగ్గిస్తూ (15 నుండి 7.5 శాతం) దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమలను చావుదెబ్బ కొడుతున్నారు.

1991లో మన దేశంలో ప్రవేశించిన నూతన ఆర్థిక విధానాల తీవ్రతను, పర్యవసానాలను మనమిప్పుడు చూస్తున్నాం. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయడం లేదా పెట్టుబడులను ఉపసంహరించటం అనేది పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయం నుండే ప్రారంభమైంది. తర్వాత వాజ్‌పేయి హయాంలో పెట్టుబడుల ఉపసంహరణ కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖనే ఏర్పాటు చేసి విదేశీ సంచార్ నిగమ్, మారుతీ సుజుకీ, ఓఎన్‌జిసి, బాల్కో, హిందుస్థాన్ జింక్ మొదలైన కంపెనీలలో 33,655 కోట్ల రూ॥లు భారీ ఎత్తున పెట్టుబడులను వెనక్కి తీసుకొని ప్రయివేట్‌శక్తులకు కట్టబెట్టారు. దీనికి కొనసాగింపుగా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం వివిధ రంగాల్లోని పెట్టుబడులు దాదాపు లక్ష కోట్లు ఉపసంహరించుకున్నారు. "అచ్ఛేదిన్ ఆయేగా..." అంటూ అధికారంలోకి వచ్చిన మోడీ తొలి పాలనలో 2 లక్షల కోట్లు పెట్టుబడులు వెనక్కి తీసుకోగా, 2021-22 తాజా బడ్జెట్‌లో జాతీయ హైవే అథారిటీ, రైల్వే, చమురు, సహజవాయువు సంస్థలను అమ్మి 1.74 లక్షల కోట్లను సేకరిస్తామని, యికపై ప్రభుత్వరంగ సంస్థలని ఉంచబోమని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అణు ఇంధనం, అంతరిక్షం, రక్షణ, రవాణా, టెలీ కమ్యూనికేషన్, విద్యుత్, పెట్రోలియం, బొగ్గు, ఖనిజవనరులు, బ్యాంకింగ్, మైనింగ్, ఆర్థిక సర్వీసులను త్వరలోనే వేలం వేసి కార్పోరేట్‌శక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధంగా వున్నామని ప్రకటించారు.

దేశంలో రోజురోజుకీ నిరుద్యోగం పెనుభూతంలా పెరుగుతోంది. విద్యావంతులైన నిరుద్యోగులు 5 కోట్లకి పైగా ఉన్నారు. లాక్‌డౌన్ కారణంగా 15 కోట్లమంది వలస కార్మికులు, మరో 30 కోట్లమంది అసంఘటిత రంగాల్లో కార్మికులు ఉపాధి కోల్పోయారు. నిరుద్యోగ లేమితో వున్న యువకులకు, ఉద్యోగ భద్రత లేని కార్మికులకు భరోసాతో కూడిన జీవనోపాధిని చూపించాల్సిన ప్రభుత్వాలు ఆ పని చేయకపోగా, కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేయడం, ప్రభుత్వరంగ సంస్థలను ఏదో సాకు చూపి అంబానీ, అదానీ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నించడం దుర్మార్గం.


ఈ నేపథ్యంలో 32 మంది ప్రజల బలిదానం, 67 మంది ప్రతిపక్ష శాసనసభ్యుల రాజీనామా, విద్యార్థులు సాగించిన పోరాట ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం పేరుతో ప్రయివేటీకరించడానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువకులు పోరాడాలని, రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిడిఎస్ఓ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తోంది.

**డిమాండ్లు :**

- విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.
- స్టీల్ ప్లాంట్‌కు సొంత ఇనుప గనులు కేటాయించాలి.
- 2019లో పోస్కోతో జరిగిన రహస్య ఒప్పందాన్ని రద్దు చేయాలి.
- ప్లాంట్ ఏర్పాటులో, విస్తరణలో నిర్వాసితులైన వాళ్లకి ఉపాధి చూపించాలి.
- ప్రభుత్వరంగ పరిశ్రమలను ఏర్పాటు చేసి,యువతకు భద్రతతో కూడిన ఉపాధిని కల్పించాలి.

**ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ**
**(P D S O), ఆంధ్రప్రదేశ్**

# తుర్లపాటి కుటుంబరావు మరణం



ప్రసిద్ధ జర్నలిస్టు, వక్త, తుర్లపాటి కుటుంబరావు తన 89వ ఏట విజయవాడలో 10.01.2021న మరణించారు. ఆయన 10.08.1933లో జన్మించారు.

2002లో పద్మశ్రీగా గౌరవింపబడిన తుర్లపాటి తొలి తెలుగు జర్నలిస్టు. 1947లో తన 14వ ఏట 'మాతృభూమి' (22-3-1947) వ్యాసంతో ప్రారంభమైన ఆయన పాత్రికేయ జీవితం చివరివరకు కొనసాగింది. 1951లో ఎన్.జి.రంగా నడిపిన 'వాహిని'కి ఉపసంపాదకునిగా చేశారు. 'ప్రతిభ'కు ఎడిటర్‌గా వున్నారు. ప్రకాశం పంతులు నడిపిన 'ప్రజాపత్రిక'కు సహాయ సంపాదకునిగానూ, ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగానూ, 1960-1963; 1965-1991 వరకు 'ఆంధ్రజ్యోతి'లోనూ పనిచేశారు. 1960లో ప్రారంభించిన 'వార్తలలోని వ్యక్తి' రోజువారీ శీర్షికగానూ, ఆ తర్వాత వారం వారం శీర్షికగానూ 1991 వరకూ - మొత్తం 50 ఏళ్ళపాటు నిర్వహించి, 4000 వేలమందిని పరిచయం చేశారు. వక్తగా 20 వేల సభల్లో పాల్గొన్నారు. జాతీయ చలనచిత్ర అవార్డుల కమిటీ సభ్యునిగానూ, జాతీయ చలనచిత్ర సలహామండలిలోనూ, కేంద్ర చలనచిత్ర సెన్సార్ బోర్డు సభ్యునిగానూ పనిచేశారు. తన స్వీయచరిత్రను 'నా కలం - నా గళం' పేరుతో ప్రచురించారు.

కవిత

# తుడుస్తావా?

**- శ్రీ వశిష్ఠ సోమేపల్లి**

అణుగుతున్న బతుకుల వెతలు చూడమంటే
చరిత్ర మడతల్లో
పాచిన నెత్తుర్ని చూపిస్తావు
అన్ని రక్తాలూ ఒకటి కాదంటావు

ఇంటికొచ్చిన బిర్యానీ
స్నేహం వాసన్ల సంగతి చెప్తే
ఎన్నెన్నో గీతలకవతల
ఎవరో విసిరే రాళ్ళ కథ చెప్తావు

విడతీసి విరగ్గొట్టబడిన వర్గాలు
ఇంకా విరిగే వున్నాయంటే
ఇది వెలిగే కాలమంటావు
జరిగిన కాలంతోపాటే
పగుళ్ళూ కరిగాయంటావు
కానీ తెల్లారున
విరిగిన విగ్రహం పక్కన
రాయిగా మళ్ళీ కనిపిస్తావు
ఓ సారి అటు చూడు
చిరిగిన జెండా
గుండెలు తెగిన జెండా నాలుకపై
శవాల లెక్కలు నానినన్నాళ్ళూ
పగని బరువుగా నేసినన్నాళ్ళూ
కలిపే దారం తెగుతూనే వుంటుందని
గొంతు చించుకుంటోంది

అదిగో మళ్ళీ చూడు
తడిచిన జెండా
ఏడ్చి ఏడ్చి నానిన జెండా
నువ్వు మతం పూసిన అంకెగానే
మిగిలిపోతావేమోనన్న బాధతో
ఏడ్చి వరదై మునిగిన జెండా
కళ్ళు తుడిచే చేతివవుతావేమోనని
ఎదురు చూస్తోంది

కవితలు

# శవాలు మాట్లాడుతున్నాయి...!

- డా॥ నెమిలేటి

అవును...
శవాలు మాట్లాడుతున్నాయి
దేశదేశాల్లో అదృశ్య శత్రువుతో
పోరాడి....పోరాడి... ఓడిపోయి
మృత్యు కౌగిట్లో నిదురిస్తున్న
శవాలు మాట్లాడుతున్నాయి!

ఎవరు చేసిన పొరపాటో గ్రహపాటో
ఈ భూమాతకు గర్భ శోఖమే మిగిల్చిన వేళ
జాతి, భాష, లింగ బేధం మరచి
ఇప్పుడు ఏక కంఠంతో
శవాలు మాట్లాడుతున్నాయి!

అగ్రరాజ్యం అంటూ విర్రవీగినోడూ
అణుబాంబును గుప్పెట్లో పెట్టుకుని బెదిరించి నోడూ....
పెట్రోల్ డీజిల్ బావులతో ఈ విశ్వాన్నే
శాసించాలని భ్రమించినోడూ
అందర్నీ.. అందర్నీ. ఒకే ఒక్క సూక్ష్మ జీవి
చెడుగుడు ఆడుతూ చావు బెత్తంతో అదిలిస్తుంటే
దుఃఖమతి భూమాతను పరిశుద్ధి చేస్తున్న వేళ
శవాలు మాట్లాడుతున్నాయి!

మనిషి తన వికృత చేష్టలతో
పుడమి తల్లి నుదిటిపై రుధిర తిలకం దిద్దుతుంటే
కంటికి కానరాని కరోనా
మానవ ఊపిరులు ఊదేస్తుంటే
రహదారులన్నీ ప్రశాంత వనాలుగాను
జంతు జాలం నిండు స్వేచ్ఛగానూ
తిరుగాడుతుంటే మనిషి కలుగులో ఎలుకలా
ఊపిరాడక చావు గూటికి చేరుతున్న వేళ
బడి గుడి గంటలు మూగబోయాయి
నదీనదాలన్నీ సహజశిద్ధంగా శుద్ధి అవుతున్న వేళ
శవాలు మాట్లాడుతున్నాయి!

ఈ సంధి కాలంలో
మానవ మనుగడకు
వైద్యులు నర్సులు పోలీసులు
పారిశుధ్యకార్మికులే
ప్రత్యక్ష దైవ రూపాలెత్తిరి జగతిలోన
పరిశుభ్రత క్రమశిక్షణలే
ఈ లోక రక్షణ కవచాలైన వేళ
శవాలు మాట్లాడుతున్నాయి
ఆ శవాల సాక్షిగా జనం కోసం
ప్రాణాలొడ్డి పోరాడుతున్న వారందరికీ
పాదాభివందనం చేద్దాం!

# చలిబట్టల రైతోడు

- టి. ఉదయ్

ఎండా ... వానా ... చలి ...
ఏదైనా లెక్కచేయని జీవుడు రైతోడు...అతగాని సైజోడు
అరక భుజానపెట్టుకుని నడుస్తూ సూరీణ్ని పలకరించి
చూస్కో నీకన్నా ముందే నా పనిలోనే పడ్డానంటాడు
నీ ఛాయమ్మ ఎక్కడో గానీ నా ఇంటిది నాకంటే
ముందుగాలే లేసేస్తది
ఏడిఏడి వొణ్ణమై ... అది నిండిన టిపినయి నా ఎంటొస్తాది
ఎండకాస్తే చెమటే నా సొక్కా అంటాడు
వానొత్తే వానధారలే నా అంగీ అనేస్తాడు
చలా... చలి నా సెట్టరేనహె అంటూ తలెగరేస్తాడు
ఆరుగాలం నా ఆరుపానాలురా నాయనా అని
నూర్పుడుబల్ల గుద్దిమరీ చెబుతాడు
అతగానికి తెల్వంది పతేడూ డిసెంబర్నెల ఇరవైమూడు
రైతుదినోత్సవమని తెల్వదు
రైతన్నదినం ఉత్సవాలు చేసుకునే దేశాలేలేటోళ్లకు
పండగేనంటాడు
చలిచొక్కా తొడుక్కుని దేశపుగుండె శివార్లలో కూకున్నోళ్లంగా
మాకూ పండగేనంటాడు పంజాబునుంచొచ్చిన
తలపాగా సూర్జితయ్య...
చలిపులిపై సవ్వారీ చేస్తా వచ్చిన అయ్యప్పలమంటున్నాడు
పండించిన పంటను బస్తాలుగా మోసీ, మోసి...
మోసిన ట్రాక్టర్లే గుడిసెలైన వేళ
నినాదాలే నెగడుమంటలుగా చలికాచుకుంటూ
నిరసనల కల్లాపి చల్లి పోరు రంగవల్లులవుతూ
చలిగాడితో పందెంవేసుకుంటూ నెచ్చెలిగాళ్లతో
పదం పాడుకుంటూ
మూడు ఉరితాళ్లయి మీదిమీదికొస్తున్న
రైతురాబందులను అదిలిస్తూ
ఇదీ మాకు పండగే నంటున్నాడు
ఇదే మా క్రిస్టమస్, మిలాదున్నబీ, సంక్రాంతి, ఖాల్సా బైశాఖీ
చలంటా ఛలి... ఢిల్లీ శివార్లలో మా పోరుకేకల ముందు
చలి పాలోమంటోందంటున్నాడు
ఆడురా రైతంటే ... అద్దిరా పండగంటే
చలిబట్టల రైతన్నల సంక్రాంతి అంటే
మట్టి పిడికిళ్ళ ధిక్కార క్రాంతి!!

(జాతీయ రైతుదినోత్సవమట....
ఆ పేరుతో దినం పెట్టొద్దని మైనస్డిగ్రీ చలిలో పోరుపండుగ చేస్తున్న
రైతాంగానికి ఈ నా అక్షరాలు)

కథ

# బెత్తం..... ప్రేమను దూరం చేస్తుంది

– మంచికంటి

**ఇంటికి** వచ్చినప్పటి నుండీ అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్న ఆయన్ను చూసి ఆమెకు భయం వేసింది. ముందు స్థిమితంగా కూర్చుని టీ తాగండి అంటూ టీ కప్పు అందించిందామె. అతని భార్య.

టీ కప్పు తీసుకుని కుర్చీలో కూర్చుని టీ తాగసాగాడాయన. ఆమె కూడా అతని పక్కనే కూర్చుంది. అతనితో మాట్లాడాలంటేనే భయమేస్తుందామెకు అతని మొహంలోకి చూస్తూ "ఏమండీ అసలే జబ్బు మనిషి మీరు. ఇంతగా ఆందోళన పడితే ఏమవుతుందో తెలుసా! ఎప్పుడూ పిల్లల్ని గురించి వాళ్ళ చదువుల గురించే ఆలోచిస్తున్నారు. ఈ మధ్యెందుకో మరీ ఎక్కువగా ఆందోళన పడుతున్నారు. ఈరోజేతే మరింతగా బాధపడుతున్నారు. ఇంతగా ఆలోచించకూడదు, ఎలాగూ చెయ్యాలనుకున్న పని చేసుకుంటూ పోతున్నారు కదా! ఏం చెయ్యాలన్నా ముందు మనం బాగుండాలి కదండీ" ఓదార్పుగా చెప్పిందామె.

"ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండాలని నాకూ తెలుసు. అయితే పిల్లలు పడుతున్న బాధలు చూస్తే కడుపు తరుక్కుపోతుంది. ఆ లేత ప్రాయంలో సరైన చదువు అందకపోతే వాళ్ళ భవిష్యత్తు ఏమైపోతుందో నాకు తెలుసు. నేను చదువుకునేటప్పుడు ఎన్ని అవస్థలు పడ్డానో! ఎన్ని సమస్యల సుడిగుండాలని ఈదుకుని బయటపడ్డానో! సరిగ్గా చదవడం లేదని మాష్టార్లు గొడ్డుని బాదినట్టు బాదేవాళ్ళు. ప్రతి దానికీ కర్ర తీసుకుని కొట్టడమే. ఒక్క మాష్టారన్నా ఆప్యాయంగా నాతో మాట్లాడి.... నా సమస్యల గురించి అడిగితే బాగుండు అనుకునేవాణ్ణి. అయినా ఎవ్వరూ అడగలేదు. మా స్కూల్లో కూడా ఆ రోజుల్లో ఎక్కువ భాగం కష్టాలూ కడగండ్లలో నుంచి వొచ్చిన టీచర్లే ఉన్నారు. కానీ పిల్లల గురించి ఎందుకు పట్టించులేదో అర్ధం కాదు. అందరిలోనూ ఒకటే తపన.... ఏంటో ఆ తపన..... దేని గురించి పరెగెత్తుతున్నారో అర్ధం కాదు.

గడిచిపోయిన కాలమే కొంత మేలని పిస్తుంది. ఒకసారి కొట్టినా, తిట్టినా ఆ రోజుల్లో మనుషుల్లో ప్రేమా ఆప్యాయతలూ ఉండేవి. అభిమానమూ వాత్సల్యమూ ఉండేది. ఇప్పుడివి కలిక్కానికి కూడా కానరావడంలేదు. బాదడం బాదడం... గొడ్డుని బాదినట్లు బాదడం .... చిన్నదానికీ పెద్దదానికీ.... అయిందానికీ కానిదానికీ బాది పారెయ్యడమే. ఈ తతంగం చూస్తుంటేనే విరక్తి పుట్టిపోతుంది. ఆయన బాధ రెట్టింపయ్యింది. గొంతుగాద్గదికమయ్యింది. కళ్ళ వెంట కన్నీరు ధారకట్టింది.

ఆందోళనగా పైకి లేచిందామె. అతని దగ్గరగా వొచ్చి తలపై చేతితో నెమ్మదిగా నొక్కుతూ 'మీరు కొంచెం స్థిమితపడండి. మీరు చెయ్యాల్సిన దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువగా చేస్తున్నారు. అందర్నీ మీలాగే ఆలోచించమంటే ఆలోచిస్తారా చెప్పండి. అందరూ మనలాగా బరువుని నెత్తికెత్తుకోమంటే ఎత్తుకుంటారా! మీ పిచ్చిగాకపోతే' కణతల దగ్గర నెమ్మదిగా మర్దన చేస్తూ చెప్పింది.

'అది కాదు చంద్రా! మన ప్రయత్నం మనం చెయ్యాలిగా! ప్రయత్నిస్తూ పోతే ఎవరిలోనైనా కొంచెం గాకుంటే కొంచెమన్నా మార్పు తీసుకురావొచ్చు కదా! మొట్టమొదట ఉద్యోగంలో చేరినప్పుడు నేను కూడా అందరిలాగా ఉండేవాడిని, ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే నాకే బాధేస్తుంది. నా దగ్గర చదువుకున్న పిల్లలు అప్పుడప్పుడూ కనపడుతుంటారు తామేం పని చేస్తున్నారో, ఎలా ఉన్నారో చెబుతుంటే నాకే సిగ్గనిపిస్తుంది.

'ఆ రోజుల్లో నాక్కూడా పిల్లల్ని అర్ధం చేసుకుని చదువు ఎలా చెప్పాలో తెలిసుంటే వాళ్ళు ఆ స్థితిలో ఉండే వాళ్ళా అనిపిస్తుంది. నా దగ్గర చదువుకున్న వాళ్ళు ఎంతో మంది ఆటోడ్రైవర్లు, మెకానిక్‌లు, కూలిపనివాళ్ళు అయ్యారు. ఒకడైతే జులాయిగా తిరుగుతూ వీధి రౌడీగా మారాడు.

"నిజంగా వీళ్ళంతా తెలివి లేనివాళ్ళా! చదువు రానివాళ్ళా! ఎందుకూ పనికిరానివాళ్ళా! కాదే ప్రతి పిల్లవాడిలోనూ అద్భుత శక్తులుం టాయని కదా శాస్త్రం చెబుతుంది. అలాంటి అద్భుత శక్తుల్ని తట్టి లేపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే కదా! సమాజంలో వున్న అసమానతల్ని, అస్తవ్యస్థంగా వున్న జీవితాల గురించి వివరించి చెప్పి సామాజిక బాధ్యతని నేర్పించటానికి వాళ్ళను దగ్గరకు తీసుకోవాలి గదా! ఆ రోజుల్లో అలా చెయ్యకపోవడంవల్లే నేను చదువు చెప్పినవాళ్ళు కూడా అలా తయారయారు". ఆయన బాధ తారాస్థాయికి చేరింది. భోరుమని ఏడ్చేశాడు.

"ఊరుకోండి, చిన్న పిల్లాడిలా ఏంటది? ఇంత ఉద్రేకపడిపోతే బీపీ ఇంకా పెరిగి పోతుంది. కొంచెం నిదానంగా ఉండండి. మీరు ఎంత ప్రశాంతంగా ఉంటే అంత బాగా పనిచెయ్యగలరు. మీరు చెయ్యగలిగినంత చెయ్యండి అవతల వాళ్ళకూ చెప్పండి. చేస్తే చేస్తారు లేకుంటే లేదు".

"లేదు లేదు చెప్పగా చెప్పగా కొందరిలో కొంతైనా మార్పు వస్తుంది కదా! "రేపు మీటింగ్ పెట్టాలి. నేను ముఖ్యంగా చెయ్యాలనుకున్న పనుల గురించి చెప్పాలి" తనలో తనే అనుకున్నాడు. అప్పటికి గానీ కొంత స్థిమిత పడలేకపోయాడాయన.

"ఇదిగో బీపీ మాత్ర. ఇది మింగండి ముందు. మీకేమన్నా అయితే పిల్లలూ, నేనూ ఏమైపోవాలి" మాత్ర అందించి నీళ్ళ గ్లాసు ఇచ్చింది. మాత్ర మింగి నీళ్ళు తాగాడు.

"అవతల పిల్లలు చదువులకొచ్చారు. అందరూ తమ పిల్లల గురించే ఆలోచిస్తారు. మీరేంటి మా స్కూలు, మా పిల్లలని ఆరోగ్యం కూడా చెడగొట్టుకుంటున్నారు."

"ఇంక లేవండి, పొద్దుబోయింది ప్రశాంతంగా పడుకోండి ముందు", చేయి పట్టుకుని, బెడ్‌రూమ్‌లోకి తీసుకు వెళ్ళింది.

"మన పిల్లలు ఎలాగూ చదువుతారు. పాపం వాళ్ళనెవరు పట్టించుకుంటారు" రేపు సమావేశం పెట్టాలి. అన్ని విషయాలు చెప్పాలి. తనలో తనే అనుకుంటూ బెడ్‌పై పడుకున్నాడు.

ఆయన పడుకున్నాడన్న మాటే గానీ, మరుసటి రోజు సమావేశం ఎలా ఉండాలి. ఏమి మాట్లాడాలి, ఎవరెవరికి ఏమేమి చెప్పాలి అనే ఆలోచనలతోటి కలవరింతలతోటే తెల్లవారింది.

ఉదయం లేచినప్పటి నుండీ బడికి వచ్చేంతవరకూ ఆలోచనలతో సతమతమై పోయాడు. మొదటి గంట రెండవ గంట కొట్టడం అసెంబ్లీ అయిపోవడం దాకా ఆయన ఉత్కంఠ కొనసాగింది.

అసెంబ్లీ అయిపోగానే ఆతృతగా తన రూమ్‌కు వెళ్ళాడు. టీచర్లందరూ వచ్చి సంతకాలు పెట్టి క్లాసులకు వెళ్ళారు. స్టాఫ్ ఆర్డర్ పుస్తకంలో ఉపాధ్యాయుల సమావేశం గురించి రాసి, అటెండర్‌తో అన్ని క్లాసులకు పంపించాడు.

ఉపాధ్యాయులందరూ పిల్లలకు హాజరు వేసి, సమావేశపు గదికి వచ్చారు. ఎవరెవరు వచ్చారో ఎవరు రాలేదో చూసుకోసాగాడు. అందరూ వొచ్చారని నిర్ధారించుకున్న తరువాత సమావేశ ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా మొదలు పెట్టారు. "ఎన్నో ఉపాధ్యాయుల సమావేశాలు జరిగాయి. ఇది మాత్రం ఎంతో ప్రత్యేకత సంతరించుకున్న సమావేశం", అని అందరివైపూ తేరిపారజూశాడు.

ఆ.... ఇట్టాంటివి ఎన్నో చూశాములేవోయ్ అన్నట్టుగా ఉన్నాయి మిగతావాళ్ళ చూపులు. "ప్రతి సమావేశంలోనూ ఎన్నో విషయాలు మాట్లాడుకుంటున్నాం. పిల్లల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తరగతుల్లో బాగా చదివేవాళ్ళ గురించే కాకుండా వెనుకబడినవాళ్ళు గురించి కూడా ప్రత్యేకంగా ఆలోచించాలి. వాళ్ళకు ఎన్నో సమస్యలు ఉంటాయి. వాళ్ళతో మాట్లాడడమే కాకుండా, వాళ్ళ తల్లిదండ్రులని కూడా పాఠశాలకు పిలిపించి మాట్లాడటం ద్వారా కూడా వాళ్ళలో 'అభివృద్ధి సాధించవచ్చు' అవునా హిందీ మాష్టారూ", అన్నాడాయన, మాష్టారు వైపు చూస్తూ.

సెల్‌ఫోన్లో వాట్సప్ బొమ్మలు చూస్తున్న హిందీ మాష్టారు తలెత్తి "ఆ ! అవునవును" తడబడుతూ చెప్పాడు.

'ఏమండీ! మనం పిల్లలకు సంబంధించిన ఎంతో ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నాము. ఈ కాసేపైనా ఫోన్‌ను పక్కన పెట్టొచ్చు కదా ! దయచేసి అందరూ ఫోన్లను సైలెంట్ మోడ్‌లో పెట్టుకోండి", అనడంతో అందరూ ఫోన్లు తీసి ఆ పనిలో మునిగిపోయారు.

సెల్‌ఫోన్లు లోపల పెట్టేవరకూ ఆగి, మళ్ళీ కొనసాగించాడు. 'చాలా రోజుల నుండి పిల్లల సమస్యల గురించి ఆలోచిస్తున్నాను. మేము ఆలోచించడం లేదా అని మీరనవచ్చు. మామూలుగా చదువు చెప్పడం వేరు. కొంచెం మనసు పెట్టి ఆలోచించి చెప్పడం వేరు ఖచ్చితంగా రెండింటి మధ్య వ్యత్యాసం ఉంది. ఇప్పుడు ఎక్కువ భాగం డ్యూటీ ప్రకారం వస్తారూ, పోతారు. దీనివల్ల ఇందాక చెప్పానే వెనుకబడిన పిల్లలు అని.... వాళ్ళు మన దగ్గరకు రారు. వాళ్ళు ఎంతో అత్మన్యూనతతో ఉంటారు. వాళ్ళకు కూడా చదువు చెప్పగలిగినప్పుడే మనం నిజంగా టీచింగ్‌లో విజయం సాధించినట్టు.

దీనికోసం ఒక ముఖ్యమైన ప్రతిపాదన చెయ్యబోతున్నాను. అందరూ వినండి', ఒక నిమిషం ఆగాడు.

'మనకూ పిల్లలకూ ఎంతో దూరం ఉంది. ఆ దూరం పెంచే వస్తువు ఒకటి ఎప్పుడూ మన చేతిలో ఉంటుంది. అదే బెత్తం. క్లాస్‌కు వెళ్తే ఇది మన చేతిలో తాండవమాడుతుంది. అలాంటి బెత్తం పిల్లలకు ఆయుధంగా కనిపిస్తుంది. ఆయుధం చేతిలో ఉంటే ఎవరైనా దగ్గరకు వస్తారా! అందుకే బెత్తాన్ని మన స్కూల్లో నిషేదిద్దాం', అంటూ అందరి ముఖాల వంక చూశాడు.

ఆ మాట వినడంతో ఒకరిద్దరు తలలు ఊపారు. అంతకు మినహా ఎవరిలోనూ స్పందన కనిపించలేదు. ఒకాయన తల గోక్కున్నాడు. ఇంకొకాయన 'హో' అని నిట్టూర్చాడు. మరికొందరు ఎకసెక్కంగా నవ్వారు. మొత్తం మీద అందరూ మౌనం వహించే ఉన్నారు.

"ఏమిటీ మీ అభిప్రాయం చెప్పండి" మళ్ళీ ఆయన మౌనాన్ని చేదించాడు.

"ఏమండీ ఇదేమన్నా మామూలు విషయమంటండీ", ముందుగా సైన్స్ మాష్టారు స్పందించాడు. "మీకేం చాలా తేలిగ్గా చెప్పారు. క్లాసుల్లోకి పోయి పాఠాలు చెప్పాల్సింది మేము. బెత్తం చేతిలో లేకపోతే ఒక్కడు మాట వింటాడండీ. కోతి వెధవలైతేనూ.... కర్ర చేతిలో ఉంటేనే మేము నెట్టుకొస్తున్నాం", ఊగిపోతూ చెప్పాడు సైన్స్ మాష్టారు.

"అవునవును, కుదరదంటే కుదరదండీ ఎలా కుదురుతుంది. భలే వాళ్ళే, అయ్యో అహహా" హిందీ మాష్టర్ కూడా వంత కలిపాడు.

"అది కాదండీ, తెలుగు మాష్టరంటే లెక్క చెయ్యని భడవలకు బెత్తం దెబ్బ తగలకపోతే క్లాసు నడపడం సాధ్యమేనంటండీ. హమ్మయ్యో అస్సలు వల్ల కాదంటే వల్ల కాదండీ" తెలుగు మాష్టారు ఘంటాపథంగా చెప్పాడు.

"నాకు తెలుసు మీ నుంచి స్పందన ఇలాగే ఉంటుందని బల్ల మీద బెత్తం లేకుండా క్లాసు జరగడం కష్టమంటారనీ తెలుసు. చేతిలో కర్ర లేకుంటే పిల్లల ముందుకు వెళ్ళలేరనీ తెలుసు. బల్లపైనో, పిల్లవాడి వీపు మీదనో కర్ర ఆడుతుంటేనే క్లాసులో మీరేం చేస్తున్నా.... ఏం చెబుతున్నా పిల్లలంతా నిశ్శబ్దంగా ఉంటారని మీరనుకుంటున్నారు.

"నిజం చెప్పాలంటే కర్రతో పిల్లల ఆలోచనల్ని ఆదిమేస్తున్నాం. వారికి తెలియని విషయాన్ని అడగకుండా, ఆలోచించకుండా తెలుసుకోకుండా ఈ బెత్తం నియంత్రిస్తుంది. ఏమీ రాని వాణ్ణి బాగా వొచ్చిన వాణ్ణీ కలిపి కూర్చోబెట్టి పాఠం చెబుతున్నాం.

"చదువు వొచ్చిన వాళ్ళే క్లాసులో ప్రతి దానిలోనూ ముందుంటారు. చదువు రానివాడు వెనక బెంచీ నుంచి వెనకకు వెళ్ళి స్కూలు నుంచే మాయమవుతున్నాడు.

"వాస్తవానికి పిల్లల మనసులు అర్దం చేసుకుంటే.... వాళ్ళకు ప్రేమను పంచితే ఈ బెత్తాలకు పనుండదు సార్", కళ్ళల్లో తిరిగిన సుదులను అణచుకుంటూ.... గుండెల్లో బాధను దిగమింగుతూ చెప్పాడాయన.

"సార్! మీరేదో గొప్ప మానవత్వంతో మాట్లాడుతున్నారు గానీ, క్లాసులకొచ్చి చూడండి. హోమ్‌వర్క్ చెయ్యని పిల్లల్ని బెత్తంతో కొట్టకుండా ముద్దు పెట్టుకోమంటారా", హిందీ సార్ అందుకున్నాడు.

"ఏమిటి హిందీ మాష్టారూ మీరు మాట్లాడుతున్నారా ! పదవ తరగతిలో హిందీ చదవడం రానివాళ్ళని చూయించమంటారా! ఐదు సంవత్సరాలు పిల్లలకి హిందీ నేర్పించినా రాలేదు. హోమ్‌వర్కు హోమ్‌వర్కు.... ఎవరి కోసం హోమ్‌వర్కు.... కొత్త సిలబస్‌లో హోంవర్కు కూడా క్లాస్‌లోనే చేయించాలని లేదూ! పుస్తకాలు తీసి ముందుమాటలు చదవండయ్యా ఏం చెయ్యాలో తెలుస్తుంది.

బూజు పట్టిన పాత పద్ధతుల్ని సాగదియ్యడం కాదు. ఇంటికి హోం వర్కు... ప్రాజెక్టు వర్కు మాత్రమే ఇవ్వాలి.

"మీరేం చేస్తున్నారు? క్లాసులో కూర్చుని గడగడా పాఠం ఒప్పజెప్పేస్తున్నారు. హోంవర్కు రాసుకురాండ్రా అని గైడ్లను ముందేస్తున్నారు. చదవడం రానివాడు కూడా గైడ్లు చూసి రాస్తున్నారు. ఎవరికోసం హోంవర్కు చెప్పండి. కేవలం నోట్స్‌లు రాస్తేనే సరిపోతుంది! చదువంటే ఏమిటి ? వాళ్ళ బుర్రల్లోకి కొద్దిగా అన్నా ఎక్కాలి కదండీ" ఆవేశంతో చెప్పాడు.

లెక్కల మాష్టారు పైకి లేచాడు. ఏదో చెప్పబోయేంతలోనే... ఆయనే అందుకున్నాడు. "ఏమండీ లెక్కల గైడ్లు ఎంతమందికి ఉన్నాయో మీరే చెప్పండి.

"ఊరుకోండండీ. మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటున్నారు. పిల్లల్ని మోసం చేస్తున్నారు. ఎంతమందికి సొంతంగా ఆలోచించి లెక్కలు చేసే శక్తినిస్తున్నామండీ. అదే మన పిల్లలైతే మనం ఊరుకుంటామంటండీ, నోరూ వాయీ లేని పిల్లలు, స్కూలు వంక కన్నెత్తి చూడని తల్లిదండ్రులు కాబట్టి మనం ఆడింది ఆట పాడింది పాటగా సాగిపోతుంది. లెక్కలు చెయ్యకుంటే వేళ్ళ మీద కొడుతున్నారని పిల్లలు చెబుతున్నారు. మీ పిల్లల్ని అలా కొడితే ఊరుకుంటారా! కర్రల్తోటి కొట్టే రోజులు పోయాయండీ. ఇప్పుడు ప్రక్రియలు, ప్రాజెక్టులూ, పరికల్పనలూ ముఖ్యం. దేన్నయినా పిల్లలు ఆలోచనలతో చెయ్యాలి.

"మన ఇంట్లో ఉండే ప్రతి వస్తువూ ఆధునీకరించబడుతుంది. ప్రతి విషయంలోనూ మార్పును కోరుకుంటాం మరి! చదువు విషయంలో మార్పు రాకుంటే ఎలా! జీవితానికి మూలమైన చదువును నిర్లక్ష్యం చేస్తే పుట్టగతులుండవ్ అవునా సైన్స్ మాష్టారు" అన్నాడు.

"ఇవన్నీ చెప్పటానికి బాగానే ఉంటాయి సార్. చేసే వాళ్ళకి తెలుస్తుంది బాధేంటో" వెటకారంగా అన్నాడు.

"బాధేనయ్యా బాధే, మెడమీద తన్నేవాడు లేడు కాబట్టి బాధే. అంత తేలిగ్గా తీసి పారెయ్యకండి. ఒకప్పుడు ఆర్టీసీ బస్సు రోడ్డు మీద ఆపాలంటే ఎవరి వల్లా అయ్యేది కాదు. ఇప్పుడు ఎక్స్‌ప్రెస్‌లైనా చెయ్యెత్తితే నడిరోడ్డు మీద ఆగిపోతున్నాయి. ఎందుకనీ వాళ్ళ ఉద్యోగాలకే ఎసరొచ్చింది కాబట్టి. సమాచార హక్కు చట్టం వొచ్చింది. అదొచ్చినప్పుడు ఏముందిలే అనుకున్నారు. ఇప్పుడు చూడండి అందర్నీ గడగడలాడిస్తుంది.

"అందుకని మనం గూడా కళ్ళు తెరిస్తే మంచిది. ఏం డ్రిల్ మాష్టరుగారూ ప్రేయర్‌కి రాకపోతే విజిల్ తాడుతో వాతలు పొంగిస్తారుగా! ఈ చట్టాలన్నీ తెలిశాయనుకో, మిమ్మల్ని తీసుకెళ్ళి అత్తారింట్లో కూర్చోబెడతాడు."

డ్రిల్ మాష్టరు నవ్వాడు.

"నవ్వడం కాదు మీ పద్ధతులు మార్చుకోండి. ఓర్పుగా చెప్పాలి. నేర్పుగా పనిచెయ్యాలి, మన దగ్గరకొచ్చే పిల్లలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ఎంతో వెనుకబడిన పిల్లలు. వాళ్ళకే చెప్పకపోతే ఎలాగా చెప్పండి. మనం ఎంతెంత జీతాలు తీసుకుంటున్నామో అందరికీ తెలిసిపోయింది. మనం ఎవ్వరికీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. ఒక్క మన అంతరాత్మకి తప్ప. ఎందుకంటే మనమేం చేసినా చెల్లుబాటైపోతుంది.

"పిల్లల చదువుల గురించి ఆడగాల్సిన వాళ్ళ పిల్లలు వేరే స్కూలుకు పోతున్నారు. వాళ్ళే గానీ మన బళ్ళకు వస్తే అప్పుడు మనం రంగు బయటపడేది. ఆ రోజు కూడా దగ్గర్లోనే వుంది జాగ్రత్త మీ ఇష్టం. కర్రతో ఒక దెబ్బ వేయించుకోండి తెలుస్తుంది బాధ. పిల్లలు నోరు లేనివాళ్ళు కదా! పెద్దక్లాసుల వాళ్ళు కూడా తెలుగు చదవడం రాయడం లేదంటే సిగ్గు చేటు కాదూ మనకి".

తెలుగు మాష్టరందుకున్నాడు. "సార్ వాళ్ళు ఎలిమెంటరీ స్కూల్లో చదవకుండా వచ్చినవాళ్ళు సార్", దబాయింపుగా చెప్పాడు.

"సరే అక్కడ చెప్పలేదు. మన దగ్గర ఐదు సంవత్సరాలుంటున్నారు. ఐదు సంవత్సరాల్లో తెలుగు నేర్పలేమా" నొక్కి నొక్కి అడిగాడయన.

"సార్! వాళ్ళని పట్టించుకుంటే సిలబస్ కావడం లేదు సార్".

''పోవయ్యా బోడి సిలబస్. ఎవడిక్కావాలయ్యా సిలబస్. సిలబస్ చెప్పడమంటే ఎనభై శాతం మందికి అవగాహన అయ్యేటట్టు చెప్పాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం సిలబస్ చెప్పడమంటే అది. అందరికీ అర్థమవుతుందా మీరు చెప్పే సిలబస్? మీరు చెప్పే పద్దతిలో అయితే ఒక్క నెల రోజులకి అయిపోతుంది సిలబస్". గ్లాసు తీసుకుని మంచినీళ్ళు తాగుతూ చెప్పాడు.

"ఇప్పుడు సిలబస్ మారింది. పద్ధతులు మారాయి. విద్యా హక్కు చట్టం వచ్చింది. ఇవాళ కాకున్నా రేపైనా ప్రజలకు తెలిసి వస్తుంది. అప్పుడు ఎలాగూ సమాజానికి సమాధానం చెప్పాలి.

"ఏమయ్యా ఇంగ్లీషు మాష్టారూ! మీకు బొత్తిగా ఇంగిత జ్ఞానం లేనట్టుంది. క్లాస్‌లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పాటలింటానికా క్లాసుకు పోయేది".

"అది కాదు సార్, అది ఫోన్ కోసం సార్. నేరుగా మాట్లాడితే రేడియేషన్ అనీ అలా...." నీళ్ళు నములుతూ చెప్పాడు.

"ఆ... ఆ... అందరికీ తెలుసులేవయ్యా, ఎవరైనా మీడియాకి ఉప్పందించారనుకో! శంకరగిరి మాన్యాలు పట్టి పోవాల్సిందే నువ్వు" ఎగతాళిగా అన్నాడు.

ఇంగ్లీషు సార్ తలదించుకున్నాడు.

"విద్యా హక్కు చట్టం ప్రజలకి తెలిసి, వాళ్ళు మన దగ్గరకొచ్చి, మన నెత్తి మీదకి ఎక్కక ముందే కొంచెమన్నా సర్దుకోవాలి. మనం ఇప్పుడే మేలుకున్నామనుకో! మనకే మేలు జరుగుతుంది. మార్పు దిశగా మనం పయనించాలి. అందుకే మొదటి అడుగేద్దాం. పిల్లల ప్రేమకు దగ్గర కావడానికి అడ్డంగా ఉన్న బెత్తాన్ని నిషేదిద్దాం. అందరికీ ఇది ఇష్టం లేకపోవచ్చు కానీ చట్ట ప్రకారం వాళ్ళను బెత్తాలతో కొట్టడానికి లేదు. కాబట్టి చట్ట ప్రకారమే బెత్తాన్ని వాడడానికి వీలులేదు.

"దీని వల్లనే మార్పు వస్తుందా అని చాలామందికి అనుమానం ఉండొచ్చు. దీనితో పాటుగా సమాజాన్ని అర్థం చేయించి వాళ్ళ బాధ్యతలను గుర్తెరిగేలా చేయాలి. దానికి ఒక్క విషయాన్ని అమలుచేస్తే చాలా మార్పులొస్తాయన్పిస్తుంది. బెత్తాన్ని నిషేధించడమంటే పిల్లలకూ, మనకూ మధ్య దూరాన్ని తగ్గించడం. దూరాన్ని తగ్గించడమంటే.. ప్రేమను పెంచడం. చదువనేది ప్రేమగా, ఆప్యాయంగా చెప్పాల్సింది. గురు శిష్యుల బంధం ఎంత గొప్పదో నిరూపిద్దాం...." అంటూ హెడ్ మాష్టర్ పైకి లేచాడు సమావేశం ముగిసిందని చెప్పడానికి సూచనగా. టీచర్లందరూ మోటివేషన్‌తో లేచి క్లాసులకు వెళ్ళారు. ✺

# వై.వి. రెడ్డి 3వ వర్ధంతి



**యర్రం వెంకటరెడ్డి** గొప్ప సామాజిక ఉపాధ్యాయుడు. ప్రజాస్వామికవాది. కష్టజీవుల పక్షపాతి. రాజీపడని ఆదర్శజీవి. ఆయన అధ్యాపకునిగా, ప్రిన్సిపల్‌గా పనిచేసిన నల్లగొండ, ఖమ్మం, కోదాడ, నాగార్జునసాగర్, తణుకు, రేపల్లె మొదలగు ప్రాంతాలలో వై.వి.రెడ్డిగా ప్రసిద్ధులు. గుంటూరు ఏ.సి. కళాశాల, మద్రాసు క్రిస్టియన్ కళాశాల, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో రాజనీతి శాస్త్రం చదివారు. సోషలిస్టు పార్టీ భావజాలంతో ప్రభావితులైన ఆయన ఎందరో విద్యార్థులను, మిత్రులను భౌతికవాదులుగా మలిచారు. విద్యార్థుల నడుమ ఆరోగ్యవంతమైన భావసంఘర్షణకు, భావప్రచారానికి, వారిలో ఎదుగుదలకు స్వేచ్ఛాపూరిత వాతావరణం నెలకొల్పారు.

ఆయన 17-9-1932న ప్రకాశంజిల్లా పరుచూరు మండలంలోని యర్రంవారి పాలెంలో జన్మించారు. 2-2-2018న తన 86వ ఏట గుంటూరులో మరణించారు. ఆయన జ్ఞాపకార్థం వారి భార్య శేషుమాంబ, కుమారులు రవి, నిరంజన్, రామకృష్ణ 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి వై.వి.రెడ్డిగారి ప్రథమ వర్ధంతి సందర్భంగా 25,000 రూపాయలు విరాళంగా అందచేశారు. వారికి కృతజ్ఞతలు. వై.వి.రెడ్డిగారిని వారి 3వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం.

# గొట్టుముక్కల సీతారామరాజు
## రెండవ వర్ధంతి



**గొట్టుముక్కల** సీతారామరాజు 1937 ఆగస్టు 15న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని వెంప గ్రామంలో జన్మించారు. అదే గ్రామంలో కామ్రేడ్ ఉద్దరాజురామం నాయకత్వాన జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి ప్రభావితుడైనారు. తండ్రి నుండి పుణికి పుచ్చుకున్న జాతీయోద్యమ భావాలతో అభ్యుదయ సాహిత్య అభిమానిగా అభ్యుదయ రచయితల సంఘ నాయకులైన తుమ్మల వెంకట్రామయ్యగారితో స్నేహ సంబంధాలు నెరిపారు. 'సితార' కలం పేరుతో రచనలు చేశారు. కాలక్రమంలో విప్లవ భావజాల బృందంతో నడిచారు. 'ప్రజాసాహితి'కి అభిమానిగా, సన్నిహితునిగా వున్నారు. వారి కుటుంబసభ్యులు హేతువాద, అభ్యుదయ భావాభిమానులు కావటానికి చేయూతనిచ్చారు. రాజుగారి తొలి వర్ధంతి (మరణం 1-2-2019) సందర్భంగా వారి మనుమరాలు డాక్టర్ పి. స్నేహ 'ప్రజాసాహితి' పత్రికకు రూ॥ 25 వేలు విరాళంగా అందించారు. గొట్టుముక్కల సీతారామరాజుగారిని వారి రెండవ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' జ్ఞాపకం చేసుకుంటూంది.

కవిత

# సూర్య పుత్రికలు

**- ఓ.వి.వి.యస్. లక్ష్మీకుమారి**

కులం మతం బూజులు పట్టి
మద్యం పాలసీల మత్తులు సేవిస్తూ
అశ్లీలత రొంపుల్లో మీ అవయవాలు చచ్చుబడిపోయాక
స్త్రీలని బంధించి అత్యాచారాలే చేయగలరు
ప్రతిఘటిస్తే...,
నాలుక తెగ్గోసి, వెన్నెముక విరిచి
అమానుషంగా హత్యలు చేసే హంతకులు మీరు
అత్యంత పైశాచిక రతిని నిరసిస్తూ
పచ్చని పచ్చిక రెమ్మరెమ్మనా సీసీ కెమేరాలై సాక్ష్యం చెప్పినా
కొలువు తీరిన చట్టాలు, రక్షక భట ఠాణాలు
మీ పశువుల కొట్టాలలో స్వచ్ఛభారతాలు చేస్తూ ఉంటాయి
నట్టింట న్యాయదేవతను నాట్యమాడించే
మీ హత్యాచార లీలలకు గర్భగుడులు
నోరు మూసుకొని సహకరించొచ్చుగాక
ఆకాశంలో సగం పడునెక్కుతోంది
పెట్టుబడుల మార్కెట్ వలల్లో పడే
కాస్మొటిక్ బొమ్మల ఎపిసోడ్లు ముగుస్తున్నాయి
ప్రపంచ ఆకాశాలలో దండలు వేస్తూ....,
ముంగిట్లో లక్ష్మణరేఖలు గీసే మీ యజ్ఞాలకు
మేమింక సమిధలుగా మిగలం
శ్రమ అమ్మ కన్న పోరు బిడ్డలం
బుసలు కొడుతున్న విషసంస్కృతి వేయి పడగలపై
నెమళ్ళపై వాలి తాండవం చేస్తాం
మీ భస్మాసుర హస్తాలను మీపైనే సంధిస్తాం
మీ వామనుడి మూడోపాదాన్ని మీపైనే మోపుతాం
చితిమంటల అగ్నికీలలమై నింగికెగసి
రేపటి పుడమిని సూర్యపుత్రికలతో నింపేస్తాం

# సంతాపాలు

## సుగత కుమారి



**ప్రసిద్ధ** మలయాళ కవయిత్రి, పర్యావరణ కార్యకర్త, మహిళా ఉద్యమకారిణి అయిన సుగత కుమారి తన 86వ ఏట 23-12-2020న కరోనాతో తిరువనంతపురంలో మరణించారు. ఆమె 22-1-1934లో జన్మించారు. తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధీ శిష్యుడు - తల్లి సంస్కృత పండితురాలు.

1970ల ప్రారంభ సంవత్సరాలలో ప్రారంభించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చివరివరకు ఆమె కొనసాగించారు.

సైలంట్ వాలీలో ప్రభుత్వం ప్రతిపాదించిన హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సైలంట్ వాలీ పరిరక్షణ ఉద్యమంలో 1978 నుండి 1983లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆ ప్రాజెక్టును ఉపసంహరించుకున్నట్లు ప్రకటించేవరకు కీలకపాత్ర వహించారు.


విచక్షణారహితంగా అటవీ ప్రాంతాన్ని కాంట్రాక్టర్లు నరికివేయగా, ఎడారిలా తయారైన అట్టిపాడి గిరిజన ప్రాంతంలో కొంత భాగాన్నైనా, వృక్ష సంపదతో నింపాలని నిర్ణయించుకొని అటవీశాఖ అనుమతితో బొమ్మైపాడి గ్రామ పరిసరాలలో అడవిని పునరుద్ధరించారు. ఆ అడవిని ఇప్పుడు కృష్ణవనం అని పిలుస్తున్నారు. అది ఇప్పుడు ఏనుగులకు, అడవి దున్నలు, లేళ్ళు, నెమళ్ళు, పులులు, సింహాలకు నిలయంగా వుంది. స్థానిక గిరిజనుల సహాయంతో అభివృద్ధిపరచిన ఈ కృష్ణవనంలో వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కలు వున్నాయి.

ఆమె రాసిన 'చెట్టుపై ఒక భావగీతం' పర్యావరణ కార్యకర్తలకు ఉద్యమ గీతంగా ఉపయోగపడుతోంది. ప్రకృతిపైనే గాక ఆమె మహిళల సమస్యలపై అనేక కవితలు రాశారు. 1996లో ఆమె కేరళ మహిళా కమీషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. కేరళలో సన్యాసినులు (నన్స్) - బిషప్ తమపై చేసిన లైంగిక దాడికి వ్యతిరేకంగా చేసిన నిరసన ఉద్యమంలో సుగత కుమారి పాల్గొన్నారు. సామాజిక కార్యకర్తగా ఆమె 1992లో అనాథ స్త్రీలకు, బాలలకు, త్రాగుడుకు బానిసలైనవారికి, మానసిక రోగులకు సహాయం చేసే 'అభయ' సంస్థను స్థాపించారు. తన ఆఖరి కోరికగా 'అభయ'లో వెనుకనున్న ఖాళీ ప్రదేశంలో ఒక మర్రిచెట్టును నాటి పెంచండి అని కోరారు.

1960లలో కేరళ సాహిత్య అకాడమీ అవార్డునూ, 1970లలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ఆమె స్వీకరించారు.

---

## బూర్గుల నర్సింగరావు



**మహత్తర** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కార్యకర్త, కార్మిక నాయకుడు, లౌకికవాది బుర్గుల నర్సింగరావు 18-1-2021న హైదరాబాదులో తన 89వ ఏట మరణించారు. ఆయన 14-3-1932లో జన్మించారు.

బూర్గుల రామకృష్ణరావు వీరి పెదనాన్న. అప్పటి రామకృష్ణరావు ప్రభుత్వం 1949లో వీరిని అరెస్టు చేసింది. అప్పటికి నర్సింగరావు సాయుధ రైతాంగ పోరాటంలో వున్నారు. వివేకవర్ధిని, నిజాం కళాశాలల్లో చదివిన నర్సింగరావు ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ స్థాపించి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సభలు, ఊరేగింపులు నిర్వహించడంలో ప్రముఖ నాయకత్వ పాత్ర వహించారు. స్థానికులకు ఉద్యోగాలు కోసం ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారు.

నర్సింగరావు 1955లో లక్నోలో జరిగిన అఖిల భారత విద్యార్థి సమాఖ్యకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1957లో కులాంతర వివాహం చేసుకున్నారు. ఇంగ్లండ్‌లో ఉన్నత విద్యనభ్యసించి, హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో రాజనీతి శాస్త్ర అధ్యాపకునిగా పనిచేశారు. తెలంగాణ పట్టభద్రుల సంఘం స్థాపించారు. తన స్వగ్రామం బూర్గులలో రైల్వేస్టేషన్, స్పిన్నింగ్‌మిల్, ఔళి మిల్లుల ఏర్పాటుకై కృషిచేశారు. ఏఐటియుసి నాయకునిగా కార్మికోద్యమంలో పనిచేశారు. తెలుగుభాషా సాహిత్యాలతో పాటు ఉర్దూ, ఇంగ్లీషులలో కూడా వీరికి లోతైన అవగాహన వుండేది. 'ఇమ్రోజ్' ఉర్దూ పత్రిక సంపాదకుడు షోయాబుల్లాఖాన్‌ను రజాకార్లు కత్తులతో నరికివేయడానికి 20 నిముషాలు ముందు వరకు వీరితో గడిపి వెళ్ళారు. ప్రముఖ ఉర్దూకవి, కార్మిక ఉద్యమ నాయకుడు మగ్దూం మొహియుద్దీన్‌తో వీరికి చాలా సాన్నిహిత్యం వుండేది. 'ప్రజాసాహితి' మగ్దూం ప్రత్యేక సంచిక (2003 సెప్టెంబర్-అక్టోబర్)లో కామ్రేడ్ మగ్దూం గురించి వీరొక మంచి వ్యాసం రాశారు.

బెల్లి లలితను హత్యచేసిన సందర్భంగా ఎం.టి.ఖాన్, కేశవరావు జాధవ్‌లతో కలసి భువనగిరిలో నిరసన ఊరేగింపు సభ నిర్వహించారు.

1960 వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా వున్న వీరు, చనిపోయేనాటికి రావి నారాయణరెడ్డి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులుగా వున్నారు.

# నాగళ్ళ వెంకట దుర్గాప్రసాద్



**తెనాలి** దగ్గర అనంతవరం గ్రామానికి చెందిన సాహిత్య, సాంస్కృతిక కార్యకర్త నాగళ్ళ దుర్గాప్రసాద్ తన 56వ ఏట 12-1-2021న అనారోగ్యంతో మరణించారు.

పట్టణ రంగస్థల కళాకారుల సంఘానికి అధ్యక్షునిగా పనిచేసిన కాలంలో, తన తండ్రి పేరిట కళాకారుల కార్యక్రమాల కొరకు ఒక భవనం నిర్మించారు. గత పదేళ్ళుగా 'ప్రజ్వలిత' అనే సామాజిక, సాంస్కృతిక సాహిత్య సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షునిగా తెనాలిలో అనేక కార్యక్రమాలు నిర్వహించి, ప్రసిద్ధ రచయితలను, కళాకారులను తెనాలిలోని యువతరానికి పరిచయం చేశారు. 'పునరవలోకనం' శీర్షికతో పాత తరం రచయితలపై ప్రసంగ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# అబ్బిగారి రాజేంద్రప్రసాద్

**ఆంధ్రప్రదేశ్‌లో** రెండవ కథానిలయం నందలూరులో స్థాపించిన కడప జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు అబ్బిగారి రాజేంద్రప్రసాద్ 31-1-2021న తన 59వ ఏట మరణించారు. ఆయన పొత్తపి గ్రామంలో ఒక ఉపాధ్యాయుని కొడుకుగా 15-6-1962లో జన్మించారు.

కడప ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ విద్యార్థిగా, ఎ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా నాయకునిగానూ, కళాశాల విద్యార్థిసంఘ నాయకునిగా పనిచేశారు. తండ్రి సుబ్బయ్య సి.పి.ఐ.కు చెందిన ప్రాథమిక ఉపాధ్యాయ సంఘానికి రాజంపేట సమితి శాఖకు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. బిఇడి పూర్తిచేసిన తర్వాత రాజేంద్రప్రసాద్ 1987లో ఉపాధ్యాయునిగా నందలూరులో స్థిరపడ్డారు. ఎస్.టి.యు రాష్ట్ర నాయకుడిగా వున్నారు.

2003లో సొంత డబ్బుతో నందలూరులో కథానిలయం తన సొంత ఇంట్లో ఏర్పరచారు. 1956 నుండి 2006 వరకు వచ్చిన 47 మంది కడపజిల్లా కథారచయితల కథలను 'కడప కథ'గా ప్రచురించారు. కేతు విశ్వనాథరెడ్డి పేరుతో కథా అవార్డులు 2005 నుండి ఇవ్వడం ప్రారంభించారు. తాను కడప నానీలు రచించారు.

# చిట్టిమల్లె శంకరయ్య (రుద్రశ్రీ)

**'జనని'** సాహితీ సంస్థ స్థాపకుడు, తెలుగు అధ్యాపకుడు అయిన శంకరయ్య తన 87వ యేట 15-1-2021న మరణించారు. జనగామకు చెందిన శంకరయ్య 15-4-1934న జన్మించారు.

హనుమకొండలోనూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ చదువుకొన్న శంకరయ్య 1972 నుండీ జనగామలోని ఆంధ్ర భాషాభివర్ధినీ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పనిచేసి 1996లో ఉద్యోగ విరమణ చేశారు.

ఆయుర్వేద వైద్యంతో వున్న పరిచయంతో 'తెలుగు సాహిత్యంలో దేశీయ వైద్యం' అనే అంశంపై ఎం.ఫిల్; 'ఆంధ్ర సాహిత్యంలో ఆయుర్వేదం' అనే అంశంపై పిహెచ్‌డి చేశారు. తన 20వ ఏట భావకవిగా సాహిత్య వ్యాసంగం ప్రారంభించి 6 కవితా సంపుటులు, ఒక గేయ సంపుటి ప్రచురించారు. అభ్యుదయ దృక్పథంతో 'జనని' కవితా సంకలనం రూపొందించారు. దీనిలో 18 కవితలు కాళోజీవి. రుద్రశ్రీవి మూడు. 15 కవితలు ఇతరులవి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాహిత్యపరంగా కృషిచేశారు.



# శివరాజు సుబ్బలక్ష్మి

**కథ,** నవల రచయిత్రి, చిత్రకారిణి శివరాజు సుబ్బలక్ష్మి తన 96వ ఏట బెంగుళూరులో తాను పెంచుకున్న కుమారుని ఇంట్లో 6-2-2021న మరణించారు. వారు రాజమండ్రిలో 17-9-1925లో జన్మించారు.

ఆమెకు 12వ ఏట శివరాజు వెంకటసుబ్బారావు (బుచ్చిబాబు)తో వివాహమైంది. ఎం.ఎ. చదవడానికి మద్రాసు భర్తతోపాటు సుబ్బలక్ష్మి వెళ్ళారు. ఆమె వివాహానంతరం సంస్కృతం చదివి, ప్రైవేటుగా మెట్రిక్ పాసయ్యారు. బుచ్చిబాబును కలుసుకోడానికి వచ్చే రచయితల పరిచయంతో 1964లో సాహితీ లోకంలోకి అడుగుబెట్టి కథలు, నవలలు రాశారు. వారి కథలలో గ్రామీణ మధ్యతరగతి నియోగి బ్రాహ్మణ కుటుంబాలలో 30లలో, 40లలో వున్న సంస్కృతిని చిత్రించారు. చిన్న వయసులోనే పెళ్ళయి అత్తగారింటికి చేరిన అమ్మాయిల అగచాట్లు, చిన్నతనంలోనే భర్తలను పోగొట్టుకుని పుట్టింటికి చేరిన మహిళల పాట్లు తన కథల్లో చిత్రించారు. మొత్తం ఐదు కథా సంపుటాలు, మూడు నవలలు ప్రచురించారు.

గృహలక్ష్మి స్వర్ణకంకణం, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం పొందారు.

# పోరంకి దక్షిణామూర్తి




**విశిష్ట కథకుడూ,** విలక్షణ నవలా రచయితా, అనువాదకుడూ, భాషాశాస్త్రవేత్తా అయిన పోరంకి దక్షిణామూర్తి తన 86వ ఏట 6-2-2021న హైదరాబాదులో మరణించారు. ఆయన 24-12-1935న తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో జన్మించారు.

కాకినాడలో డిగ్రీ పూర్తిచేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదివి, సి. నారాయణరెడ్డి పర్యవేక్షణలో 'తెలుగు కథానిక స్వరూప స్వభావాల' మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. తెలుగుశాఖలో రీడర్‌గా ఆ విశ్వవిద్యాలయంలోనే పనిచేసి, 1969లో తెలుగు అకాడమీలో చేరి భద్రిరాజు కృష్ణమూర్తితో కలిసి పలు నిఘంటువులు, వృత్తి పదకోశాలు రూపొందించారు. 1993లో తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసినా, పాత్రికేయ విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఏభై పైన పుస్తకాలు రాసారు. అసంఖ్యాకమైన అనువాదాలు చేశారు.

ఉత్తరాంధ్ర మాండలీకంలో 'వెలుగు వెన్నెల గోదారి', రాయలసీమ మాండలీకంలో 'రంగవల్లి', తెలంగాణ మాండలీకంలో 'ముత్యాల పందిరి' అనే నవలలు రాశారు. 'ఒక యోగి ఆత్మకథ'ను అనువదించారు.

ఆయన తన సాహిత్య వ్యాసంగపు తొలినాళ్ళల్లో అప్పటి పత్రికలన్నిటిలో వందలాది కథలు రాశారు. 'చంద్రవంక' వారి కథల సంపుటి. మాండలిక వృత్తి పదకోశంలో 'తెలుగు కథానిక స్వరూప స్వభావాలు' ఒక ప్రామాణిక సిద్ధాంత గ్రంథం. కథానిక మన దేశంలో పుట్టినదేనని అగ్ని పురాణం 337వ అధ్యాయంలోని 20వ శ్లోకంలో కథానిక నిర్వచనం వుందని నిరూపించారు. ఇంకా 'భాష-ఆధునిక దృక్పథం', 'భక్తుల కథలు', 'అరచేతిలో అద్దం', 'అదొక్కటీ తెలుసుకో చాలు', 'ఉన్నది ఉన్నట్లు' (పుస్తక సమీక్షలు) వారి ఇతర గ్రంథాలు.

# వేద ప్రకాశ్ మెహతా



**తన** మూడవ ఏటనే కంటి చూపును పోగొట్టుకొని, బ్రెయిలీ లిపి ద్వారా ఉన్నత విద్యనభ్యసించి ఎన్నో పుస్తకాలు ఆంగ్లంలో రాసిన వేద ప్రకాశ్ మెహతా పార్కిన్సన్ వ్యాధితో తన 87వ యేట 9-1-2021న న్యూయార్కులో మరణించారు. ఆయన 21-3-1934న లాహోర్‌లో పంజాబీ కుటుంబంలో జన్మించారు.

ఆయనను మూడవ ఏటనే లాహోర్‌కు 2.100 కిలోమీటర్ల దూరంలో వున్న బొంబాయిలోని దాదర్ అంధ పాఠశాలకు పంపారు. 15వ ఏట 1949లో అమెరికాలోని అర్కన్సాస్ అంధ పాఠశాలలో చేరారు. 1956లో ఒకసారి, 1959లో మరోసారి ఆక్స్‌ఫర్డ్ వారి బాలియోల్ కళాశాలలో రెండు బి.ఏ. డిగ్రీలు పాసయ్యారు. 1961లో హార్వర్డ్‌లో ఎం.ఏ. చదివారు.

ఆయన తాను కంటిచూపునూ, లాహోర్‌లోని సొంత ఇంటినీ, తన మాతృభాష పంజాబీని, తన దేశాన్నీ పోగొట్టుకున్నందుకు విచారించాడు. దేశ విభజన మూలంగా వీరి కుటుంబం లాహోర్ విడచి శరణార్థులుగా వచ్చారు. ఆయన అమెరికాలో స్థిరపడ్డారు. ఆవిధంగా తన దేశాన్ని పోగొట్టుకున్నారు. అదీగాక 1975లో ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి ప్రకటించి నిరంకుశ పాలన కాలంలో దానిని నిరసిస్తూ భారత పౌరసత్వాన్ని వదులుకొని అమెరికన్ పౌరసత్వాన్ని స్వీకరించారు. తనలో ఐదు సంస్కృతులు మేళవించాయని అవి భారతీయ, బ్రిటీష్, అమెరికన్, అంధ, న్యూయార్కర్ పత్రిక సంస్కృతులని చెప్పేవారు.

తన బాల్యం గురించి 1957లో రాసిన 'ముఖాముఖీ' (Face to Face)లో చిత్రించారు. 1966లో రాసిన మొదటి నవల 'ది న్యూయార్కర్' పత్రికలో ధారావాహికగా వచ్చింది. 1961 నుండి 1994 వరకు 'ది న్యూయార్కర్' పత్రిక ఉద్యోగిగా దానిలో రచించారు. ఆయన తన పుస్తకాలలో 1947 నాటి దేశ విభజన కాలంలో చెలరేగిన హింస, ప్రజలు పడిన బాధలు చిత్రించారు. 1994 తర్వాత అమెరికన్ విశ్వవిద్యాలయాలలో అతిథి అధ్యాపకునిగా పనిచేశారు. భారతీయ జీవన విధానం గురించి 'వాషింగ్ ది ఇండియన్ స్ట్రీట్' (1959)లో, 1970లో 'పోర్ట్రయిట్ ఆఫ్ ఇండియా'లో రాశారు. కాంటినెంట్స్ ఆఫ్ ఎగ్జైల్' అనే పేరుతో 12 సంపుటాల జ్ఞాపకాలను 1972 నుండి 2004 వరకు ప్రచురించారు.

# సిహెచ్. జాకబ్

**ప్రజానాట్యమండలి** జాతీయ నాయకుడు, ప్రముఖ కళాకారుడు, గాయకుడు, రచయిత సిహెచ్. జాకబ్ తన 63వ ఏట హైదరాబాదులో గుండెపోటుతో 6-2-2021న మరణించారు. ఆయన 19-1-1959లో గోదావరిఖనిలో జన్మించారు. ఆయన 1977లో సింగరేణి గని కార్మికునిగా చేరారు. విద్యార్థి దశలో ఎ.ఐ.ఎస్.ఎఫ్‌లో క్రియాశీలంగా పనిచేశారు. కొంతకాలం యువజన సమాఖ్య నాయకునిగా వున్నారు. ఉమ్మడి ప్రజానాట్యమండలి కార్యదర్శిగా పనిచేశారు. ఆయన పలు నాటకాలు రాశారు. బొగ్గు గని కార్మికులపై 'కాలేరోళ్ళు' అనే నాటకం రాసి ప్రదర్శించారు. అనేక ప్రబోధ గేయాలు, గజళ్ళు రాయడమేగాక వారిని గానం చేసిన గొప్ప గాయకుడు ఆయన.



# సి. ఆనందరామం

**నవలా** రచయిత్రి, సాహిత్య విమర్శకులు అయిన చిలకమర్తి ఆనందరామం 11-2-2021న తన 86వ ఏట హైదరాబాదులో మరణించారు. ఆమె 20-8-1935న ఏలూరులో జన్మించారు. ఆమె అసలుపేరు ఆనందలక్ష్మి కాగా, వివాహానంతరం తన పేరు చివర భర్త పేరు కలిపి ఆనందరామంగా మార్చుకున్నారు.

ఏలూరులో బి.ఏ. వరకు చదివి, ఏలూరు సిఆర్ఆర్ కళాశాలలో తెలుగు ట్యూటర్‌గా చేసి 1957లో వివాహానంతరం 1958-60లో ఎం.ఏ. (తెలుగు) చదివి, సినారె పర్యవేక్షణలో పిహెచ్‌డి చేశారు. హైదరాబాదులోని హోం సైన్స్ కళాశాల, నవజీవన కళాశాలలోనూ, 1972 నుండి సెంట్రల్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా చేసి 2000లో ఉద్యోగ విరమణ చేశారు.

60 నవలలు, 100కి పైగా కథలు రాసిన ఆనందరామం 'తెలుగు నవలా విమర్శ', 'సాహిత్యమూ నవలా ప్రకియ', మొదలగు విమర్శ గ్రంథాలు రాశారు. గృహలక్ష్మి అవార్డు, మాలతీ చందూర్ స్మారక అవార్డు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, సుశీలా నారాయణరెడ్డి అవార్డు, గోపీచంద్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ అవార్డు, అమృతలత అవార్డు మొదలగునవి అందుకున్నారు.


# వాసాల నరసయ్య



**ప్రముఖ** బాలసాహితీవేత్త వాసాల నరసయ్య తన 80వ ఏట 14-02-2021న కరీంనగర్‌లో మరణించారు. ఆయన కరీంనగర్‌జిల్లా మెట్పల్లి మండలం చేలమద్ది గ్రామంలో 26-01-1942లో జన్మించారు.

నరసయ్య తన 12వ ఏటనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. 8వ తరగతిలో పాఠశాల మేగజైన్‌కు సంపాదకత్వం వహించారు. ఆయన తపాలాశాఖలో పనిచేసి హెడ్‌పోస్ట్‌మాస్టర్‌గా 2002లో ఉద్యోగ విరమణ చేశారు. అన్ని బాలల పత్రికల్లోనూ ఆయన కథలు ప్రచురితమయ్యాయి. మొత్తం 36 బాలసాహిత్య రచనలు ఆయన వెలువరించారు. 2009 నుండి ప్రతి ఏడాదీ బాలసాహిత్య పురస్కారాలు అందుకున్నారు.

# నరెడ్ల శ్రీనివాస్



**లోక్‌సత్తా** శ్రీనివాస్‌గా ప్రసిద్ధి చెందిన నరెడ్ల శ్రీనివాస్ తన 67వ ఏట కరోనా కాటుకు గురై 15-02-2021న కరీంనగర్‌లో మరణించారు. ఆయన హుజూరాబాద్ మండలం కందుగల గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో 1955లో జన్మించారు.

ఆయన హుజూరాబాద్, కరీంనగర్‌లో డిగ్రీ వరకు చదివి, నిజాం కాలేజిలో ఫిజిక్స్ ఎం.ఎస్.సి. చదివారు. కొన్నాళ్ళు లెక్చరర్‌గా చేసి గ్రూప్ 1 పరీక్షలు రాసారు. సెక్రటేరియట్‌లో సెక్షన్ అధికారిగా మరికొంతకాలం పనిచేశారు. అది లంచాల మయమని తెలిసి బ్యాంక్ పరీక్షలు రాసి యూనియన్ బ్యాంక్‌లో చేరి, నల్లగొండ, నిజామాబాద్, రాజ్‌కోట, మల్యాల, మానకొండూర్, కొత్తపల్లి తదితర శాఖల్లో పనిచేశారు. బ్యాంకు అధికారిగా కవులకు, రచయితలకు అప్పులు ఇప్పించారు.

1970లో అవునూరి సమ్మయ్యతో కలిసి వరంగల్లులో కాళోజీ నడిపిన మిత్రమండలి లాగా, హుజూరాబాద్‌లో మిత్రమండలి స్థాపించారు. 1971లో దానిని జనసాహితిగా మార్చారు. (ఇప్పుడు వున్న జనసాహితికి – దీనికి సంబంధం లేదు) జనసాహితి ప్రచురణగా 'నిప్పురవ్వలు' అనే కవితా కథా సంకలనం ప్రచురించారు. 1974లో జీవగడ్డ విజయకుమార్‌తో కలిసి ఉద్యమ సాహితి అనే సంస్థను స్థాపించి 'బదీలా' కథాసంకలనం, శ్రీశ్రీ అనువదించిన 'రెక్కవిప్పిన రివల్యూషన్' ప్రచురించారు. కాళోజీని, శ్రీశ్రీని ఆహ్వానించి హుజూరాబాద్‌లో సభలు నిర్వహించారు.

ఆయన 1980లో అంపశయ్య నవీన్‌తో కలిసి కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ బాధ్యతలు చేపట్టి, చుట్టుప్రక్కల వివిధ ప్రాంతాల్లో ఫిల్మ్ సొసైటీలను ఏర్పరచారు. ఫిల్మ్ అప్రీసియేషన్ కోర్సు నిర్వహించారు. 'జీవగడ్డ' దినపత్రికలో వారంవారం 'పెన్నుపోటు' కాలమ్ రాసేవారు.

వినియోగదారుల రక్షణ చట్టం రావడానికి ఏడాది ముందే కరీంనగర్ వినియోగదారుల సంఘాన్ని ప్రారంభించారు. దీని ద్వారా పదివేల వివాదాలను పరిష్కరించి, 25 కోట్లు నష్టపరిహారం వినియోగదారులకు ఇప్పించారు. అవినీతిపరుల పట్ల సింహస్వప్నమై ఉద్యమించారు. నకిలీ డాక్టరేట్ పట్టాలు పొందినవారిని బట్టబయలు చేశారు. మైక్రో ఫైనాన్స్‌వారి దురాగతాలను అడ్డుకున్నారు. 20 ఏళ్ళపాటు లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. రిటైరైన తర్వాత లా పరీక్ష రాసి లాయర్‌గా అనేక కేసుల్లో ప్రజల పక్షాన పోరాడారు.

# వెలమాటి సత్యనారాయణ



**ప్రగతిశీల** సాహిత్యానికీ, హేతువాద భావాల వ్యాప్తికి ఎనలేని కృషి చేసిన వెలమాటి సత్యనారాయణ తన 99వ ఏట 17-02-2021న రాజమండ్రిలో మరణించారు. ఆయన 1920లో జన్మించారు.

ఆయన జనసాహితి సంస్థవారి 'ప్రజాసాహితి' పత్రికకు పాఠకుడు, అభిమాని. గత ఒకటిన్నర దశాబ్దంపైగా జనసాహితి రాజమండ్రిలో నిర్వహించిన వివిధ సాహిత్య సమావేశాలకు 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికల ఆవిష్కరణ సభలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలను ఆయన ప్రోత్సహించేవారు. ముద్రణలో లేని అపురూపమైన సాహిత్య గ్రంథాలను ముద్రించి అభిమానులకు ఇచ్చేవారు. 2016లో ఉప్పల లక్ష్మణరావు స్వీయచరిత్ర 'బతుకు పుస్తకం' పునర్ముద్రించారు. తాను చదివేసిన పుస్తకాలను ఇతరులకు ఇచ్చి ప్రోత్సహించేవారు.

హేతువాదిగా ఆయన తన కళ్ళు, దేహం దానమిచ్చారు. ఆయన కోరిన ప్రకారం కళ్ళను నిడదవోలులోని ఐ బ్యాంక్‌కు, దేహాన్ని జిఎస్ఎల్ ఆసుపత్రికి అప్పగించారు.

---

# ఎస్.వి. నారాయణ



ప్రగతిశీల ఉపాధ్యాయుడు, రచయిత, వామపక్షవాది, సూర్యదేవర వెంకట నారాయణ తన 90వ ఏట హైదరాబాదులో 19-02-2021న మరణించారు. ఆయన 1931లో మధిర తాలూకా అల్లినగరంలో జన్మించారు. అయితే వీరి స్వగ్రామం కృష్ణాజిల్లా నందిగామ మండలం సోమవరం.

ఆయన నందిగామ, విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కళాశాలల్లో చదివిన కాలంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్యలో చురుకైన కార్యకర్తగా కృషిచేశారు. ఆ తరువాత ఉపాధ్యాయునిగా ఆదర్శనీయమైన పద్ధతిలో పనిచేశారు. ఖమ్మంజిల్లా పాల్వంచలో స్థిరపడ్డారు. ఎస్.టి.యు. ఖమ్మంజిల్లా అధ్యక్షునిగా పనిచేశారు.

విద్యావేత్తగా ప్రసిద్ధిచెందిన ఆయన పలు సభలలో స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. ఎన్నో ఆదర్శ వివాహాలను నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం తమ పాత విద్యార్థుల నుండి విరాళాలు సేకరించి ఖమ్మంలో గురుదక్షిణ ఫౌండేషన్ అనే ట్రస్టు ఏర్పాటు చేసి, వృద్ధాశ్రమం, ఆసుపత్రి ఏర్పాటుచేసి దానికి ఉపాధ్యక్షునిగా ఉన్నారు.

'ప్రజాసాహితి'కి ఆయన శ్రేయోభిలాషి. సుంకరపై 'ప్రజాసాహితి' ప్రచురించిన ప్రత్యేక సంచికలో ఆయనపై ఎస్.వి. నారాయణ చక్కటి వ్యాసం రాశారు. వారి ఇద్దరి కుమారులలో పెద్ద కుమారుడు డా॥ జతీన్, జనసాహితి సంస్థాపక రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేశారు. నారాయణగారి భౌతికకాయాన్ని ఖమ్మంలోని మమతా మెడికల్ కళాశాలకు అప్పగించారు.

---

# కాబోతు డానియల్

సమసమాజం కోసం ఉద్యమించిన ఉత్తమ ఉపాధ్యాయుడు డానియల్ మాస్టారు. తన 88వ ఏట పొన్నూరులో 9-2-2021న మరణించారు. ఆయన 1933లో గుంటూరుజిల్లా కొల్లిపర మండలంలో 'స్టాలిన్ గ్రాడ్'గా, 'రెడ్ విలేజ్'గా పేరుపొందిన దావులూరు గ్రామంలో ఒక నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు.

గుంటూరు లూథరన్ స్కూలులో మొదట పనిచేసినపుడు కమ్యూనిస్టు అని చెప్పి ఉద్యోగం నుండి ఆయనను తొలగించారు. ఆ తర్వాత ప్రభుత్వ హైస్కూలు టీచర్‌గా జాగర్లమూడి, వెల్లలూరు, తాడిపర్రు, తొట్టెంపూడి తదితర చోట్ల పనిచేశారు.

ఆయన యువకునిగా ప్రజానాట్యమండలి శాఖను ఏర్పాటుచేసి నాటకాలు వేసేవారు. ఆయనపై భగత్‌సింగ్, గోరా, త్రిపురనేని రామస్వామి ప్రభావం వుంది. చుండూరు బాధితులకు అండగా నిలబడ్డారు. ఆయన మార్క్సిజాన్నీ, పుస్తక పఠనాన్నీ ప్రేమించారు. తన కుమార్తెకు 'సమతావాణి' అనీ, ఇంటికి 'సమతామార్గ్' అనీ, పుస్తకాల గదికి 'సమతా నిలయం' అనీ పేర్లు పెట్టుకున్నారు.

---

# పి. వాణి



**జనసాహితి** శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి, ఉపాధ్యాయుడు అయిన పి. మోహనరావు జీవిత సహచరి పి. వాణి తన 47వ యేట 18-2-2021న శ్రీకాకుళంలో అనారోగ్యంతో మరణించారు. ఆమె 22-11-1973న జన్మించారు.

వాణిగారు ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఆమె ఎ.పి.టి.ఎఫ్ సభ్యురాలు.

జనసాహితి సంస్థ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వాణి 'ప్రజాసాహితి'కి మంచి పాఠకురాలు. ✺

కవిత

# రాజకీయ అతిరథుల్లారా

- పి. అనంతరావు

ఓ రాజకీయ అతిరథుల్లారా
ఈ రాజ్యంలో మీ చేష్టలు
ప్రజలమీద ప్రేమ నటిస్తూ
మీరు కార్చే మొసలి కన్నీళ్ళు
అందరికీ తేట తెల్లమే

మీకు జెండాలు, వాటి రంగుల
అర్థాలే తెలియవు
జనగణమన, వందే మాతరం
వేళా పాళా లేకుండా వల్లించేస్తున్నారు
దేశ భక్తులెవరు వాళ్ళ
సూత్రాలూ, ఆశయాలు ఏవిటీ
ఏమైనా తెలుసునా మీకు
నిత్యం జైళ్లలో
నిజాయితీని బంధించి
నిర్దయగా బాధించడమే
మీకు తెలిసిన విద్య

ఇంకా రక్తాల పాద ముద్రల
తడి ఆరనేలేదు
అప్పుడే రాతి విగ్రహాల
సంతోష సంబరాలా!
దేశమంతా వైరస్ వికృతంగా
అల్లుకుపోతూనే ఉంది
కార్పొరేట్ వైద్య దోపిడీ
సాగిపోతూనే ఉంది
మధ్యన చిక్కుకున్న సామాన్యులు
నలిగిపోతూనే ఉన్నారు

వేరు వేరు మతాల వారు
వేరు వేరు దేవుళ్లను ఆరాధిస్తారు
ఎవరికి నచ్చిన ఆహారాన్ని
వారు తింటారు
మీరు ఒక సామాన్య
పాలిచ్చే జంతువు
ఆవుని పూజిస్తారు
ఒక్క ఆవు పేరుతోనే
ఎన్నో మత హింసలు
ఘోరంగా చేస్తున్నారు
వేదాలను వల్లిస్తారు
వేదార్థాలు తెలియవు
ఏ యాగాలలో ఏ పశువుల్ని బలిచ్చారో
ఎవరు ఎప్పుడు ఏం తిన్నారో
గుర్తు చెయ్యాలా మీకు

గతం మరిచిపోయారు
ప్రస్తుతం దేశ హితం
మరచిపోయారు
మీ కుర్చీలు మీకు
క్రమశిక్షణ నేర్పవు
అందుకే అన్నీ అత్యాచారాలే
సైంటిస్టుల మాట నమ్మరు
సన్యాసులతో స్నేహం చేస్తారు
వాళ్ళతో కలసి దేశాన్ని
వెనక్కి నడిపిస్తారు
మీరు ప్రజలకి అందిస్తున్న స్కీములు ఎప్పుడో ఒక రోజు
వారి కొంపలు ముంచుతాయి
ఇక మీరు గద్దెలు దిగాలి
సత్య సంధులకి
అధికారం అప్పగించాలి
స్వాతంత్ర్యం కోసం చేసిన
రక్త త్యాగాలు మరణాలు
అన్నీ మరిచిపోయారు
ప్రజలు మీకు స్నేహితులు కారు
సన్నిహితులు అంతకన్నా కారు
మీకు బడా వ్యాపారస్తులు
దేశాన్ని మింగేస్తున్నవారే
ప్రాణ స్నేహితులు
ఎందుకో తెలుసా
అప్పుడు దేశాన్ని
సులువుగా అమ్మేయవచ్చు
అప్పుడందరు వాళ్ళ
చెప్పు చేతల్లో ఉంటారు
ఇకముందు సమ్మెలు
కార్మిక కర్షక నినాదాలు
గాలిలో కలిసిపోతాయి
మీ వ్యాపార లాభాలే
ప్రజాస్వామ్యం మీకు
ఇకమీదట ఏ వాదాలు
సిద్ధాంతాలు ఉండవు
చివరకు మీ ఓట్ల చీట్లాటలో
ప్రజలను మర మనుషులుగా
మిగిల్చిపోతున్నారు

స్పందన

# టూల్ కిట్

– శ్రీశైలం నూకాచారి

**సుమారు** మూడు నెలలుగా ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమం నిరంతరం సమాజం దృష్టిని ఆకర్షిస్తూ ప్రభుత్వం చేసిన రైతు చట్టాల డొల్లతనాన్ని ప్రశ్నిస్తూనే ఉంది. ఈ ఉద్యమాన్ని ప్రపంచం దృష్టిలోను ఈ దేశ ప్రజల దృష్టిలోను పలుచన చెయ్యాలన్న ప్రభుత్వ ఉద్దేశ్యం ఏవిధంగాను నెరవేరడంలేదు. రైతు ఉద్యమంలో సంఘ విద్రోహ శక్తులున్నాయని, ప్రతిపక్ష పార్టీల కుట్రని, ఖలిస్థాన్ తీవ్రవాదులున్నారని, ఉద్యమం పక్కదారి పడుతుందనే అపోహలను రకరకాలుగా బిజెపి ఐటి సెల్ ప్రచారం చేస్తున్నా రైతులు సంఘటితంగా వాటిని తిప్పికొట్టారు. దీనితో మరింత దిగజారిన ప్రభుత్వం మరిన్ని కుట్రలు చెయ్యడం మొదలుపెట్టింది.

రైతులు జనవరి 26న తాము ట్రాక్టర్ ర్యాలీ చేస్తామని ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. మరి ఉద్యమంపై ఇన్ని అనుమానాలున్న ప్రభుత్వం జనవరి 26 ప్రాముఖ్యత తెలుసు కాబట్టి, త్రివిధ దళాధిపతులు, దేశ విదేశ ప్రముఖులు హాజరయ్యే ప్రదేశం కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే అన్ని చర్యలు తీసుకుంటుందని సామాన్యులమైన మనం ఊహిస్తాము. కాని జనవరి 26న జరిగిందేమిటి? రైతు ర్యాలీ కంటే ముందు ఒక వింగ్ డైరెక్టుగా ఎర్రకోట వద్దకు వెళ్లి అక్కడ గుమ్మటంపై జెండా ఎగురవేసారు. అదీ అత్యంత ముఖ్యమైన జాతీయ పండుగరోజున. ఇది మన రక్షణ వ్యవస్థ లోపమా లేదా ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతోనే జరిగిందా అనే ఆలోచన ప్రజలందరిలోను కలిగింది. జనవరి 26న తీవ్రవాదుల భయంతో పటిష్టమైన రక్షణ వలయాన్ని ప్రభుత్వం ఏర్పరుస్తుంది. ఎవరి సహకారం లేకుండానే కొంతమంది మామూలు ట్రాక్టర్లతో వెళ్లారు. ముందు నుండి ప్రభుత్వం ఉద్యమంలో సంఘ విద్రోహ శక్తులు ఉన్నాయని చెబుతున్నా ఈ పని అతి సులభంగా జరిగిపోయింది.

దీని వెనుక కుట్రదారులు ఎవరన్నది ప్రజలందరికి అర్థమైనా, ప్రభుత్వం మరింత బరితెగించి, హోమ్మినిస్టర్ అమిత్‌షా అదుపులో ఉండే పోలీసులు ప్రజల భావోద్వేగాలతో ఆడుకునేందుకు అద్భుతమైన కథ వండి వార్చారు. అదే "టూల్ కిట్" వ్యవహారంలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారిణి దిశా రవిని అరెస్టు చేయడం.

క్రితం నెల (జనవరి 2021) ప్రజాసాహితిలో వచ్చిన వ్యాసం "హిందూత్వ తీవ్రవాదులు డిజిటల్ నేరాలకు పాల్పడుతున్నారా?" గుర్తుకు తెచ్చుకోండి. దిశా రవి దేశద్రోహం కేసు మరింత సులువుగా అర్థమౌతుంది.

"అమెరికాలో" స్వేటింగ్' అనబడే ఆకాశరామన్నల చేత తాము వేధించ దలచుకున్నవారిపై మిలటరీ సాయుధ పోలీసులను ఉసిగొలిపే నూతన డిజిటల్ నేరాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వాస్తవంగా జరగని ఒక హింసాయుత నేరం జరిగినట్టు పోలీసులకు ఒక అబద్ధపు సమాచారం అందుతుంది. వెంటనే సాయుధ మిలటరీ పోలీసుదళం రంగంలోకి దిగుతుంది. నేరం జరిగిందని ఆరోపించబడిన ఇంటిపై సాయుధ దళం చుట్టుముట్టి తలుపులు తెరవకపోతే కాల్పులు జరుపుతుంది. సాధారణంగా ఇందులో అమాయకులు మరణించడం అనేది అన్ని కేసులలో జరగదు. కానీ వ్యతిరేకులను వేధించడానికి ఇది ఒక ఆయుధం." భీమా కోరెగావ్ కేసులో జరిగిన అరెస్టులు కూడా ఈ కోవలోకే వస్తాయి.

దిశా రవి 21 సం॥ ఎం.బియ్యే విద్యార్థిని. రైతు కుటుంబ నేపథ్యం, పర్యావరణ ఉద్యమ కార్యకర్త, ప్రపంచవ్యాపిత పర్యావరణ సంక్షోభానికి ప్రపంచ నేతలే కారణమని ఐక్యరాజ్యసమితి నుద్దేశించి మాట్లాడిన పర్యావరణ పోరాట యోధురాలు గ్రేటా థన్ బర్గ్‌తో కలిసి "ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్" సంస్థ వ్యవస్థాపకురాలు. వీరితోపాటు న్యాయవాది అకిత జాకబ్ మరియు శంతను ములుకులు కలిసి భారతదేశంలో జరుగుతున్న రైతు ఉద్యమం మరింతగా ప్రజల దృష్టిలోకి – ప్రపంచవ్యాపితంగా ఈ ఉద్యమానికి మద్దతు కూడగట్టడానికి ఏం చెయ్యాలని ఒక కార్యాచరణ ప్రణాళిక తయారుచేసారు. దానినే "టూల్ కిట్" అంటున్నారు.

జాతీయంగా, అంతర్జాతీయంగా రైతాంగ ఉద్యమానికి మద్దతు తెలుపాలనుకున్న, వాళ్ళు ఏయే రూపాల్లో తమ అభివ్యక్తిని ప్రకటించవచ్చో తెలియజేసే ఒక 'టూల్ కిట్' ఉపకరణం లేదా సాధనం అని అర్థం. ఆయుధం అని కాదు. దానిని ఇక్కడ మిత్రులకు పంపడం, రైతులకు మద్దతుగా పనిచేయడం కోసం ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చెయ్యడం అనేది దిశా రవి, ఆమె మిత్రులు చేసిన కుట్రగా పోలీసులు అంటున్నారు.

భారతదేశంలో రైతుల నిరసన గురించి తెలియనివారికి అవగాహన కలిగించే ప్రయత్నం ఇది. 2015-16 వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం భారత దేశంలో 86% భూములు చిన్న, సన్నకారు కమతాలు వీరి ఆదాయాలు ఇప్పటికే అతిస్వల్పం. అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు ఈ చిన్న సన్న "కారు" రైతులే వెన్నెముకగా నిలబడి ఉన్నారు. అయినప్పటికీ పాలకుల రైతు వ్యతిరేక విధానాల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయి ఇప్పటికే వేలాది మంది రైతులు

ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ కొత్త వ్యవసాయ చట్టాల వల్ల ప్రజల రైతుల కష్టాలు మరింత పెరుగుతాయి. ఈ చట్టాల వల్ల దేశ ప్రజల జీవితాలు కార్పోరేటు సంస్థలచే శాసించబడతాయి. అందువల్ల ఈ చట్టాలు రద్దుచేయాలి. దానికోసం మీ మద్దతును ట్వీట్ చేయండి. ప్రభుత్వ ప్రతినిధులకు కాల్ చెయండి. పిటిషన్స్ వేయండి. మీ దగ్గరలోని ఇండియన్ ఎంబసి, మీడియా హౌసులలో, స్థానికంగా కార్యక్రమాలు చేపట్టండి. సోషల్ మీడియాలో ప్రచారం చెయ్యండి. ఇటువంటి అంశాలే ఉన్నాయి. ఇంచుమించుగా ఇవే "టూల్ కిట్ అంశాలు".

ప్రజల ఆలోచనలని, ప్రశ్నించేతత్వాన్ని అణిచివేయాలని నిరంతరం ప్రయత్నిస్తున్న పాలకవర్గాలకు ఈ టూల్‌కిట్‌ను ప్రసార మాధ్యమాల ద్వారా పంచుకున్నట్లు తెలిసింది. తీవ్రవాది కసబ్‌తో పోలుస్తూ కేంద్ర హోంమంత్రి అదుపులోని ఢిల్లీ పోలీసులు ఆగమేఘాలపై బెంగుళూరు వచ్చి దిశా రవిని అరెస్టు చేశారు.

ఈ విషయంలో స్థానిక మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవడంగాని, దిశా రవికి లాయర్‌ని ఏర్పాటుచేసుకునే అవకాశం కల్పించడం లాంటి కనీస న్యాయపరమైన అవకాశాలు ఇవ్వలేదు. ఇంకా విచిత్రమేమిటంటే దిశా రవిని ఢిల్లీలోని పాటియాలహౌస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా కనీసం ప్రాథమిక ఆధారాలున్నాయా అని విచారణ కూడా లేకుండా ఆమెను 5 రోజులు పోలీస్ కస్టడీకి పంపించారు.

ఇక బిజెపి ఐటి సెల్ హెడ్ అమిత్ మాల్వియా ఆధ్వర్యంలో పుంఖాను పుంఖాలుగా – దేశద్రోహ నేరం – ఖలిస్థాను ఉగ్రవాదులతో సంబంధం – జనవరి 26న ఎర్రకోటపై దాడి కుట్ర – దేశ సార్వభౌమత్వాన్ని అవమానించడమనే భావోద్వేగాలు రేపెట్టి అసలు విషయం గ్రహించకుండా సామాన్య ప్రజలతోపాటు మేధావులను గందరగోళపరిచారు. ప్రభుత్వ అనుకూల మీడియా బాగా ప్రచారం చేసింది.

21 ఏళ్ల యువతి, యం.బి.యే విద్యార్థిని, పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారిణి అవతారం నుండి దిశా రవి ఒక్కసారిగా దేశద్రోహిగా మారిపోయింది. ఆమె చేసిన నేరమల్లా ఒకటే ఈ దేశపు పౌరురాలిగా, ఒక సామాజిక కార్యకర్తగా బాధ్యతగా స్పందించడమే. ఉద్యమిస్తున్న రైతులకు గ్రేటా థన్‌బర్గ్ విడుదల చేసిన "టూల్ కిట్"ను షేర్ చెయ్యడమే. ఆమె దేశద్రోహిగా మారిపోయింది. తనకు ఏ పాపము తెలియదని, తను ఏ కుట్ర చేయలేదని ఆ అమ్మాయి న్యాయస్థానం ముందు కన్నీళ్ళు పెట్టుకుంది. రైతుల పక్షాన మాట్లాడటమే నేరమైతే నేను నేరం చేశానని నిక్కచ్చిగా చెప్పింది. దేశ ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం శ్రేయస్సు కోరడం ఒక పెద్ద నేరం. ఒక పెద్ద కుట్ర. దాదాపు దేశమంతా బిత్తరపోయింది. ప్రజల పక్షాన నిలబడే మేధావులు, హక్కుల కార్యకర్తలు, ప్రజాస్వామికవాదులు, రైతు నేతలు ఆమె అరెస్టును ముక్తకంఠంతో ఖండించారు. ఇది అక్రమం, అప్రజాస్వామికమని నినదించారు. కాని ఈ నిరంకుశ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు.

తనకు భిన్నమైన ప్రతి ఆలోచనా దేశద్రోహంగా చిత్రించడం వారికి పరిపాటిగా మారింది. నిజాన్ని సమాధి చేసేందుకు సర్వాధికారాలని గుప్పెట పెట్టుకున్న ప్రధాని "కాలం చెల్లిన చట్టాలు ఈ కాలానికి పనికి రావని నోటితో చెబుతూ బ్రిటీషువాడి దేశద్రోహ చట్టాన్ని (ఇది బ్రిటన్‌లో రద్దు చేయబడింది) తమను విమర్శించేవారిపై ప్రకటిస్తున్నారు.

సి.ఎ.ఎ. చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాపిత ఆందోళన సందర్భంగా షాహిన్‌బాగ్ ఉద్యమంలోను దేశద్రోహం నేరం కేసులు పెట్టారు. భీమా కొరెగావ్ కేసులోను పోలీసులకు కావలసిన రుజువులు మాల్వేర్ రూపంలో లాపుటాపుల్లోకి రహస్యంగా చొప్పిస్తారు. చిత్రంగా న్యాయస్థానాలు కూడా ఈ అడ్డగోలు అరెస్టులను ప్రశ్నించడంలేదు.

మానవహక్కుల నుండి ఆహారభద్రత వరకు ఏది అడిగినా దేశద్రోహమే.

ఢిల్లీలో తాను పనిచేస్తున్న ఫ్యాక్టరీలో మహిళా కార్మికులపై జరుగుతున్న అఘాయిత్యాలను బయటపెట్టిన 'నవదీప్‌కౌర్' అనే దళిత యువతి రైతు ఉద్యమానికి మద్దతు ప్రకటించినందుకు జైలు పాలై పోలీసుల అత్యాచారానికి గురవుతున్న విషయం అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సోదరి కుమార్తె మీనా హారిస్ ఇటీవలే పోస్టు చేసిన విషయం తెలిసిందే.

అయితే సుప్రీంకోర్టు మాత్రం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం దేశద్రోహం కాదని, దిశా రవి షేర్ చేసిన "టూల్ కిట్" విధ్వంసకర ఆయుధం కాదని అందులో దేశ సమగ్రతకు నష్టం కలిగించే అంశాలు ఏవీలేవని దిశా రవిని బెయిల్‌పై విడుదల చేసింది.

మరయితే ఈ కేసు ఈవిధంగా ముగుస్తుందని ప్రభుత్వానికి పోలీసులకు తెలియదా? తెలిసీ కనీసం ప్రాథమిక ఆధారమైనా లేకుండా ఈ కేసు ఎందుకు పెట్టరు?

ఆలోచనలు, అణిచివేసి, ప్రశ్నించేతత్వాన్ని చిదిమేయటమే పాలకుల లక్ష్యం. అందుకోసం అవసరం అయితే ఈ పాలకులు చరిత్రలో కప్పెట్టబడిన క్షుద్ర చట్టాలకు ప్రాణం పోస్తారు. లేదా దేశాన్ని అమ్మివేయడానికి రైతు చట్టాల లాంటి నూతన చట్టాలు తెస్తారు. అవసరాల మీద నుండి అనవసరాలకి, వాస్తవాల నుండి భావోద్వేగాల మీదకు దృష్టి మరలిస్తారు. ప్రజల్ని మూఢత్వంలో ముంచుతారు.

దిశా రవి, నవదీప్ కౌర్ వంటివారు ఈ దేశ యువతకు ప్రతినిధులు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ప్రతినిధులు వారిని అరెస్టు చెయ్యడం ద్వారా దేశద్రోహం లాంటి అమానవీయమైన ఆరోపణ చెయ్యటం ద్వారా ఈ దేశపు యువతకి ఈ పాలకవర్గాలు హెచ్చరిక చేయదలచుకున్నాయి. వారిని తమకు వ్యతిరేకంగా ఎటువంటి ఉద్యమంలోకి సమీకరింప బడకుండా చేయబూనుకున్నాయి.

కాని దిశా రవి విషయంలో దేశం యావత్తు ఆమె వెనుక, నిలిచిన వాస్తవం ప్రజలందరూ ముఖ్యంగా యువత గమనించారు. సామాజిక మాధ్యమాల ద్వారా, ఉద్యమాల ద్వారా తమ తీవ్ర వ్యతిరేకత వెళ్ళగక్కారు.

మేధావులను, ప్రశ్నించేవాళ్ళను యువతను అణిచవేయాలని ఉద్యమాన్ని మింగేయాలని పాలకులు ఆశించవచ్చు. కాని అది అసాధ్యం అని ప్రస్తుత పరిణామాలు తెలియజేస్తున్నాయి. ✺

# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## 1991 మార్చి సంచిక : 8; సంపుటి : 14

**'దిన్‌మాన్ టైమ్స్'** పత్రికలో సుబ్బో ముఖర్జీ వేసిన 'నిర్భాగ్యుడి దేహంపై ఆశలన్నీ గాయాలు' ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. పాఠకుల స్పందనలతో నిండిన 'ఇది మీ పేజీ....' శీర్షికలో గత నెలలలో వచ్చిన మతతత్త్వ వ్యతిరేక పోరాట సంచికపై అభిప్రాయాలను, "పతన విలువలకు పరాకాష్ట – పాలకవర్గ రాజకీయ సంస్కృతి" అనే శీర్షికతో సంపాదకీయం ప్రచురించారు. భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్యోద్యమ మృతవీరుల ఆశయాలూ, అంతర్జాతీయ మహిళా దీక్షాదినపు ఆవేశమూ ఆవాహన చేసుకుని సమైక్యంగా ఉద్యమించాలని, అదే నేటి సాహిత్య సాంస్కృతిక కర్తవ్యమని చాటుతూ. ముఖచిత్ర కవితను ఎం. విజయభాస్కర్ రాశారు. యుద్ధవాదం.... సామ్రాజ్యవాద ముద్దుబిడ్డగా ప్రకటిస్తూ క్రాంతికిరణ్ రాసిన 'జయహో సద్దాం' బుషే 'న్!' అనే వ్యంగ్య రచనని ప్రచురించారు. "రెండు ప్రశ్నలు" అనే కవితను సుధాకిరణ్, 'సూపర్ పవర్స్' అనే కవితను భూమి రాశారు. 'జనం పాటలు' శీర్షికలో ఉదయ్ రాసిన 'ఎడారి ఇసుకలో అమెరికా' పాటను, శశి రాసిన, 'సాగదురా, అమెరికోడా' పాటను దివికుమార్ రాసిన 'ఒకటేరా' పాటను, పి. రాములు రాసిన మతం మంటలు పాటలను ప్రచురించారు. 'కరపత్రాలు – కదిలేచరిత్ర' శీర్షికలో "మార్చి 23 షహీద్ భగత్‌సింగ్ 60వ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించండి!' అని PDSU, DSO, PDSU(విజృంభణ), YOC, PYC రాష్ట్ర సంఘాలు విడుదల చేసిన కరపత్రాన్ని ప్రచురించారు. షహనాజ్, న్యూఢిల్లీ కళాకారిణి వేసిన 'బుష్ కరాళ నృత్యం' చిత్రాన్ని ప్రచురించారు. 1991 ఏప్రిల్ 13, 14న ఆంధ్ర సారస్వత పరిషత్ హాల్, హైదరాబాద్‌లో కె. శ్రీనివాస్, వి. రామమోహన్, ఆర్. సుదర్శన్‌లు ఆధ్వర్యంలో నిర్వహించబడిన 'కవి సమయం' పరిచయ పత్రం కవితా సదస్సు ఆహ్వానాన్ని ప్రచురించాడు. 'వాడని మందారాలు' శీర్షికలో 'ప్రాణం ఖరీదు' సినిమా నుండి జాలాది రచించిన 'ఏతమేసి తోడినా....' పాటను ప్రచురించారు. 1990 – కలకత్తాలో జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 51వ మహాసభల కార్యదర్శి నివేదిక నుండి కొంత భాగాన్ని ప్రచురించారు. కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'మానవత మాసినచోట' కథనూ, 'స్పందన' శీర్షికలో 'హెయిల్ హిట్లర్ జాడల్లో జై శ్రీరామ్' అని సుదీష్ పచౌరీ పంచుకున్న అభిప్రాయాలూ, కవితలు శీర్షికలో 'కర్ఫ్యూకి అటూ ఇటూ' – సుంకిరెడ్డి, సరికొత్త అమెరికా – ఈనాటి రష్యా!' అని భాస్కర్‌భట్‌గారి స్పందనలు వున్నాయి. నారాయణరెడ్డి రాసిన కవిత, 'విశ్వాసం నుండి విచికిత్సకు' – శివలింగం రాసిన కవిత, ఖాదర్ మొహియుద్దీన్ అనువదించిన అవతార్‌సింగ్ పాష్ ప్రసిద్ధ కవిత 'ధర్మదీక్షా నివేదన'నూ, రాల్ఫ్ ఫాక్స్ రాయగా కొత్తపల్లి రవిబాబు అనువదించిన 'నవల – ప్రజలు' ధారావాహిక నాల్గవ అధ్యాయం, 'నవల – వాస్తవికత'ను ఈ సంచికలో ప్రచురించారు. దేవీప్రియ కవితాసంపుటి 'నీటిపుట్ట'ను పాణిగ్రాహి 'పుస్తక సమీక్ష' శీర్షికలో సమీక్షించారు. 'ముఖచిత్రం' అనే కవితను సూర్యచంద్రరావు రాశారు. బి. రామానాయుడు రాసిన 'మన గురించి' కవితను, 'గల్పిక' శీర్షికలో శ్రీకృష్ణ రాసిన 'ఐ.యమ్.ఎఫ్.గడ్డి' అనే రచనను ప్రచురించారు. మతతత్త్వ వ్యతిరేక పోరాట సంచికపై వివిధ దినపత్రికలలో వచ్చిన స్పందనలను, ఫిదాయి రాసిన 'మరో జాతీయోద్యమం' అనే వ్యాసమూ ఈ సంచికలో ప్రచురించారు. 1/8 డెమ్మీలో 64 పేజీలు. వెల : రూ.4/-


ఈ నెల పుస్తకం




# మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ

## అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం

## దేశంలో సాగుతున్న రైతుల పోరాటం ఎందుకు?

### రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ప్రచురణ

**సెప్టెంబర్** 2020, కరోనా కాలంలోనే ప్రభుత్వం పార్లమెంటు సమావేశాలను నిర్వహించి, ఆర్డినెన్స్‌కు బదులుగా వ్యవసాయరంగంలో చట్టాలను ప్రవేశపెట్టింది. పార్లమెంటరీ సాంప్రదాయాలన్నింటినీ ప్రక్కనపెట్టి ఏ విధమైన చర్చలు లేకుండా వ్యవసాయరంగంలో రైతాంగ వ్యతిరేక మూడు చట్టాలను – వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్య చట్టం, ధరల భరోసా, వ్యవసాయ సేవకులకు సాధికారత, రక్షణ కల్పించే కాంట్రాక్టు ఒప్పంద చట్టం లేదా ఒప్పంద వ్యవసాయ చట్టం, నిత్యావసర సరుకుల చట్టం 1955కు సవరణగా చట్టం, వీటితోపాటుగా విద్యుత్‌బిల్లు 2020 చట్టాలను తెచ్చారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం అయిదు నెలలకు పైగా ఢిల్లీలో ఉద్యమిస్తున్న విషయం అందరి దృష్టిలోనూ వుంది.

దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఈ మూడు చట్టాలు వల్ల రైతాంగం, దేశ ప్రజలు ఎదుర్కోబోయే విషమ పరిస్థితుల గురించీ, రైతాంగ సమస్యలకు పరిష్కారాలను చూపుతూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధ సంస్థ ప్రచురించిన పుస్తకం ఇది. 1/8 డెమ్మీలో 40 పుటలు. వెల : 10రూ॥లు.

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ – 520002. ఫోన్ : 86393 14662**

# చైతన్యవాహిని

## నేత్ర, శరీరదాత కుమారి గరికపాటి కీర్తివెన్నెల సంస్మరణసభ

పుట్టుకతో వచ్చిన మధుమేహ వ్యాధితోనూ, దానితోపాటు పెరిగిన ఇతర రుగ్మతలతోనూ ధైర్యంగా 20 ఏళ్ళపాటు పోరాడి, గరికపాటి కీర్తివెన్నెల ఈనెల 18వ తేదీన మరణించింది. ఆమె కోరిన ప్రకారమే, కుటుంబ సభ్యులు ఆమె కళ్ళను ఐ బ్యాంక్‌కు, శరీరాన్ని కాటూరి మెడికల్ కళాశాలకు అప్పచెప్పారు.

కళ్ళనూ, శరీరాన్నీ దానం చేసిన కీర్తివెన్నెల సంస్మరణసభ జనవరి 31 ఆదివారం ఉదయం తెనాలిలోని తాడిపర్తి వెంకటరత్నమ్మ కళ్యాణ మండపంలో జనసాహితి కవి, రచయిత చందు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. నాస్తిక సమాజం కార్యకర్త శివకృష్ణ ముందుగా సభాపరిచయం చేశారు. కంచర్ల శేష ప్రారంభగీతం పాడారు.

అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘ వ్యవస్థాపకులు, హైదరాబాదు వాస్తవ్యులు గంజి ఈశ్వరలింగం ప్రసంగిస్తూ రక్త, నేత్ర, అవయవ, శరీరదానాల గురించి వివరించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డా॥ సనత్‌కుమారి మాట్లాడుతూ కీర్తివెన్నెలకు అందిన వైద్య సహాయాన్ని వివరించారు. రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షురాలు యం. భానుమతి రక్త, శరీరదానాల ప్రాముఖ్యతను చెప్పారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మోపర్తి అబ్రహం లింకన్, తమ విద్యార్థిని ఐన కీర్తివెన్నెల వైద్య వృత్తిలో రాణించాలని కృషిచేసిందన్నారు. డా॥ కృష్ణారావు తాము కీర్తివెన్నెలకు చేసిన వైద్యం గురించి వివరించారు. 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు కీర్తివెన్నెల తాతగారైన నందూరి నారాయణరావు కుటుంబం నాలుగు తరాలుగా హేతువాదులుగా వున్నారనీ, ఇది చాల అరుదైన విషయమనీ చెప్పారు. జన విజ్ఞాన వేదిక కార్యకర్త గాలంకి సుబ్బారావు – మన మత సంస్కృతి శరీర దానానికి అడ్డంకిగా నిలుస్తోందనీ, ప్రజలలో భావ చైతన్యం తేవాలనీ అన్నారు. కీర్తి వెన్నెల మామయ్య అజయ్, మొదలగువారు ప్రసంగించారు.

**24-01-2021న** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించిన అంతర్జాల సదస్సులో 'ప్రజాసాహిత్య ఉద్యమకారుడు సి.వి.పై 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడారు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు.

**14-2-2021, ఈమనిపాలెం :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన 3 వ్యవసాయ చట్టాలను వెంటనే రద్దుచేయాలని జనసాహితి ప్రకాశంజిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ చట్టాల రద్దు కోసం ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి సంఘీభావంగా జిల్లాలోని రచయితలు – ప్రజాతంత్రవాదులు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. జనసాహితి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్ నుండి మిరియాలపాలెం, చర్చి సెంటర్ మీదుగా ప్రకాశం భవన్ వరకు సాగింది.

ప్రదర్శన ముగింపు సందర్భంగా జనసాహితి జిల్లా అధ్యక్షులు డా॥ జి.వి. కృష్ణయ్య మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అని చెప్తూనే రైతు వెన్ను విరిచే చట్టాలను పాలకులు చేశారని విమర్శించారు. చట్టాలు రద్దయ్యేవరకు రైతుల ఉద్యమానికి జనసాహితి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం జనసాహితి జిల్లా నాయకులు, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య మాట్లాడుతూ ఈ దేశంలో రైతు ఒంటరివాడు కాదనీ; కార్మికులు, రచయితలు, మేధావులు అందరూ రైతు ఉద్యమానికి బాసటగా ఉన్నారని స్పష్టం చేశారు. ఇలాంటి కార్పోరేట్ అనుకూల చట్టాలను తిప్పికొట్టకుంటే రైతు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ప్రదర్శనకు జనసాహితి రాష్ట్ర కోశాధికారి డా॥ శాంతికుమార్, జిల్లా నాయకులు డి.వి., ఏసుదాసు, కనకరత్నాచారి తదితరులు నాయకత్వం వహించారు. ప్రముఖ రచయితలు నూకతోటి రవికుమార్, మంచికంటి, రాజ్యలక్ష్మి, నబీ కె ఖాన్, ఎజ్రా శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

2021 ఫిబ్రవరి 13, 14 తేదీలలో చార్వాకాశ్రమంలో 29వ నాస్తికమేళాలో జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ మొదటిరోజున ప్రారంభోపన్యాసం ఇస్తూ గడచిన ఏడాది కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతరదేశాలలోనూ సంభవించిన సామాజిక, రాజకీయ పరిణామాలను హేతుబద్ధంగా విశ్లేషించారు. కరోనాను ఏ మతమూ నిలువరించలేకపోయిందనీ, పైపెచ్చు గుడులు, చర్చీలు, మసీదులు మూతబడ్డాయనీ, శాస్త్రవిజ్ఞానమే మన ఆరోగ్యాన్ని సంరక్షించగల్గిందని ప్రజలకు ఋజువైందన్నారు. కరోనాను అడ్డం పెట్టుకుని, బిజెపి ప్రభుత్వం అహేతుకమైన వ్యవసాయ చట్టాలను చేసిందనీ, వాటి రద్దుకై రైతాంగం ఢిల్లీని ముట్టడించిన వివరాలు ప్రస్తావించారు. చార్వాక రామకృష్ణ చెప్పినట్లు ఆర్థిక, సాంస్కృతిక విప్లవాల ఆవశ్యకతను వివరించారు.

ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేశ్ పట్నాయక్ 'జాతీయ విద్యావిధానం – 2020 – విశ్లేషణ' అనే అంశంపై మాట్లాడుతూ ఈ డాక్యుమెంటులో వున్న అశాస్త్రీయమైన విషయాలను వివరించారు. ఇది పరోక్షంగా, బిజెపి నమ్మిన మతతత్త్వ వాదనలను సమర్థించేదిగా వుందన్నారు. ప్రముఖ నాస్తికులు గొంది మాధవరావు 'బైబిల్ బండారం'పై మాట్లాడారు. 'ప్రగతి నిరోధక భావజాలం – ప్రజాస్వామికవాదుల కర్తవ్యం'పై ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ చింతకింది కాశీం మాట్లాడుతూ పాలకవర్గాలు తమకు నచ్చని భావజాలాన్ని ప్రచారం చేసేవారందరినీ దేశద్రోహుల ముద్రవేసి అణచివేత చర్యలు చేపడుతోందన్నారు. డా॥ బి.వి. రాఘవులు 'కులభావనే కుసంస్కారం' అనే అంశంపై మాట్లాడుతూ ఈనాడు ప్రబలిపోతున్న కులగజ్జి గురించి వివరించారు. సమతా శ్రీధర్ నిత్య జీవితంలో ఆచరణలో హేతువాదులు ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కారాలను వివరించారు. నాస్తిక సమాజం కార్యవర్గసభ్యుడు లతీఫ్ కార్యదర్శి నివేదికను ఇచ్చారు.

14వ తేదీన న్యూ సోషలిస్టు ఇనిషియేటివ్ నాయకులు జి. భార్గవ, 'పెట్టుబడి విసురుతున్న సవాళ్ళు – కార్మికవర్గం ముందున్న కర్తవ్యాలు'

**(తరువాయి 50వ పేజీలో)**




**బ్లాక్ బోర్డు – కవితా సంపుటి :** రచయిత : ఎర్రోజు వెంకటేశ్వర్లు

యాభైఏడు కవితలతో శ్రామిక ప్రజల జీవన విధానాలని తెలియచేసిన కవితాసంపుటి.

1/8 డెమ్మీలో 98 పుటలు. వెల : రూ. 100/– ప్రచురణ : జూన్ 2020. ప్రతులకు : ఇ. జ్యోతిర్మయి, 2–231/6, సూర్యనగర్ – 3, సీతారాంపూరు, కరీంనగర్‌జిల్లా, తెలంగాణ – 94925 57037.

**ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు (1952–2020) :** రచయిత : డి.వి.వి.ఎస్. వర్మ.

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు పేరుతో వచ్చిన ఈ పుస్తకంలో డి.వి.వి.ఎస్. వర్మగారు పౌరసమాజం మీద ఆధిపత్యాన్ని పొందే ప్రక్రియగా హెజమనీ సిద్ధాంతాన్ని ఆవిష్కరించిన మేధావి ఆంటోనియో గ్రాంసీ భావజాలాన్ని అన్వయిస్తూ, విశ్లేషిస్తూ రాశారు.

1/8 డెమ్మీలో 70 పుటలు. వెల : రూ. 30/– ప్రచురణ : 2020 ఆగస్టు. ప్రతులకు : డి.వి.వి.ఎస్. వర్మ, 34–20–3, బొమ్మలవీధి, తణుకు – 534211.

**ఈస్తటిక్ స్పేస్ :** దగ్గుమాటి పద్మాకర్ కథలు; రచయిత : దగ్గుమాటి పద్మాకర్.

పద్మాకర్ 1993 నుండి 2018 వరకూ రాసిన 17 కథల సంపుటి ఇది. ఆయన ఈ కథల్లో తాను చూసిన జీవితానుభవాల్ని, పాఠకులకు వివరిస్తూ, ఆ, ఆ సందర్భాలలో వ్యవహరించవలసిన తీరు తెన్నులను, పాఠకులు ఎలా ప్రతిస్పందించాలో దారిచూపినట్లుగా సాగుతాయి.

1/8 డెమ్మీలో 160 పుటలు. వెల : రూ. 200/– ప్రచురణ : జనవరి 2019. ప్రతులకు : సిక్కోలు బుక్ ట్రస్టు, శ్రీకాకుళం – 532001. ఫోన్ నెం : 99892 65444.

**మాతృభాష మహాత్ముడి మాట :** రచయిత : డా॥ జి.వి. పూర్ణచందు.

వందేళ్ళక్రితం మాతృభాష గురించి మహాత్మాగాంధీజీ సంభాషించిన అభిప్రాయాలను నేటి పరిస్థితులకు అన్వయిస్తూ రాసిన పుస్తకం ఇది.

1/8 డెమ్మీలో 56 పుటలు, వెల : రూ. 50/– ప్రచురణ : 30 జనవరి 2020.

ప్రతులకు : ప్రపంచ తెలుగు రచయితల సంఘం, సత్నాం టవర్స్, 1వ అంతస్తు, రాజగోపాలాచారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ – 520002. ఫోన్స్ : 94401 72642, 94401 67697.

**బదర్ – అబాబీలు :** రచయిత : షేక్ కరీముల్లా

అబాబీలు అనే నూతన వచన కవితా ప్రక్రియ ద్వారా కరీముల్లా ఈ కవితాసంపుటిని తెచ్చారు. అబాబీలు అనే ఈ కొత్త ప్రక్రియలో అయిదు పంక్తులు వుంటాయి. సమస్య, విషయ విశ్లేషణ, వివరణ, ఆత్మాశ్రయం, సందేశం అనే వరుస క్రమంలో అబాబీ సాగుతుంది. ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక విలువలకు ఊపిరాడటమే నా సాహిత్య లక్ష్యం అని రచయిత ప్రకటించుకున్నారు.

1/8 డెమ్మీలో 40 పుటలు, వెల : రూ. 40/– ప్రచురణ : అక్టోబర్ 2019. ప్రతులకు : షేక్ మషరున్ W/o షేక్ కరీముల్లా, 21–55, పెద్ద మసీదు బజారు, వినుకొండ (పోస్టు) గుంటూరుజిల్లా – 522647, ఫోన్ : 94415 02990.

**నానీల మణిహారం :** రచయిత : డా॥ ఎం. దేవేంద్ర.

తెలంగాణ జీవన నేపథ్యాన్ని కవితావస్తువుగా తీసుకుని దేవేంద్ర ఈ నానీలను రాశారు. ఈ నానీలను ప్రతినెలా మూసీ సాహిత్య మాసపత్రికలో ప్రచురించారు. ఇది ఆమె తొలి కవితాసంపుటి.

1/8 డెమ్మీలో 40 పుటలు, వెల : రూ.60/– ప్రచురణ : డిసెంబరు 2018.

ప్రతులకు : శ్రీ చందన మారోజు, 12–5–35/ఎ/9, 4ఎఫ్6, బల్లాడ్ ఎస్టేట్, తార్నాక, సికిందిరాబాద్ – 500017, తెలంగాణ. ఫోన్ : 94906 82457.

**అక్షర కింకిణులు – సాహిత్య వ్యాసాలు :** రచయిత : ఎస్.ఆర్. పృథ్వి

అక్షర కింకిణులు 13 సాహిత్య వ్యాసాల సంపుటి.

1/8 డెమ్మీలో 76 పుటలు. వెల : రూ.80/– ప్రచురణ : నవంబరు 2019. ప్రతులకు : శ్రీమతి పి. ఉషారాణి, 3–866, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణానగర్, రాజమహేంద్రవరం – 53101.

**ఊయల – బాలగేయాలు :** రచయిత : గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ

39 గేయాలను బొమ్మలతో ముద్రించిన పుస్తకం ఇది.

1/8 డెమ్మీలో 68 పుటలు. వెల : రూ.80/– ప్రచురణ : జనవరి 2020. ప్రతులకు : గుళ్ళపల్లి కవితా కాంతికృష్ణ, 16–16, చేర్యాల, సిద్ధిపేటజిల్లా, ఫోన్ : 94900 03295. **(ఇంకా వున్నాయి)**

---

**(49వ పేజీనుండి)**

అనే అంశాన్ని వివరిస్తూ, ఎన్ని లక్షల జీతగాడైనా ఒక యజమాని కింద పనిచేసే ప్రతివాడూ కార్మికుడేనన్నారు. రైతులు, వృత్తిపనివాళ్లు సంఘటితపడాల్సిన అవసరం వుందన్నారు. డా॥ వి. బ్రహ్మారెడ్డి 'శాస్త్రీయ దృక్పథం'పై ప్రసంగించారు. ఎ. చార్వాకుడు, జిలాని బేగం నాస్తిక హేతువాదుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ప్రజానాట్యమండలి, ప్రజానాస్తిక కళామండలి, ప్రజాకళామండలి, అరుణోదయ కళాకారులు పాటలు పాడారు.

చార్వాక తెలుగు వాచకాలు డి.వి.డి.ని, త్రిపురనేని రామస్వామిపై పుస్తకాన్ని ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గౌరవ్, సుధాకర్ సంపాదకులుగా వెలువడిన "భారతదేశంలో వందేళ్ళ కమ్యూనిజం – చార్వాకాశ్రమ చారిత్రక పరిశీలన" పుస్తకాన్ని విడుదల చేశారు. సమావేశాలకు సిహెచ్. శివారెడ్డి, శ్రీనివాసరావు, ఎం.ఎన్. బుద్ధ మొదలగువారు వ్యవహరించారు. మొదటిరోజు 600 మంది, రెండవ రోజు 400 మంది హాజరయ్యారు.

పాట

# ఆడ బిడ్డల ఘోష వినరండి.... స్త్రీలపై ఈ హింసలాపగ కదలి రారండి....

- దేవి

1. గద్దరెక్కల చప్పుడదిగో - పులుల గాండ్రింపులవిగో
కోయిలమ్మల ఆర్తనాదం - లేడికూనల హాహాకారం

మానవత్వం మచ్చుకైనా - కానరాని రాక్షసత్వం
ఊరకుక్కల తీరులెక్కన - మదము నిండిన మనిషి రూపం
పాలు మరవని పాపలను సైతం....

అయ్యో! కుళ్ల బొడిచే నెత్తుటీ కథనం....




2. రోజుకొక్క తీరులెక్క - దేశమంతా నాల్గుదిక్కుల
బడులు గుడులు పంట పొలములు - రైలు బండ్లు రోడ్లు బస్సులు
ఎక్కడా స్త్రీ జాతికింత - రక్షణిచ్చే జాగ లేదే
మదోన్మాదం మెదడు నిండా - నింపుకున్న పశులమందలు
ఘడియకొక్క ఆడబిడ్డను కాటువేసే కాలనాగులు
పట్టపగలే....
పట్టపగలే చుట్టుముట్టి - పిట్ట తీరుగ మట్టుపెడితే
అడిగేనాధుడెవ్వడూ లేడా... ఆడబతుకిల బుగ్గిపాలేనా....



3. ఈ మనీషా... ఆ నిర్భయ... ఆసీఫా... ఆయేషా..
జ్యోతిసింగ్ ప్రత్యూష దిశలు - ఎందరెందరో పసిడి మొగ్గలు
ఎవ్వారువూ...
ఎవ్వారీ ముద్దుబిడ్డలు... అయ్యో ఎందుకిట్లా బూడిదైనారు...
నెత్తురు ముద్దయ్యే నొకరు - కాలినా కట్టెయ్యే నొకరు
ఎంత నెత్తురు ఏరులైన - ఎవని దాహం తీరదాయే
భోరు భోరుగ....
భోరు భోరుగ గుండె పగలగ - సొగిలి ఏడ్చిరి తల్లిదండ్రులు
ఈ కంటనీరు తుడిచేదెవ్వారు... ఆ కర్కశత్వం ఆగేదెన్నాడు...




4. కులం మతము మద్యపానం - మత్తులల్లో ప్రజల ముంచి
విషపుసంస్కృతి పాదు చేసి - పశుల వాంఛలు పెంపుచేసి
గద్దెనేలే... పెద్దలంతా నేరగాళ్లను పెంచేటోళ్లే
వేదభూమి కర్మభూమి - మాయమాటలు మనకు చెప్పి
ఏ అఘాయిత్యం జరగలేదని - బుకాయించే దొంగ నేతలు
పోలీసుల పహారాలో - అర్ధరాత్రుల అంత్యక్రియలు
బూడిదే మిగిలించినారా... ఈ భరతభూమిని ...
వల్లకాడుగ మార్చివేశారా...




5. ఎంతకాలం ఈ విషాదం - కంటనీరు ఇంకేదెన్నడు
కన్న తల్లులు కడుపు మంటలు - కూల్చితీరును ఈ వ్యవస్థను
అక్కలారా అన్నలారా - మానవత గల మనుజులారా
రేపటి. మన పాపలకై... హింసలేని రోజు కొరకై.
రగిలి రగిలి రాజుకుందాము.. ఈ హింసలాపగ పోరు చేద్దాము



PRAJAA SAAHITHI March, 2021 (TELUGU) Rs. 40/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 52 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI